




ESTD: 1999

www.voodayam.com

# వృదయం








ఆదిలాబాద్ 07-06-2026 ఆదివారం సంపుటి : 13 | సంచిక : 215 SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar, Guntur & Warangal Follow us on


## ఓటమి ద్వారే గెలుపు నేర్చుకోవాలి

**ప్రతి స్కూల్లో స్విమ్మింగ్ పూల్ ఉండేలా చూస్తా**

### గెలుపు కసి నేర్పేదే గ్రౌండ్, మీ పిల్లలనే ఆస్తిగా మార్చండి

**ఏరోసిటీ డిల్లీ పబ్లిక్ స్కూల్లో స్మిమ్మింగ్ పూల్ ప్రారంభోత్సవంలో మంత్రి వాకిటి శ్రీహరి**

**అట్టహాసంగా స్మిమ్మింగ్ పూల్, రన్నింగ్ ట్రాక్, మినీ ఫుట్ బాట్ కోట్ ప్రారంభోత్సవం**



**హైదరాబాద్, జూన్ 6 (వుదయం ప్రతినిధి) :** ప్రతి ప్రభుత్వ పాఠశాలలో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేస్తా మన్నారు మంత్రి వాకిటి శ్రీహరి. విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు మానసిక పరిపక్వతను ఇస్తాయన్నారు. శనివారం హైదరాబాద్ శివారులోని ఏరోసిటీ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో స్విమ్మింగ్ పూల్, రన్నింగ్ ట్రాక్, మినీ ఫుట్ బాల్ కోట్ ను ఎమ్మెల్సీ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ గ్రూప్స్ ఛైర్మన్ మల్క కొమరయ్య , స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఛైర్మన్ శివసేనారెడ్డి, అగ్రికల్చర్ & ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రాకేష్ చంద్ర అగర్వాల్, కన్హాశాంతావనం ఓఎస్డీ ఫర్ డీమ్డ్ టు బి యునివర్సిటీ డాక్టర్ నర్సిరెడ్డితో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. నేటితరం విద్యార్థులు చాలా అదృష్టవంతులన్న మంత్రి వాకిటీ.. మా కాలంలో ఆడుకుందామంటే కొట్టేవారనీ.. ఇప్పుడుతల్లిదండ్రులే దగ్గుండి గ్రాండ్ కి తీసుకెళ్లి ఆటలు ఆడేలా ప్రోత్సాహం ఇస్తున్నారన్నారు. చదువుల్లో గానీ, క్రీడల్లో గానీ విద్యార్థులు మనసు పెట్టి ప్రయత్నిస్తే విజయం మీ ముందు బానిసవుతుందన్నారు. మిగతా 2లో

### జూన్ 8 నుంచి చేప ప్రసాదం పంపిణీ

**పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం**

**విస్తృత ఏర్పాట్లు : మంత్రి వాకిటి శ్రీహరి**

**చేప ప్రసాదం అనేది ప్రజల**

**విశ్వాసంతో ముడిపడి ఉన్న అంశం**

2

## సెమీ కండక్టర్ పరిశ్రమలకు తెలంగాణ అనుకూలం

**ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా మలేషియా కంపెనీలను ప్రోత్సహించండి**

భవిష్యత్తు అవసరాలు, సవాళ్లను ఎదుర్కొనేలా 'ఎకో సిస్టం' అభివృద్ధి

తెలంగాణ ను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది

గ్లోబల్ సెమీకండక్టర్ హబ్‌గా తెలంగాణ ఎదిగేందుకు ఉపయోగపడుతుంది

తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నాం

మలేషియా అత్యున్నత స్థాయి బృందం భేటీలో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, జూన్ 6 (వుదయం ప్రతినిధి) :** సెమీకండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమని... ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా మలేషియా కంపెనీలను ప్రోత్సహించాలని ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా, రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా ప్రపంచస్థాయి సదుపాయాలతో కూడిన సెమీ కండక్టర్ 'ఎకో సిస్టం'ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. మలేషియా – పెనాంగ్ డిప్యూటీ సీఎం వైబీ జగదీప్ సింగ్ దియో నేతృత్వంలోని ఆ దేశ అత్యున్నత స్థాయి ప్రతినిధుల బృందం శనివారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. 'తెలంగాణ– మలేషియా(పెనాంగ్)' మధ్య సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఏఐ, ఇన్నోవేషన్స్, హ్యూమన్ క్యాపిటల్ డెవలెప్ మెంట్ తదితర రంగాల్లో పరస్పర సహకారానికి గల అవకాశాలపై ప్రత్యేకంగా చర్చించారు. చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక రంగాల్లో హైదరాబాద్ అంతర్జాతీయ కేంద్రంగా ఎదుగుతోందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, క్లీన్ ఎనర్జీ, ఏరో స్పేస్, డిఫెన్స్, ప్రెసిషన్ ఇంజినీరింగ్ తదితర రంగాల్లో తెలంగాణలో అపార అవకాశాలు ఉన్నాయన్నారు. 'గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ డెస్టినేషన్'గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున తీసుకుంటున్న చర్యలను వివరించారు. తెలంగాణ ను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్, ప్యాకేజింగ్ రంగాల్లో పెనాంగ్‌కు ఉన్న అనుభవం... గ్లోబల్ సెమీకండక్టర్ హబ్‌గా తెలంగాణ ఎదిగేందుకు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. "తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నాం. ఇరు ప్రాంతాల మధ్య పరస్పర సహకారాన్ని బలోపేతం చేసేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకెళ్తాం" అని వైబీ జగదీప్ సింగ్ దియో పేర్కొన్నారు.



*ఏఐ వల్ల ఉద్యోగాలు పోతున్నాయని ఆందోళనకర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా యువతలో నైపుణ్యం పెంచడానికి తెలంగాణలో అనేక చర్యలు తీసుకున్నట్టు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, పాత పాత సిలబస్‌తో మూస పద్ధతిలో కొనసాగుతున్న ఐటీఐలను అత్యాధునిక టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ)లుగా అప్ గ్రేడ్ చేసిన విషయాలను సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి రూపొందించిన తెలంగాణ రైజింగ్-2047 దార్శనికత, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా రాష్ట్రం ఎదగడానికి నిర్దేశించుకున్న భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు.*

## ప్రత్యామ్నాయాలపై యువత దృష్టి సారించాలి

**అందుకు అవసరమైన పని నిబద్ధతను పెంచుకోవాలి**

**యువతలో నైపుణ్యం పెంచడానికి తెలంగాణలో అనేక చర్యలు**

**వైట్ కాలర్ జాబ్‌లకు ప్రత్యామ్నాయం బ్లూ కాలర్ జాబ్స్ దృష్టి సారించాలి**

**ది హిందూ దినపత్రిక బెంగుళూరులో నిర్వహించిన**

**ది హిందూ హడిల్ కాంక్లేవ్ లో సిఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, జూన్ 6 (వుదయం ప్రతినిధి) :** మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యువత ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలి. ఆయా రంగాల్లో స్కిల్స్ పెంచుకుంటే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. ఏఐ కారణంగా వైట్ కాలర్ జాబ్‌లు పోతున్నాయని అందరూ ఆందోళన చెందుతున్నారు. వైట్ కాలర్ జాబ్‌లకు ప్రత్యామ్నాయం బ్లూ కాలర్ జాబ్స్. యువతరం వాటిపై దృష్టి సారించాలి. అందుకు అవసరమైన స్కిల్స్ పెంచుకోవాలి" అని సిఎం ఎనుముల రేవంత్ రెడ్డి చెప్పా రు. ది హిందూ దినపత్రిక బెంగుళూరులో నిర్వహించిన ది హిందూ హడిల్ కాంక్లేవ్ లో సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. మిగతా 2లో

## బాధలో ఉంటే చప్పట్లు కొట్టమంటూరా?

**అభిషేక్ వల్లే పార్టీలో అంతర్గత తిరుగుబాటు**

**మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ పై**

**టీఎంసీ రెబల్ నేత రితబ్రత బెనర్జీ ధ్వజం**

**ఓడిపోయి బాధలో ఉంటే నిలబడి చప్పట్లు కొట్టమన్నారు**



**కలకత్తా, జూన్ 6 :** మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ పై టీఎంసీ రెబల్ నేత రితబ్రత బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. అభిషేక్ వల్లే పార్టీలో అంతర్గత తిరుగుబాటు జరిగిందని ఆరోపించారు. మమతా బెనర్జీని తాము గౌరవిస్తున్నామని.. అయితే తమపై పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ పెత్తనాన్ని మాత్రం అంగీకరించబోమని స్పష్టంచేశారు. పార్టీ కోసం ఏమీ చేయకపోయినా దీదీ ఆయనకు ఉన్నత స్థానాన్ని కట్టబెట్టారని విమర్శించారు. బెంగాల్ ఎన్నికల్లో టీఎంసీ ఓటమి అనంతరం మమతా బెనర్జీ కాళీఘాట్ నివాసంలో సమావేశం నిర్వహించారని రితబ్రత పేర్కొన్నారు. పార్టీ కోసం అభిషేక్ చేసిన కృషికి గానూ నిలబడి చప్పట్లు కొట్టాలని సమావేశానికి హాజరైన నేతలు, కార్యకర్తలకు మమత సూచించారని రితబ్రత పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన బాధలో ఉన్న తమను ఈ చర్య మరింత బాధించిందని అన్నారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేల చేత సంతకాలు తీసుకున్నారని.. హాజరు కాని వారి పేర్లను అధికారిక రికార్డుల్లో రాసుకున్నారని ఆరోపించారు. టీఎంసీలో అవినీతి బాగా పెరిగిపోయిందని.. దానిని ప్రక్షాళించాల్సిన సమయం వచ్చిందని అన్నారు. ప్రస్తుతం 61 మంది ఎమ్మెల్యేలు తమతో ఉన్నారని.. రాబోయే రోజుల్లో మరికొంతమంది తమతో పాటు కలిసే అవకాశం ఉందన్నారు. జంతర్‌మంతర్ వద్ద క్రాక్రోచ్ జనతా పార్టీ నిరసనలు.. టీఎంసీ పార్టీలోని చాలా మంది నాయకులు అభిషేక్ బెనర్జీ పనితీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. శుభేందు అధికారి సహా పలు నేతలు పార్టీని వీడి వెళ్లడానికి కూడా అభిషేక్ వైఖరే కారణమన్న ఆరోపణలూ ఉన్నాయి. మమత కష్టపడి క్షేత్రస్థాయి నుంచి పార్టీని నిర్మిస్తే.. అభిషేక్ తృణమూల్‌ను ఐ-పాక్ లాంటి కార్పొరేట్ కంపెనీల చేతుల్లో పెట్టారని పలువురు నేతలు బహిరంగంగానే విమర్శలు చేశారు. పార్టీ ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణం ఆయనేనని నిందిస్తున్నారు. ఈ నేపథ్యంలో మేనల్లుడి విషయంలో దీదీ ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారన్నది ఆసక్తికరంగా మారింది.

## మహిళా సాధికారిత సాధించాలి

**మహిళలు ధైర్యంగా పనిచేస్తేనే అభివృద్ధి వేగవంతం**

**డ్రైవింగ్ నేర్పించి ఉద్యోగ అవకాశాలు కల్పించాం**

**తెలంగాణ డీజీపీ సివి ఆనంద్**



**హైదరాబాద్, జూన్ 6 (వుదయం ప్రతినిధి) :** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సాధికారిత సాధించాలని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. దాని కోసం ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో స్త్రీ రైడ్స్‌ను తీసుకొచ్చామని పేర్కొన్నారు. 55మంది మహిళలకు డ్రైవింగ్ నేర్పించి, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు గిగ్ వర్క్‌లో పురుషులు ఉండేవారని, ఇప్పటి నుంచి మహిళలు కూడా రాబోతున్నారని తెలిపారు. శనివారం హైదరాబాద్ లో డీజీపీ సీవీ ఆనంద్ మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ సిటీ పోలీస్ చరిత్రలో లా అండ్ ఆర్డర్ పోలీసుస్టేషన్‌కు.. మహిళా ఎస్‌హెచ్‌వో లేరని డీజీపీ ఆనంద్ వివరించారు. తాను హైదరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మహిళా ఇన్‌స్పెక్టర్లను ఎస్‌హెచ్‌వోలుగా నియమించానని ప్రస్తావించారు. ఇప్పుడు 55 మంది మహిళలు ప్యాసింజర్ రవాణా సేవలు అందిస్తున్నారని వెల్లడించారు. భవిష్యత్తులో తెలంగాణ అంతటా లాజిస్టిక్, కార్గో, డెలివరీ సర్వీసెస్‌లో మహిళా డ్రైవర్లకు అవకాశం కల్పిస్తామని చెప్పుకొచ్చారు. దేశ జీడీపీ పెరగాలంటే మహిళలు కూడా ధైర్యంగా బయటకు వచ్చి పని చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు.

## సర్కార్ ప్రభుత్వ భూమిని పెద్దలకు అప్పగిస్తోంది

**భూదందాలో సీఎం కుటుంబ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు**

**తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**



**హైదరాబాద్, జూన్ 6 (ఎఎంఎస్) :** తెలంగాణ ప్రభుత్వం రూ.లక్ష కోట్ల ప్రభుత్వ భూమిని పెద్దలకు అ ప్పగిస్తోంద ని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. సీఎం కుటుంబ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు భూదందాలో ఉన్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళతామని పేర్కొన్నారు. హైడ్రా వెళ్లి పేదల కాలనీల్లో దాడులు చేసి పెద్దలకు అప్పగిస్తుందన్నారు. అప్పుడు కేటీఆర్ పాలన నడిచింది.. ఇప్పుడూ కేటీఆర్ పాలనే నడుస్తోందన్నారు. అప్పుడు కేటీఆర్ అంటే కేసీఆర్, తన్నీరు హరీశ్‌రావు, రామారావులు అని.. ఇప్పుడు కేటీఆర్ అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని పేర్కొన్నారు.

## తెలంగాణకే గర్వకారణం పోచంపల్లి ఇక్కత్

**ప్రపంచ చిత్రపటంలో పోచంపల్లి ఇక్కత్ కు ప్రత్యేక స్థానం**

**చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ అండ**

**హైటెక్స్‌లో త్రెడ్ పోచంపల్లి ప్రదర్శనలో మంత్రి ఉత్తమ్**



**హైదరాబాద్, జూన్ 6 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళాత్మక నైపుణ్యానికి ప్రతీకగా నిలిచిన పోచంపల్లి ఇక్కత్ ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందడం ప్రతి తెలంగాణవాసికి గర్వకారణమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న "త్రెడ్ పోచంపల్లి" ప్రత్యేక ప్రదర్శనలో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పోచంపల్లి ఇక్కత్ కేవలం మిగతా 2లో

## నీట్ పరీక్ష రద్దు కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం

లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో

కేంద్రం చెలగాటం: టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ గౌడ్



**హైదరాబాద్, జూన్ 6 (వుదయం ప్రతినిధి) :** నీట్–యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో పరీక్షను రద్దు చేయడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం నాడు విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ.. ప్రధాని చేతగానితనం వల్ల లక్షలాది విద్యార్థులు రోడ్డున పడే పరి స్థితి దాపురించిందన్నారు. దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు. నీట్ పరీక్ష వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చే శారు. విద్యార్థులు నెలల తరబడి కష్టపడి సిద్ధమైతే, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి శ్రమ వృధా అయ్యిందని మహేశ్ అన్నారు. నష్టపోయిన విద్యార్థుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే సామాన్య ప్రజలపై కేంద్ర ప్రభుత్వం భారాన్ని వేస్తూ ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిందని మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మంచి ఆలోచనలతో ముందుకెళ్తే.. మంచే జరుగుతుంది

**చెడు ఆలోచనలు చేసే వాళ్ల చుట్టూ గొడ్డలి బ్యాచ్ జమ అవుతుంది**


**ఆధారాలతో సహా జగన్ అండ్ కోకు కౌంటర్ ఇచ్చాం**

**2024లో లోకేశ్ అద్భుత విజయం సాధించారు**

**ప్రజాభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం**

**ప్రజలతో మంచిగా ఉంటూ ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నాం**

**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**



**అమరావతి, జూన్ 6 (వుదయం ప్రతినిధి) :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యపానం నిషేధం చేస్తామని హామీ ఇచ్చి గొడ్డలి పార్టీ చేతులెత్తేసిందని విమర్శించారు. వైసీపీ హయాంలో సీపీఎస్ వారం రోజుల్లో రద్దు చేస్తామని చెప్పి ఎందుకు పక్కన పెట్టేసిందని ప్రశ్నించారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ పొందుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని గొడ్డలి పార్టీ మాట తప్పిందని ధ్వజమెత్తారు. ఇంతటితో ఆగకుండా వ్యవస్థలను విధ్వంసం చేసిందని మండిపడ్డారు. వైసీపీ హయాంలో చెప్పినవి చేయకపోగా తమ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ-2025పై బురద జల్లుతోందని ఆగ్రహించారు. మిగతా 2లో

# ఓటమి ద్వారే గెలుపు నేర్చుకోవాలి

మొదటి పేజీ తరువాయి



ఈరోజుల్లో ఫొటోల కోసం యువత ప్రయాసపడుతోందన్న ఆయన.. మీ ఫొటో ఇతరులు డీపీలుగా పెట్టుకునే కష్టపడాలన్నారు. ఓటమి నుంచి ఎలా గెలుపు బాటలు వేసుకోవాలి ప్రతి క్రీడాకారుడి నేర్పేది మైదా నం మాత్రమేనన్నారు. అలాంటి మైదానాలను అభివృద్ధి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం క్రీడాలకు అమితమైన ప్రోత్సాహం అందిస్తున్నారు. ప్రతి రంగంలోనూ గెలుపు ఓటములు సర్వసాధారణమే కానీ.. ప్రతి రంగం లోనూ గెలుపు దిశగా ఎలా సాగాలో మనమే నేర్చుకుంటాం కానీ క్రీడల్లో ఓడిన చోటే గెలవాలన్న కసి మైదానం చూసి ప్రతిసారి గుర్తొస్తుందన్నారు. ఈతకు వెళ్లి ఆరుగురు చనిపోయారన్న వార్త బాధ కలిగిచిందన్న ఆయన.. ఇలాంటి తరుణంలో ఈరోజు ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఇంతమంచి స్విమ్మింగ్ పూల్ చూశాక, ఇలాంటి స్విమ్మింగ్ పూల్ రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈత నేర్చుకునేలా ప్రోత్సహం అందిస్తామన్నారు. ఎప్పటి నుంచో తాను డీపీఎస్ కు రావాలని అనుకున్నా కుదరలేదన్న మంత్రి వాకిటి ఈరోజు విద్యార్థులకు చదువులతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్న ఈ తీరు చూస్తుంటే ముచ్చటేస్తుంద న్నారు. ఈసందర్భంగా మా అన్న కొమరన్నకు మాట ఇస్తున్నా నేను మళ్లీ మీ డీపీఎస్ కు వస్తా.. ఆఫ్ డే ఇక్కడే స్పెండ్ చేస్తా.. ఇక్కడ జరిగే యాక్టివిటీస్ అన్నీ దగ్గరుండి గమనిస్తానన్నారు. విద్యార్థులకు చదువులతోపాటు..క్రీడారంగంలోనూ ప్రావీణ్యం పొందేలా ప్రోత్సహిస్తున్న తీరు నిజంగా అభినందనీయం అన్నారు. విద్యార్థులకు క్రీడారంగంలో ఏసాయం కావాలన్నా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు మంత్రి వాకిటి. ప్రభుత్వం తరపున మీకు ఎలాంటి అవసరత ఉన్న అది సమర్చేందుకు తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. ఈసందర్భంగా మంత్రి వాకిటి పిల్లల తల్లిదండ్రులకు విద్యార్థులకు తనదైన రీతిలో సందేశాన్నిచ్చారు. విద్యార్థులు తమకోసం పేరెంట్స్ త్యాగాలను గుర్తించి వారు గర్వపడేలా చదవి ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. అలాగేపేరెంట్స్ కూడా తమతమ పిల్లలకు ఆస్తి ఇవ్వడం కాదు.. మీ పిల్లలే ఒక ఆస్తిగా మారేలా స్కిల్స్ నేర్పించాలన్నారు.

### జూన్ 8 నుంచి చేప ప్రసాదం పంపిణీ

చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసినట్లు మంత్రి వాకిటి శ్రీహరి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి తెలిపారు. ఏబీఎన్‌తో మాట్లాడుతూ.. చేప ప్రసాదం అనేది ప్రజల విశ్వాసంతో ముడిపడి ఉన్న అంశమని, ఎలాంటి ప్రచారాలు చేయకపోయినా దేశం నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారని వారు పేర్కొన్నారు. అపోహలకు తావు ఇవ్వకుండా చేప ప్రసాదం వల్ల ప్రయోజనం పొందిన వారే ఈ కార్యక్రమానికి ప్రచారం చేస్తున్నారని, శాస్త్రానికి అంతుచిక్కని అనేక విషయాలు ఉన్నాయని వారు వ్యాఖ్యానించారు. అందువల్ల అపోహలకు తావు ఇవ్వకుండా ప్రజలు నమ్మకంతో పాల్గొనాలని సూచించారు. చేపపిల్లలు సిద్ధం : ఈసారి లక్ష మందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని, అందుకు అనుగుణంగా మూడు లక్షలకు పైగా చేపపిల్లలను సిద్ధం చేసినట్లు తెలిపారు. చివరి వ్యక్తి వరకు చేప ప్రసాదం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు.



## చేనేత వస్త్రాలను ధరించాలి

### సంస్కృతి , సంప్రదాయన్నీ కాపాడుకోవాలి

### క్రీడలకు బడ్జెట్ లో అధిక నిధులు కేటాయింపు

### శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్

**హైదరాబాద్, జూన్ 6 (ఎఎంస్) :** మాదాపూర్ హైటెక్స్ హాల్ –4 లో "పోచంపల్లి త్రిడ్ " ఎగ్జిబిషన్ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నేడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హాల్ లోని స్టాల్స్ అన్నింటిని ఆయన సందర్శిచి , వర్తకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ " పోచంపల్లి వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి ఉందన్నారు. తాను ఎంపీగా ఉన్న కాలంలో పోచంపల్లి శాలువలను ఢిల్లీలో సహచర ఎంపీలు , కేంద్ర మంత్రులకు కప్పి భూదాన్ పోచంపల్లి వస్త్రాల గొప్పతనాన్ని వివరించే వాడినని ఆయన తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశానని ఈ సందర్భంగా వివరించారు. చేనేత వస్త్రాలను ధరించి , మన సాంస్కృతి , సంప్రదాయన్నీ కాపాడుకోవాలని ఆయన తెలిపారు. హైటెక్స్ లో జరిగే వస్త్ర ప్రదర్శన కార్యక్రమాన్ని సందర్శిచి, నాణ్యత కలిగిన వస్త్రాలను కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీ ద్వారా రాష్ట్రంలో ఉన్న అన్నీ మైదానాలను అభివృద్ధి చేసి మంచి నైపుణ్యం ఉన్న కోచ్ లను నియమించనున్నట్లు మంత్రి తెలిపారు.ఈసారి క్రీడలకు బడ్జెట్ లో అధిక నిధులు కేటాయించిందని స్పష్టం చేశారు.సీఎం కప్ సెకండ్ ఎడిషన్ లో భాగంగా దాదాపు 3 లక్షల మంది పిల్లలు గ్రామీణ,మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి లో క్రీడలు ఆడారని మంత్రి పేర్కొన్నారు . ఇప్పుడు 3వ ఎడిషన్ లో 5 లక్షల క్రీడాకారులను పాల్గొనేలా చేయడమే ధ్యేయం గా పెట్టుకున్నామని మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడించారు.ఈ సందర్భంగా సమ్మర్ క్యాంపు లో శిక్షణ పొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి తో పాటు తెలంగాణ స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ శివసేనా రెడ్డి, ఎంవీర్ గ్రూప్ చైర్మన్ వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయాలపై యువత దృష్టి సారించాలి

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ సమగ్రాభివృద్ధి ప్రణాళికలను వివరించారు. గోష్టిలో ది హిందూ డైరెక్టర్ ఎన్. రామ్ గారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతున్నాయని ఆందోళనకర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా యువతలో నైపుణ్యం పెంచడానికి తెలంగాణలో అనేక చర్యలు తీసుకున్నట్టు వివరించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, పాత పాత సిలబస్‌తో మూస పద్ధతిలో కొనసాగుతున్న ఐటీఐలను అత్యాధునిక టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ)లుగా అప్ గ్రేడ్ చేసిన విషయాలను చెప్పారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి రూపొందించిన తెలంగాణ రైజింగ్–2047 దార్శనికత, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా రాష్ట్రం ఎదగడానికి నిర్దేశించుకున్న భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. ప్రధానంగా రైతులు, యువత, మహిళల అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర భవిష్యత్తు రోడ్ మ్యాప్‌పై చర్చాగోష్టిలో సమగ్రంగా తెలిపారు.

## బియ్యం ఎగుమతులకు తెలంగాణ కేంద్రంగా మారాలి

**ఎగుమతి ఆధారిత రైస్**

**మిల్లులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు పరిశీలన**

**ధాన్యం నిల్వ చేసేందుకు ఆధునీకరణకు ప్రాధాన్యం**

**ఆధునిక గోదాములు, స్టీల్ సైలోల నిర్మాణానికి**

**పెట్టుబడులు ఆహ్వానం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, జూన్ 6 (ఎఎంస్) :** తెలంగాణను దేశంలోనే అగ్రగామి వరి ఉత్పత్తి రాష్ట్రంగా నిలిపిన తర్వాత, బియ్యం ఎగుమతులు, ఆధునిక సాంకేతికతలు, విలువ ఆధారిత ఉత్పత్తుల రంగంలో కూడా ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ రైస్ అండ్ గ్రెయిన్స్ టెక్ ఎక్స్‌పో–2026లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర అభివృద్ధిలో రైస్ మిల్లర్లు కీలక భాగస్వాములని పేర్కొన్న మంత్రి, రైతులు, మిల్లర్లు, వినియోగదారులు అందరూ కలిసి అభివృద్ధి ఫలాలను పొందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బియ్యం ఎగుమతులను పెంచేందుకు తెలంగాణలో కొత్తగా ఏర్పాటు అయ్యే ఎగుమతి ఆధారిత రైస్ మిల్లులకు, అలాగే ప్రస్తుతం పనిచేస్తున్న మిల్లులు ఎగుమతుల వైపు మళ్లేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని ఆయన తెలిపారు. ప్రపంచ బియ్యం మార్కెట్లలో తెలంగాణకు ప్రత్యేక స్థానం కల్పించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమన్నారు. రైస్ మిల్లింగ్ రంగంలో కార్మికుల కొరత ప్రధాన సవాలుగా మారిందని పేర్కొన్న మంత్రి, యాంత్రీకరణ, ఆటోమేషన్‌కు మిల్లర్లు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. ఆధునిక యంత్రాల వినియోగం ద్వారా ఉత్పాదకత పెరగడంతో పాటు కార్మికుల కొరత సమస్యను అధిగమించవచ్చన్నారు. స్టీల్ సైలోలు, ఆటోమేటెడ్ గోదాములు, కృత్రిమ మేధస్సు ఆధారిత ధాన్య పర్యవేక్షణ వ్యవస్థలు, డిజిటల్ ఇన్వెంటరీ నిర్వహణ వంటి ఆధునిక నిల్వ సదుపాయాల నిర్మాణం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రజా–ప్రైవేటు భాగస్వామ్య విధానంలో భారీ సామర్థ్యంతో గోదాముల నిర్మాణానికి పెట్టుబడిదారులు ముందుకు రావాలని ఆహ్వానించారు. పార్బాయిలింగ్ యూనిట్లలో నీటి వినియోగాన్ని తగ్గించే, విద్యుత్ ఆదా చేసే ఆధునిక సాంకేతికతలను పరిశ్రమలు అవలంబించాలని మంత్రి సూచించారు. భవిష్యత్ ప్రాసెసింగ్ యూనిట్లు నీటి పునర్వినియోగం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.నాణ్యతతో పాటు పోషక విలువలను కూడా దృష్టిలో ఉంచుకుని బియ్యం ప్రాసెసింగ్ జరగాలని మంత్రి అన్నారు. నియంత్రిత వైటనింగ్, ప్రిసిషన్ పాలిషింగ్, పోషకాలను కాపాడే సాంకేతికతలు, ఏఐ ఆధారిత నాణ్యత నిర్ధారణ విధానాలు వినియోగదారులకు మరింత ఆరోగ్యకరమైన బియ్యం అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ప్రస్తుతం తెలంగాణలో ఏటా సుమారు 300 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి జరుగుతోందని మంత్రి తెలిపారు. దేశంలో యాసంగి వరి కొనుగోళ్లలో తెలంగాణ వాటా దాదాపు 60 శాతం ఉందన్నారు. ప్రస్తుత ఖరీఫ్, యాసంగి సీజన్లలో రైతుల ఖాతాల్లో ప్రభుత్వం దాదాపు రూ.39 వేల కోట్లు జమ చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు రూ.96 వేల కోట్లకు పైగా చెల్లింపులు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పంపిణీ పథకం ద్వారా 3.2 కోట్ల మందికి లబ్ధి చేకూరుతోందని, ఇందుకోసం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు, మిల్లర్లు, సాంకేతిక నిపుణులు, విధాన రూపకర్తలు సమష్టిగా కృషి చేస్తే తెలంగాణ బియ్యం ఉత్పత్తిలోనే కాకుండా, బియ్యం సాంకేతికత, ఆవిష్కరణలు, ఎగుమతుల రంగంలో కూడా ప్రపంచ స్థాయి కేంద్రంగా ఎదుగుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## మంచి ఆలోచనలతో ముందుకెళ్తే..

# మంచే జరుగుతుంది

మొదటి పేజీ తరువాయి



మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యపై ఎలా దుష్ప్రచారం చేసి లబ్ధి పొందారో... డీఎస్సీ విషయం లోనూ దుష్ప్రచారంతో లబ్ధిపొందాలనుకున్నారని దుయ్యబట్టారు. డీఎస్సీ నిర్వహణపై ఆధారాలతో సహా జగన్ అండ్ కోకు కౌంటర్ ఇచ్చామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్‌తో గొడ్డలి పార్టీ నేతలు సంది గ్ధంలో పడ్డారన్నారు. దుష్ప్రచారం చేయడం, ఫేక్ రాజకీయాలు చేయడం గొడ్డలి పార్టీ విధానం, సిద్ధాంతమని విమర్శించారు. అధికారంలో ఉన్నామని, సహనం, ఓపిక అవసరమని.. కానీ గొడ్డలి పార్టీ ఆగడాలు శ్రుతిమించితే వదిలిపెట్టమని హెచ్చరించారు. మంచి ఆలోచనలు చేసే వాళ్లకు మంచి వాళ్లే సహాయపడతారని అన్నారు. చెడు ఆలోచనలు చేసే వాళ్ల చుట్టూ గొడ్డలి బ్యాచ్ జమ అవుతుందని ఎద్దేవా చేశారు. ఇకపై టీడీపీకి ఓటమి లేదని, రాదని తెలిపారు. ఆ స్థాయిలో జాగ్ర త్తలు తీసుకుంటున్నామని చెప్పా రు. ప్రజలతో మంచిగా ఉంటున్నామని, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నామని.. సంక్షేమ పథకాలు – అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు స్వేచ్ఛను ఇచ్చామని చెప్పుకొచ్చారు. ముఖ్యంగా ఆత్మవిమర్శ చేసుకుంటున్నామని.. అందుకే టీడీపీకి ఓటమి రాదని పేర్కొన్నారు. పార్టీ పదవులు మొదలుకుని టికెట్ల కేటాయింపుల వరకు నిరంతరం సర్వేలు చేయిస్తున్నామని తెలిపారు. ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వాళ్లని వదిలించుకుంటానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఏం ప్రచారం చేశారో... అవన్నీ తమ ప్రభుత్వం చేస్తోందని అన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న మంచిని గడప గడపకు వెళ్లి చెప్పాలని దిశానిర్దేశం చేశారు. ఆనాడు చెప్పిన వాటిని ఈనాడు నెరవేరుస్తున్నామనే విషయాన్ని ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. మంగళగిరిలో టీడీపీ గెలిచి చాలా కాలమైందని 2019 ఎన్నికల్లో నారా లోకేశ్ పోటీ చేసినా ఓడిపోయారని ప్రస్తావించారు. ఆ తర్వాత పట్టుపట్టి పనిచేశారని 2024లో అద్భుత విజయం సాధించారని ప్రశంసించారు. గెలిచిన తర్వాత కూడా మంగళగిరిలో లోకేశ్ చక్కగా పని చేస్తున్నారని.. ఇప్పుడు మంగళగిరి టీడీపీకి కంచుకోటగా మారిందని చెప్పుకొచ్చారు. యుద్ధాన్ని గెలిపించే బాధ్యత తనదని... తనతో పాటు అలుపెరగకుండా యుద్ధం చేసే బాధ్యత టీడీపీ శ్రేణులదని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కేంద్రంలోనూ గతానికి మించి ఓట్లు రావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీ పరంగా చేయాల్సిందంతా చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు అన్నిరకాలుగా అండగా ఉంటామని... ప్రభుత్వం చేసే అభివృద్ధిని అందిపుచ్చుకునేలా కార్యకర్తలు ఆలోచించాలని అన్నారు. భవిష్యత్తు రాజకీయాలకు కూటమితోనే వెళ్తున్నామని.. వెళ్తామని స్పష్టం చేశారు.

దీనికి అనుగుణంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ముందు బీజేపీతో పొత్తులో ఉన్నా కూడా ఓట్లు చీలకూడదనే.. టీడీపీతో కలుస్తానని పవన్ కల్యాణ్ చెప్పారని అన్నారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా వెళ్లడంతోనే 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిచామని ప్రస్తావించారు. పార్టీ అగ్రనేతలు మొదలుకుని... కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ బ్రాడ్ మైండ్‌తో ఆలోచించాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు.



## తెలంగాణకే గర్వకారణం

# పోచంపల్లి ఇక్కత్

మొదటి పేజీ తరువాయి

ఒక వస్త్ర కళ మాత్రమే కాదని, అది తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సృజనాత్మకత, సంప్రదాయ జీవన విధానానికి అద్దం పట్టే అద్భుత కళారూపమని ఆయన అభివర్ణించారు. రంగుల సమన్వయం, నూలు పోగుల్లో కనిపించే అపూర్వమైన డిజైన్లు, తరతరాలుగా వస్తున్న కళాత్మక నైపుణ్యం వల్ల పోచంపల్లి ఇక్కత్ ప్రపంచ ఫ్యాషన్ రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని చెప్పారు. చేనేత కార్మికుల కష్టం, పట్టుదల, నైపుణ్యం వల్లే పోచంపల్లి పేరు ప్రపంచ పటంలో నిలిచిందని మంత్రి కొనియాడారు. ఒక చీర తయారీ వెనుక కుటుంబమంతా కలిసి చేసే శ్రమ, సృజనాత్మకత, అంకితభావం దాగి ఉంటుందని అన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చేనేత రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సంక్షేమ కార్యక్రమాలు, మార్కెటింగ్ అవకాశాలు, ఆర్థిక సహాయం, శిక్షణ కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. చేనేత ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మరింత గుర్తింపు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తుల అమ్మకాల పెరుగుదల ద్వారా వేలాది కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. పోచంపల్లి ఇక్కత్‌కు లభించిన జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ తెలంగాణ ప్రతిష్ఠను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిందని మంత్రి అన్నారు. పోచంపల్లి పేరు నేడు దేశ సరిహద్దులు దాటి అంతర్జాతీయ స్థాయిలో వినిపించడానికి కారణం చేనేత కార్మికుల ప్రతిభేనని కొనియాడారు. భారతదేశ చేనేత రంగ చరిత్రలో పోచంపల్లి ఇక్కత్‌కు ప్రత్యేక అధ్యాయం ఉందని పేర్కొన్న మంత్రి, ఈ కళను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. యువత కూడా చేనేత రంగం వైపు ఆకర్షితులయ్యేలా ఆధునిక డిజైన్లు, కొత్త మార్కెటింగ్ విధానాలు, డిజిటల్ వేదికల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. "త్రెడ్ పోచంపల్లి" వంటి ప్రదర్శనలు చేనేత కళాకారుల ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు, కొనుగోలుదారులు, డిజైనర్లు, వ్యాపారవేత్తలు, కళాభిమానులను ఒకే వేదికపైకి తీసుకువస్తాయని ఆయన తెలిపారు. ఈ ప్రదర్శన ద్వారా పోచంపల్లి ఇక్కత్‌కు మరింత ప్రాచుర్యం లభించి, చేనేత కార్మికుల ఆదాయం పెరగాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తు, సంప్రదాయ కళల పరిరక్షణ విషయంలో ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేసి, ప్రపంచ మార్కెట్లలో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లేందుకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. "పోచంపల్లి ఇక్కత్ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే కళగా ఆయన అభివర్ణించారు. చేనేత కార్మికుల చెమట చుక్కలతో అల్లుకున్న ఈ కళాఖండం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని వారి సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది" అని మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# పంటల మార్పిడే తెలంగాణ వ్యవసాయానికి దిశానిర్దేశం

**రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి**

**పంటల మార్పిడిపై కమిషన్ రూపొందించిన**

**నివేదికను విడుదల చేసిన కమిషన్ బృందం**

**గత పదేళ్లకాలంలో సంప్రదాయం, ఉద్యాన,**

**కూరగాయల పంటల సాగు తగ్గింది**

**పంట మార్పిడి చేయాల్సిన సమయం వచ్చింది**




హైదరాబాద్, జూన్ 6 (వుదయం ప్రతినిధి) : రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలంటే పంటల మార్పిడి అనివార్యమని తెలంగాణ వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ స్పష్టం చేసింది. పంటల వైవిధ్యీకరణపై కమిషన్ రూపొందించిన సమగ్ర నివేదికను బీఆర్కే భవన్‌లో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు రాములు నాయక్, కేవీఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్, భవానీ రెడ్డి, మెంబర్ సెక్రటరీ గోపాల్, స్పెషల్ అధికారి కేశవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ, కేరళ, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో అధ్యయనం చేసి పంటల మార్పిడిపై నివేదిక సిద్ధం చేసినట్లు తెలిపారు. గత నెల 4న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జరిగిన సమావేశంలో పంటల మార్పిడిపై సుదీర్ఘంగా చర్చించామని, కమిషన్ నివేదికను ముఖ్యమంత్రికి అందజేశామని చెప్పారు. దీనిపై లోతైన అధ్యయనం చేయాలని సీఎం సూచించినట్లు వెల్లడించారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కు కూడా నివేదిక కాపీని అందజేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో కృష్ణా, గోదావరి జలాలు అందుబాటులోకి రాకముందు వర్షాధార, సాంప్రదాయ పంటల సాగు అధికంగా ఉండేదని, కాలక్రమేణా రైతులు వరి, పత్తి పంటల వైపు మళ్లారని తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావం సమయంలో సాగైన పంటలు, ప్రస్తుతం సాగవుతున్న పంటల వివరాలను నివేదికలో పొందుపరిచినట్లు వివరించారు. వరి, పత్తి పంటలకు కేంద్ర ప్రభుత్వమే మద్దతు ధర ప్రకటిస్తున్నప్పటికీ, పత్తి కొనుగోళ్లలో అమలు చేసిన యాప్ విధానం, రెండోది పంటపై విధించిన ఆంక్షలు, ఎకరానికి ఏడు క్వింటాళ్ల పరిమితి వంటి నిర్ణయాలు రైతులను ఇబ్బందులకు గురిచేశాయని విమర్శించారు. రాష్ట్రంలో కూరగాయలు, పండ్ల తోటల సాగు తగ్గిపోవడం ఆందోళన కలిగించే అంశమన్నారు. కోతుల బెడద కారణంగా పలు పంటల సాగుకు రైతులు వెనుకంజ వేస్తున్నారని పేర్కొన్న ఆయన, ఈ సమస్య పరిష్కారానికి సోలార్ ఫెన్సింగ్, కోతుల కుటుంబ నియంత్రణ చర్యలు చేపట్టాలని కమిషన్ సూచించినట్లు తెలిపారు. వరి, పత్తి నుంచి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లేందుకు ఆర్థిక ప్రోత్సాహకాలు, గిట్టుబాటు ధరలు కల్పించాలని నివేదికలో ప్రతిపాదించినట్లు చెప్పారు. రైతుకు న్యాయం జరగాలని, వ్యవసాయం లాభదాయకంగా మారాలని ఆకాంక్షించిన కోదండరెడ్డి, రైతుల సమస్యలను రాజకీయాలకు అతీతంగా చూడాలని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించిన ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు పక్షాన నిలుస్తున్న నాయకుడిగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 23 పంటలకు మద్దతు ధర ప్రకటిస్తున్నప్పటికీ, కేంద్రం వరి, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లకే పరిమితమవుతోందని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో లారీలు, హమాలీల కొరత వంటి సమస్యలు ఉన్నప్పటికీ, వాటిని అధిగమిస్తూ కొనుగోళ్లు కొనసాగుతున్నాయని చెప్పారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఉచిత విద్యుత్, రుణమాఫీ వంటి నిర్ణయాలు వ్యవసాయ రంగంలో కీలక మార్పులకు దోహదపడ్డాయని గుర్తు చేసిన కోదండ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేసిన రెండు లక్షల రూపాయల రుణమాఫీ, రైతు డిస్కం ఏర్పాటు చారిత్రాత్మక నిర్ణయాలుగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేసే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. తాను చేసిన విద్యుత్ వినియోగానికి సంబంధించిన వ్యాఖ్యలను కొన్ని పత్రికలు వక్రీకరించాయని, తాను కూడా రైతు నేనని, రైతు సమస్యలపై పూర్తి అవగాహనతోనే మాట్లాడుతున్నానని పేర్కొన్నారు. కమిషన్ సభ్యుడు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, పంట అవశేషాలను కాల్చవద్దని ప్రభుత్వం, వ్యవసాయ శాఖ విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నప్పటికీ, రైతులు ఇంకా ఆ పద్ధతిని కొనసాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల భూసారం తగ్గిపోవడంతో పాటు ప్రమాదాలు సంభవించి ప్రాణనష్టాలు కూడా చోటుచేసుకుంటున్నాయని హెచ్చరించారు. వర్షాలు కురిసిన తర్వాత పంట అవశేషాలను భూమిలో కలిపి దున్నడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చన్నారు. అన్ని ప్రాంతాల్లో ఒకే రకమైన పంటల సాగు రైతులకు ప్రయోజనం చేకూర్చదని, కందులు, జొన్నలు, ఇతర పప్పుధాన్యాలు, కూరగాయల సాగు ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశముందని సూచించారు. ఈ పంటలకు గిట్టుబాటు ధర, బోనస్ అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కమిషన్ సిఫార్సు చేసినట్లు తెలిపారు. కోతుల బెడద నివారణకు నాబార్డు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని, రైతుకు లాభం చేకూర్చే విధానాలే వ్యవసాయ భవిష్యత్తును నిర్ణయిస్తాయని పేర్కొన్నారు.

# కౌకూర్లో చోరీ నేపాలీ గ్యాంగ్ అరెస్ట్



**హైదరాబాద్, జూన్ 6 (వుదయం ప్రతినిధి) :** కౌకూర్ మోహన్స్ గోల్ఫ్ ఎన్క్లేవ్లో రిటైర్డ్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేటర్ మురళీమోహన్ ఇంట్లో పనిమనిషిగా చేరి, నమ్మకంగా ఉంటూ వృద్ధ దంపతులకు మత్తుమందు ఇచ్చి రూ.కోట్లలో దోపిడీకి పాల్పడిన నేపాలీ ముఠాను మల్కాజ్గిరి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 60 తులాల బంగారం, 15 కిలోల వెండి, 3,000 యూఎస్‌ఓ నగదు స్వాధీనం చేసుకున్నారు. 255 సీసీటీవీ కెమెరాలను జల్లెడ పట్టి ఐదు రోజుల్లోనే నిందితులను పట్టుకున్నారు.

# మహిళల భద్రత – కుటుంబ బంధాల బలోపేతానికి 'మీ సురక్ష

**హైదరాబాద్, జూన్ 6 (వుదయం ప్రతినిధి) :** మహిళల భద్రత, కుటుంబ సంక్షేమం, వైవాహిక బంధాల పరిరక్షణ లక్ష్యంగా మల్కాజిగిరి కమిషనరేట్ మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో, సెంటర్ ఫర్ డెవలప్మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ – ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్స్ ఆధ్వర్యంలో "మీ సురక్ష – కలసి ఉంటే కలదు సుఖం" పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కుటుంబ సామరస్యాన్ని పెంపొందించడం, వైవాహిక బంధాలను బలోపేతం చేయడం, మహిళల భద్రతపై అవగాహన కల్పించడం, కుటుంబ వివాదాలను కౌన్సెలింగ్ మరియు మధ్యవర్తిత్వం ద్వారా శాంతియుతంగా పరిష్కరించేందుకు ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించారు. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధి లోని సిడిఈడబ్ల్యూ ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ల జోక్యంతో తిరిగి కలిసిన 150కి పైగా దంపతులు, వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కుటుంబ కౌన్సెలింగ్ విజయాలను గుర్తు చేస్తూ, సంభాషణ, పరస్పర అవగాహన, గౌరవం కుటుంబ బంధాల పరిరక్షణలో ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర డీజీపీ శ్రీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ పోలీస్ శాఖ అమలు చేస్తున్న మహిళా భద్రత కార్యక్రమాలను వివరించారు. మహిళలు, పిల్లల భద్రత, గౌరవం, సాధికారత ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యతలలో ఒకటని పేర్కొన్నారు. "మీ సురక్ష – కలసి ఉంటే కలదు సుఖం" కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, కౌన్సెలింగ్, మధ్యవర్తి త్వం ద్వారా కుటుంబాలను తిరిగి కలపడంలో మహిళా భద్రత విభాగం, మల్కాజిగిరి కమిషనరేట్ చేస్తున్న కృషిని అభినందించారు. మహిళా భద్రతా విభాగం డీజీపీ శ్రీమతి చారు సిన్హా మాట్లాడుతూ, కుటుంబ సంబంధాల బలోపేతానికి భార్య భర్తలు ఇద్దరూ ఓపికతో , విశ్వాసం తో పాటు ఇద్దరి మధ్య అవగాహన అవసరమని చెప్పారు. డీజీపీ సి.వి. ఆనంద్, మహిళా భద్రతా విభాగం డీజీపీ శ్రీమతి చారు సిన్హా, తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ హెడ్ ఎస్. ఎన్. శ్రీదేవి, మై ఛాయిస్ ఫౌండేషన్ ప్రతినిధి పెర్ల్ చోరగుడి, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ శ్రీమతి బి. సుమతి, మహిళా భద్రత డీసీపీ టి. ఉషారాణి, సీనియర్ పోలీస్ అధికారులు, మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది, షీ టీమ్స్, భరోసా కేంద్రాల ప్రతినిధులు, కౌన్సెలర్లు, భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు, తిరిగి కలిసిన దంపతులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## రక్షణ సేనలోకి భారీ చేరికలు



**- నిరుడు సర్వేష్ ముదిరాజ్ నాయకత్వంపై విశ్వాసంతో పార్టీలో చేరిన మహిళా, యువ నాయకులు**
**- నిరుడు సర్వేష్ ముదిరాజ్: రంగారెడ్డి జిల్లాలో బలోపేతం అవుతున్న తెలంగాణ రక్షణ సేన**
**-నిరుడు సర్వేష్ ముదిరాజ్ సమక్షంలో మహేశ్వరం నాయకుల ఘన చేరిక కార్యక్రమం**

**గండిపేట్, జూన్ 06 (వుదయం):**

రంగారెడ్డి జిల్లా రాజకీయాల్లో తెలంగాణ రక్షణ సేన పార్టీ రోజురోజుకు బలోపేతం వారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మహేశ్వరం రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందని, ఈ క్రమంలో యువత మరియు మహిళలు స్వచ్ఛందంగా పార్టీలో చేరడం పార్టీపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు.

ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే రాజకీయ వేదికగా తెలంగాణ రక్షణ సేన ఎదుగుతోందని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీ విస్తరణకు కొత్తగా చేరిన నాయకులు కీలక పాత్ర పోషించాలని నిరుడు సర్వేష్ ముదిరాజ్ సూచించారు.గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.రానున్న రోజుల్లో మరింత మంది నాయకులు తెలంగాణ రక్షణ సేనలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన బండారు సరిత మరియు ఇతర నాయకులు మాట్లాడుతూ, కల్వకుంట్ల కవిత నాయకత్వం తమను ఆకర్షించిందని తెలిపారు.ప్రజల కోసం పనిచేసే లక్ష్యంతో తెలంగాణ రక్షణ సేనలో చేరినట్లు పేర్కొన్నారు.పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సంస్థ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా ప్రతినిధులు, యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీరంగూడ డివిజన్‌లో అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలి




**- బీరంగూడ డివిజన్-270 సమస్యలపై కాంగ్రెస్ పోరు**
**- జేసీ నారాయణ అమిత్‌కు వినతిపత్రం అందజేసిన పట్టణ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి**
**- సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను త్వరగా మంజూరు చేయాలని విజ్ఞప్తి**

**సైబరాబాద్**

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బీరంగూడ డివిజన్ 270లో పలు కాలనీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరం ఉందని వివరించారు.కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ సదుపాయాలు సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పనులను త్వరగా సాంక్షన్ చేసి వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను కోరారు.ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని శశిధర్ రెడ్డి గారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రవీణ్ బాలె, ఈశ్వర్ రెడ్డి, మల్లేష్, కృష్ణ యాదవ్ పాల్గొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను అధికారులు ప్రాధాన్యతగా తీసుకొని శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## టీఆర్ఎస్ పార్టీలో చేరిన అరుణ్‌రాజ్ శేరికార్



**నారాయణఖేడ్ ( వుదయం ):**

నారాయణఖేడ్‌కు చెందిన అరుణ్‌రాజ్ శేరికార్ నేడు టీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో ఆయన తన అనుచరులతో కలిసి పార్టీ కండువా కప్పుకొని టీఆర్ఎస్‌లో చేరారు.అరుణ్‌రాజ్ శేరికార్ గతంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల బీజేపీ పార్టీకి రాజీనామా చేసిన ఆయన, టీఆర్ఎస్ పార్టీలో చేరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.అంతకుముందు ఆయన తెలంగాణ జాగృతిలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా కూడా సేవలందించారు. సామాజిక, రాజకీయ రంగాల్లో చురుకుగా పనిచేసిన అరుణ్‌రాజ్ శేరికార్, తన అనుచరులతో కలిసి టీఆర్ఎస్‌లో చేరడం ద్వారా పార్టీకి మరింత బలం చేకూరుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా అరుణ్‌రాజ్ శేరికార్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకొని టీఆర్ఎస్ పార్టీ ముందుకు సాగుతోందని అన్నారు. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు తనను ఆకర్షించాయని పేర్కొన్నారు.రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో, ఆమె ఆదేశాల మేరకు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అరుణ్‌రాజ్ శేరికార్ అనుచరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దినేష్ కుమార్ ను అభినందించిన కోలన్ శ్రీనివాస్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, జూన్ 6 ,(వుదయం ప్రతినిధి ),**

హైదరాబాద్ లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సంబంధిత ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 22 దేశాల నుండి 2000 మంది కీబోర్డ్ వాయిద్య కారులు పాల్గొనగా ఈ పోటీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి అభిమాని కవి గారి దినేష్ కుమార్ పాల్గొన్నారు. గంట పాటు 2000 మంది ఆపకుండా కీబోర్డ్ వాయించిన ప్రతిభను గుర్తించిన అధికారులు 777 మంది వాయిద్య కారులను ఎంపిక చేయగా వారిలో దినేష్ కుమార్ ఎంపిక అవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇది మనకు ఎంతో గర్వకారణం అని ఇంకా ముందు ముందు ఇలాంటి రికార్డులను ఎన్నో సాధించాలని ఎంతో ఎత్తుకి ఎదగాలని దానికి పూర్తిస్థాయిలో నా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపి దినేష్ కుమార్ ను అభినందించారు.

## గుండ్లకమ్మకు పచ్చలహారం రేపటితరానికి ఊపిరిపోద్దాం

**హైదరాబాద్**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దేవాదాయశాఖ పరిధిలోని హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ గుండ్లకమ్మ నదికి ఇరువైపులా భారీ ఎత్తున చెట్లను నాటే ఒక మహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ అనగానే ఈ కార్యక్రమం హిందూ ధర్మ ప్రచారం కోసం చేస్తున్న కార్యక్రమం అనుకుంటే పొరపాటు. మానవ నాగరికత మొదలైంది నదీ పరివాహక ప్రాంతాలలోనే. మనిషి మనుగడకు అవసరమైన ప్రాణవాయువుకు చెట్టు ఆధారమైతే, ఆ చెట్టుకే ఊపిరి పోసేది నీరు. దురదృష్టవశాత్తు అవి రెండూ నిర్లక్ష్యానికి గురి అవుతున్నాయి. ఒక పాతిక సంవత్సరాల క్రితం మన ఊళ్ల నుండి పారిన సెలయేర్లు, నదీపాయలు గమనిస్తే గతంలో మూడువందల రోజులు అవి నీటితో కళకళలాడుతూ ఉండేవి. ఇప్పుడు వరదలు వస్తే తప్పితే వాటిలో నీరు కనిపించటం లేదు. 'ఏటిగట్టు' అనే పదం మన నిత్యజీవితం నుండి మాయమైపోతున్నది. జూన్ నెలలో మొదలయ్యే తొలకరి చినుకులు, వడగండ్ల వానలు మన పిల్లలకు తెలియవు. తొలకరి మొదలవగానే ఇళ్లల్లో నాటే కూరగాయల విత్తనాలు మొలకెత్తి ఆషాఢంలో కాపుకొస్తాయని, శ్రావణంలో బంతి, చేమంతి విరగబూస్తాయని మనమే మరచిపోతున్నాం. వర్షాల్లో నానే స్త్రీల పాదాలు, అరచేతులకు రక్షణగా ఆషాఢంలో పెట్టుకునే గోరింటాకు మాయమైపోయి మెహిందీ వచ్చేసింది. మెహిందీ రావటం తప్పుకాదు కానీ, ఎటువంటి కెమికల్స్ లేని పచ్చి గోరింటాకు వాసన లేకపోవటం బాధాకరం. తాము పెట్టిన విత్తనం మొలక రావటం, తరువాత ఆకులు చిగురిస్తుంటే కలిగే అనుభూతికి మన పిల్లలు దూరమవ్వటం బాధాకరం. వారు చిన్నప్పుడు నాటిన మొక్క వారితో పాటే పెరిగి మహావృక్షంగా మారటం మన పిల్లలకు తెలియదు. మన పిల్లలు ప్రకృతికి దూరమవుతున్నారు. ప్రకృతికి దూరంగా పెరుగుతున్న పిల్లలకు నీటి విలువ, చెట్టు విలువ తెలియకపోవటంలో ఆశ్చర్యం లేదు. వాటి విలువను తెలియచేస్తూ హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ గుండ్లకమ్మ నదీ పరివాహక ప్రాంతాన్ని కాపాడే దిశగా అడుగులు వేయటం అభినందనీయం. నల్లమల అడవుల్లో పుట్టి, 280 కిలోమీటర్లు ప్రయాణించి, ఒంగోలు దగ్గరలో సముద్రంలో కలిసే గుండ్లకమ్మ నదికి ఇరువైపులా 280 వచ్చినవే. ప్రపంచంలో ఏ నాగరికతకైనా ప్రధానం నీరే. అటువంటి నీటి వనరులను జాగ్రత్తగా చూసుకోవటం మన బాధ్యత. మట్టిలో జీవశక్తి తగ్గిపోతే భవిష్యత్తులో తీవ్రమైన ఆహార సంక్షోభం వచ్చే అవకాశం ఉందని గ్రహించిన భారీ ఉద్యమాన్ని మొదలుపెట్టాయి. మట్టిలోని సారాన్ని కాపాడటానికి తొలి అడుగుగా వ్యవసాయ భూముల్లో 3 నుండి 6 శాతం సేంద్రియ కర్బనం ఉండేలా ప్రభుత్వాలు చట్టాలు చేసి, వాటిని కఠినంగా అమలు అయ్యేలా చూడాలని ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకులు జగ్గీ వాసుదేవ్ ఉద్యమిస్తున్నారు. ఉద్యమ ప్రచారంలో భాగంగా ఆయన 2022లో లండన్ నుండి 27 దేశాల గుండా 30,000 కిలోమీటర్లు మోటార్ సైకిల్ యాత్ర చేశారు. ఆ యాత్ర ద్వారా ఆయన 391 కోట్ల జనాభాకు అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. దాదాపు 80కి పైగా దేశాలు మట్టిని రక్షించండి అనే ఉద్యమానికి మద్దతు కుంటున్నాయి. కానీ కొందరు వ్యక్తులు మాత్రం అటవీ సంపదను పెంచేందుకు ఒంటరి పోరాటం చేస్తున్నారు. అసోం రాష్ట్రంలో జాదవ్ పాయెంగ్ అనే ఒక సాధారణ గిరిజన రైతు బ్రహ్మపుత్ర నదిలోని ఇసుక తిన్నెపై ఒంటరిగా మొక్కలు నాటటం మొదలుపెట్టి 40 సంవత్సరాలలో 1360 ఎకరాలలో దట్టమైన అడవిని సృష్టించారు. కర్ణాటకకు చెందిన హాలక్కి తెగకు చెందిన తులసి గౌడ అనే నిరక్షరాస్యురాలు 30,000 ఔషధ గుణాలున్న మొక్కలను నాటారు. 1970ల ప్రాంతంలో అడవుల రక్షణ కోసం చిప్కో ఉద్యమాన్ని మొదలుపెట్టిన సుందర్‌లాల్ బహుగుణ హిమాలయ అడవులను రక్షించిన వారిలో అగ్రగణ్యుడు. వారందరూ చేసినంతగా మనం చేయలేకపోయినా మన పిల్లలతో ఒక్క చెట్టు నాటించి దానిని సంరక్షించే బాధ్యతను వారికి అప్పజెబితే చాలు. గోదావరి పుష్కరాలకు పిల్లలను పుష్కర స్నానం చేస్తే పుణ్యం వస్తుంది అని చెప్పటంతో పాటు, ఆ నది ఎంతమంది దాహార్తిని తీరుస్తుందో, ఎన్ని రాష్ట్రాలలో ఎన్ని లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేస్తుందో వారికి వివరించే ప్రయత్నం చేద్దాం. రైల్లో వెళ్తూ కృష్ణా నదిలో డబ్బులు ఎందుకు వేయిస్తారో వివరించకపోయినా, కృష్ణమ్మ ఎన్ని ఉపనదులను తనలో కలుపుకుని మన వాకిలి గుండా వెళ్లి హంసలదీవిని చేరుతుందో రేఖామాత్రంగా పిల్లలకు తెలియచేయండి. పుష్కరాలు అనగానే పుష్కర స్నానాన్ని పుణ్యం వచ్చే స్నానంగా ప్రచారం చేసే ప్రభుత్వాలు, వాటిని ప్రచారం చేసే క్రమంలో నీటిని కాపాడుకోవలసిన అవసరాన్ని కూడా కొంత మేర అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తే కోటాను కోట్లు ఖర్చుపెట్టి చేసే ప్రచారానికి కొంత ఉపయోగం ఉంటుంది.!@ఇంద్రాణి.

## వందనపురి కాలనీ సమస్యలపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి వినతిపత్రం



**బీరంగూడ (వుదయం):**

పటాన్‌చెరు నియోజకవర్గ శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి శనివారం ఉదయం వందనపురి కాలనీని సందర్శించారు. ఉదయం 7:30 గంటలకు కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యేకు వందనపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కాలనీలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు మౌలిక సదుపాయాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా డ్రైనేజీ పైపులైన్ల ఏర్పాటు, రహదారుల అభివృద్ధి, వర్షాకాలంలో ఎదురవుతున్న ఇబ్బందులపై అసోసియేషన్ సభ్యులు వివరించారు.కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోడ్లు కూడా దెబ్బతిని ప్రజల రాకపోకలకు ఆటంకం కలుగుతోందని పేర్కొంటూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాలనీ సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వందనపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొని కాలనీ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

## ప్రకృతిని కాపాడుకోవటం మనందరి బాధ్యత



**- అరబిందో పార్మా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ సూరత్**

**మేడ్చల్, జూన్ 6, (వుదయం ప్రతినిధి ),**

పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మన భవిష్యత్తు భద్రంగా ఉంటుందని, అకాల వర్షాలు, తీవ్రమైన వేడిగాలులు ప్రకృతి విధ్వంసానికి సంకేతాలని అరబిందో, అపిటోరియా ఫార్మా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ సూరత్ అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని అపిటోరియా ఫార్మా యూనిట్ 2 లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగానే కాకుండా సమయం కుదిరినప్పుడల్లా ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మానవ మనుగడకు మొక్కలు ఎంతో అవసరమన్నారు. మొక్కలు మనకు ఆహారం, గాలి, నీరు మంచి వాతావరణాన్ని అందిస్తాయన్నారు. మన ప్రకృతిపై ఆధారపడి ఉన్నామని ప్రకృతి మన జీవనానికి ఎంతో అవసరం మొక్కలు, జంతువులు, ఇతర జీవులు పర్యావరణ వ్యవస్థలో ముఖ్యమైన భాగాలు వాటిని రక్షించడం ద్వారా మనం పర్యావరణ వ్యవస్థ సమతుల్యతను కాపాడుకోవచ్చు అని అన్నారు. ఈ కాలుష్య సమస్యల నుండి వాతావరణాన్ని కాపాడడం మన బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని, ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ హెచ్ ఎస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తపస్ సహా, ఈ హెచ్ ఎస్జనరల్ మేనేజర్ అమర్ కూడాలే, అపిటోరియా ఫార్మా యూనిట్ 2 జనరల్ మేనేజర్ వేల్పుల విజయ్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ అన్ను లక్ష్మినారాయణ, మైంటెనెన్స్ డి జి ఎమ్ ఆకెళ్ళ రవికుమార్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మాడాలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల జూన్ 06 (వుదయం కరస్పాండెంట్)**




ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి సెన్సెస్, సాదా బైనామా, ఎస్ఐఆర్ అంశాలపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ జూన్ 25 నుంచి ప్రారంభమవుతుందని ఈ లోగానే బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం పూర్తయ్యేలా రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడాలన్నారు. ఆయా పోలింగ్ స్టేషన్ల బూత్ లెవెల్ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించేలా పై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. అక్టోబర్ 1న ఫైనల్ ఓటర్ జాబితా ముద్రించి, ప్రకటించడం జరుగుతుందని, ప్రక్రియ మొత్తం సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. జనాభా గణన 2027 లో భాగంగా మొదట ఇండ్ల గణన చేపట్టినందున ఏ ఒక్క ఇంటిని వదలకుండా నిర్దేశిత సమాచారాన్ని సేకరించాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి వివిధ భూ సమస్యలపై ప్రజలు పెద్ద ఎత్తున కలెక్టరేట్ కు వస్తున్నారని, ఆయా మండలాల్లోనే సంబంధిత అధికారులు వారి సమస్యలను పరిష్కరించాల్సి ఉందన్నారు. పెండింగ్ లో ఉన్న సాదా బైనామాల పరిష్కారానికి మండలాల వారీగా సంబంధిత తహసిల్దార్లతో కలెక్టర్ మాట్లాడారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, సిపిఓ పాపయ్య, వివిధ మండలాల తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల కోసం ప్రభుత్వం మాస్టర్ ప్లాన్...!

**- ఇకనుంచి డిజిటల్ సర్వీస్ బుక్**
**ప్రతి ఉద్యోగికి యూజర్ ఐడి పాస్వర్డ్**
**- సంఘ లీడర్లకు ట్రెజరీ అధికల దందాలకు పుల్ స్టాప్**

**వికారాబాద్ జూన్ 6 (వుదయం బ్యూరో)**



ఇంత కాలం ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ బుక్స్ నిర్వహణ లో జరుగుతున్న అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అందుకోసం డిజిటల్ సర్వీస్ బుక్ ను అమల్లోకి తెచ్చేందుకు కసరత్తును స్పీడప్ చేసింది. దీంతో ఎన్ని రోజులు సెలవులు తీసుకున్నారు ? ఎన్ని ఎర్నిండ్ లీవ్స్ ఉపయోగించుకున్నారు ? చైల్డ్ కేర్ లీవ్స్ ఉపయోగించుకున్నారా ? లేదా ? ప్రభుత్వం నుంచి తీసుకున్న కారు లోన్ వాయిదాలను చెల్లిస్తున్నారా ? లేదా? అనే అంశాలపై పారదర్శకత వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి నుంచి ఉద్యోగుల స్వల్పకాలిక, దీర్ఘకాలిక సెలవులు అన్ని ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పిస్తుంది. ట్రెజరీ ఆఫీసర్ల దందాకు చెక్ ప్రస్తుతం ఉద్యోగుల సర్వీస్ బుక్స్ ఫిజికల్ గా నిర్వహిస్తున్నారు. ప్రతి ఉద్యోగి ఉద్యోగంలో చేరినప్పటి నుంచి రిటైర్ అయ్యే వరకు అతని సెలవులు, ఇంక్రిమెంట్స్, స్పెషల్ ఇంక్రిమెంట్స్, ఎర్నిండ్ లీవ్స్, సర్వీసులోని ఇతర అంశాలు సంబంధిత బుక్స్ లో ఎంటర్ చేస్తున్నారు. ఈ బాధ్యతలను సంబంధిత శాఖ విభాగాధికారి, డ్రాయింగ్ ఆఫీసర్( ట్రెజరీ ఆఫీసరు) పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. దీంతో ఆ ఇద్దరు కుమ్మక్కై ఉద్యోగి నుంచి మామూళ్లు తీసుకుని, అతనికి అనుకూలంగా సర్వీస్ బుక్ ను రాస్తున్నట్టు ఫిర్యాదులు ఉన్నాయి. ఉదాహరణకు A అనే జూనియర్ లెక్చరర్ 2023-24 సంవత్సరంలో 20 రోజుల ఎర్నిండ్ లీవ్స్ ఉపయోగించుకున్నారు.ఆ విషయాన్ని కాలేజీ ప్రిన్సిపాల్ జూనియర్ లెక్చరర్ సర్వీస్ బుక్‌లో ఎంటర్ చేయాలి. దాన్ని ట్రెజర్ ఆఫీసర్ కు సమాచారం ఇవ్వాలి. కానీ జూనియర్ లెక్చరర్ ఇచ్చే మామూళ్లు తీసుకుని ప్రిన్సిపాల్, లో ఎంటర్ చేయడం లేదు. ఇలా ఒక్కో నెల ట్రెజరీ ఆఫీసరు లక్షల్లో వసూళ్లు చేస్తున్నట్టు కొన్ని జిల్లాల్లో ట్రెజరీ ఆఫీసర్ల సహకారంతో ఒక ఉద్యోగి రెండు మూడు సార్లు చైల్డ్ కేర్ లీవ్స్ ఉపయోగించుకుంటున్నట్టు ప్రభుత్వం గుర్తించినట్లు తెలిసింది. అలాగే కొన్ని జిల్లాల్లో ఉద్యోగులు విదేశీ పర్యటనకు వెళ్లేందుకు పెట్టిన దీర్ఘ కాలిక సెలవులను సైతం సర్వీస్ బుక్స్ లో ఎంటర్ చేయలేదని ఫిర్యాదులు అందినట్లు సమాచారం. కొందరు సీనియర్ అధికారులు కార్లు కొనుక్కునేందుకు ప్రభుత్వం నుంచి తీసుకున్న వెహికల్ లోన్లను ట్రెజరీ ఆఫీసర్ల సహకారంతో తిరిగి చెల్లించకుండానే రిటైర్డ్ అయినట్టు ఆరోపణలు ఉన్నాయి. త్వరలోనే ఆన్ లైన్ లోకి..రెండు మూడు నెలల్లో ఆన్ లైన్ సర్వీసు బుక్ ను అమల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పనిచేస్తున్నది. ఇప్పటి వరకు సుమారు 85 శాతం మంది ఉద్యోగులు తమ సర్వీస్ బుక్స్ ను ఆన్ లైన్ లో అప్లోడ్ చేసినట్లు తెలిసింది. వాటన్నింటినీ స్క్రూటీనింగ్ చేసిన తరువాత ఒక్కో ఉద్యోగికి ప్రత్యేకంగా యూజర్ ఐడీ, పాస్ వర్డ్ ను జారీ చేయనున్నారు. అందుకోసం ఆర్థిక శాఖ ప్రత్యేకంగా ఓ ఐటీ విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఆన్ లైన్ సర్వీస్ బుక్ అమల్లోకి వచ్చిన తర్వాత ప్రతి ఉద్యోగి సెలవుల కోసం ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి. సెలవుల మంజూరు కూడా ఆన్ లైన్ లోనే సంబంధిత విభాగానికి చెందిన అధికారి అనుమతించాల్సి ఉంటుంది. అలాగే అతనికి సంబంధించిన ప్రమోషన్లు, ఇంక్రిమెంట్స్‌తో పాటు ఇతర అంశాలు అన్ని కూడా ఆన్ లైన్ లోనే అందుబాటులో ఉంటాయి.

## సిద్దిపేటలో విద్యార్థులతో 'గ్రీన్ ర్యాలీ'.. సింగిల్

**-యూస్ ప్లాస్టిక్ రహిత సమాజానికి పిలుపు**

**సిద్దిపేట, జూన్ 06(వుదయం బ్యూరో)**

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు" లో భాగంగా శనివారం సిద్దిపేట ఇందిరానగర్ కాలనీలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు, అనంతరం 'గ్రీన్ ర్యాలీ' నిర్వహించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ, 'సే నో టు ప్లాస్టిక్' నినాదాలతో ఇందిరా నగర్ కాలనీ, మార్కెట్ రోడ్‌లలో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి సహాయ పర్యావరణ శాస్త్రవేత్త టి. రవీందర్ మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని, అందుకే పాఠశాల స్థాయి నుంచే ప్లాస్టిక్ మహమ్మారిపై అవేర్నెస్ కల్పిస్తున్నామని తెలిపారు. ప్లాస్టిక్‌కు బదులుగా బట్ట సంచులు, నార సంచులు, విస్తరాకులు, చెక్క (వుడెన్) గ్లాసులు, స్పూన్లు, మట్టి పాత్రలను వాడాలని ఆయన సూచించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు, నేల అందించేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణ అనుకూల పద్ధతులను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమం అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు క్యాపులు, బట్ట సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఏ. రాజప్రభాకర్ రెడ్డి, ఎన్జీవో సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో గ్రామసభ

**మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి**

నిజాంపేట మండలం రాంపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ శ్రీ పొన్న బోయిన ప్రవీణ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించడం జరిగింది ఇట్టి గ్రామసభకు ప్రత్యేకాధికారిగా ఎం పి డి వో శ్రీ రాజి రెడ్డి హాజరైనారు ఇట్టి గ్రామసభలో రాబోయే వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు మరియు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలగురించి వివరించడం జరిగింది, మంచి నీటి సమస్యల గురించి, 4 రకాల చెత్త నిర్వహణ గురించి, వర్షపు నీటి వినియోగం గురించి, పారిశుద్ధ్యం గురించి, వ్యవసాయం గురించి, ఓటర్ జాబితా సవరణల గురించి ఇతర అంశాల గురించి చర్చించడం జరిగింది. ఇట్టి గ్రామసభకు ఉప సర్పంచ్ అనిల్, వార్డు సభ్యులు సయ్యద్, రాములు , పంచాయతి కార్యదర్శి చంద్రహాస్, ఎ పి వో శ్రీనివాస్, హెడ్ మాస్టర్లు పద్మారెడ్డి,పరిశరాములు, ఏ ఈ ఓ రమ్య, ఆశ కార్యకర్త మమత, అంగన్వాడీ టీచర్ భాగ్యమ్మ, వి ఓ ఏ స్వప్న, ఇరిగేషన్ వర్క్ ఇన్స్పెక్టర్ మహరాజు, మిషన్ భగీరథ హెల్పర్ పరిశరాములు, బాలరాజు, ఫిరోజ్, దుర్గారాజ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక

**వికారాబాద్, జూన్ 6: (వుదయం జిల్లా ప్రతినిధి):**

జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ. వికారాబాద్ : డబుల్ బెడ్ రూమ్ ల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. శనివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో తాండూరు నియోజకవర్గంలోని డబుల్ బెడ్ రూమ్ ల ఎంపిక ప్రక్రియపై జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కే. వెంకటాచారి, తాండూర్ శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాథోడ్ దశరథ సింగ్, మునిసిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి ల సమక్షంలో రాండమైజేషన్ ద్వారా ఇండ్ల కేటాయింపు పై కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ... తాండూర్ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూముల నిమిత్తం 8333 దరఖాస్తులు వచ్చాయని , 1001 డబుల్ బెడ్ రూమ్ ల నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయన్నారు ప్రస్తుతం 581 ఇండ్లు లబ్ధిదారులకు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఇండ్ల కేటాయింపులు ఎలాంటి అవకతవకలు తావు ర్యాండమైజేషన్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ఆయన తెలిపారు. ర్యాండమైజేషన్ ద్వారా ఎంపికైన లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత ఉన్నట్లు అయితే మాత్రమే ఇండ్ల కేటాయింపు జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అర్హత లేకుండా ఇండ్ల కేటాయింపు జరిగిందని తెలిసిన పక్షంలో ఫిర్యాదులను స్వీకరించి మరో దఫా విచారణ చేపడతామని కలెక్టర్ తెలిపారు.






“ అభిషేక్ వల్లే పార్టీలో అంతర్గత తిరుగుబాటు జరిగింది. మమతా బెనర్జీని తాము గౌరవిస్తున్నామని.. అయితే తమపై పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ పెత్తనాన్ని మాత్రం అంగీకరించబోము. పార్టీ కోసం ఏమీ చేయకపోయినా దీదీ ఆయనకు ఉన్నత స్థానాన్ని కట్టబెట్టారు. బెంగాల్ ఎన్నికల్లో టీఎంసీ ఓటమి అనంతరం మమతా బెనర్జీ కాళీఘాట్ నివాసంలో సమావేశం నిర్వహించారని రితబ్రత పేర్కొన్నారు. పార్టీ కోసం అభిషేక్ చేసిన కృషికి గానూ నిలబడి చప్పట్లు కొట్టాలని సమావేశానికి హాజరైన నేతలు, కార్యకర్తలకు మమత సూచించారు. ఎన్నికల్లో ఓడిపోయిన బాధలో ఉన్న తమను ఈ చర్య మరింత బాధించింది. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేల చేత సంతకాలు తీసుకున్నారు. హాజరు కాని వారి పేర్లను అధికారిక రికార్డుల్లో రాసుకున్నారు. టీఎంసీలో అవినీతి బాగా పెరిగిపోయింది, దానిని ప్రక్షాళించాల్సిన సమయం వచ్చింది. ”

– టీఎంసీ రెబల్ నేత రితబ్రత బెనర్జీ

## వే'మన'పద్యం

తామసించి చేయతగ దెట్టికార్యంబు
వేగిరింప నదియ విషమెయగును
పచ్చికాయదెచ్చి బడవేయ ఫలమౌనె?
విశ్వదాభిరామ! వినురవేమ



# తెలంగాణ రియల్ ఎస్టేట్ రంగంలో కొత్త సమీకరణాలు

తెలంగాణ రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువలను ప్రభుత్వం తాజాగా సవరించిన నిర్ణయం కేవలం ఒక పరిపాలనాపరమైన ప్రక్రియ మాత్రమే కాదు, అది రాష్ట్ర సర్వతోముఖ ఆర్థిక గమనాన్ని, సామాజిక ముఖ చిత్రాన్ని శాసించే అత్యంత కీలకమైన పరిణామం. శుక్రవారం నుంచే అమల్లోకి వచ్చిన ఈ నూతన మార్గదర్శక విలువలు అటు ప్రభుత్వ ఖజానాకు ఊరటనిచ్చే అంశంగానూ, ఇటు సామాన్య, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలపై భారాన్ని పెంచే సవాలుగానూ ద్విముఖ ప్రభావాన్ని చూపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూములు, నివాస స్థలాలు, వాణిజ్య భవనాలు, అపార్ట్‌మెంట్లు, ఖాళీ స్థలాల ధరలు గణనీయంగా పెరగడం వల్ల ఇటు ఆర్థిక రంగం, అటు రియల్ ఎస్టేట్ రంగాల్లో కొత్త సమీకరణాలు మొదలయ్యాయి. ముఖ్యంగా హైదరాబాద్ మహానగరం, దాని పరిసర జిల్లాలైన రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, సంగారెడ్డిలతో పాటు ద్వితీయ శ్రేణి నగరాలైన వరంగల్, ఖమ్మం, కరీంనగర్ వంటి వేగంగా విస్తరిస్తున్న ప్రాంతాలలో ఈ పెంపుదల ప్రభావం అత్యంత తీవ్రంగా కనిపిస్తోంది. కొన్ని ప్రైమ్ లోకాలిటీల్లో వంద శాతానికి పైగా పెంపుదల నమోదు కాగా, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కొంత వెసులుబాటు కల్పించారు. కనిష్ఠంగా ఎకరానికి రూ.2.75 లక్షల నుండి గరిష్ఠంగా ప్రధాన నగర కూడళ్లలో రూ.35 కోట్ల వరకు ప్రభుత్వ విలువలను నిర్ణయించడం ఈ తాజా మార్పుల సవరణల తీవ్రతను స్పష్టం చేస్తోంది. భూవిలువల సవరణల పూర్వాపరాలను పరిశీలిస్తే, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గత దశాబ్ద కాలంలో మౌలిక సదుపాయాల కల్పన ఊహించని రీతిలో పెరిగింది. మెట్రో రైలు విస్తరణ, ఔటర్ రింగ్ రోడ్ (ORR) చుట్టూ పెరిగిన అభివృద్ధి, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్ (RRR) పరిణామాలు, ఐటీ కారిడార్ల విస్తృతి, ఫార్మాసిటీ, విమానాశ్రయ పరిసరాల అభివృద్ధి వంటివన్నీ బహిరంగ మార్కెట్లో భూముల ధరలను ఆకాశానికి చేర్చాయి. అయితే, ప్రభుత్వ రికార్డుల్లో ఉండే మార్గదర్శక విలువలు (Guideline Values) మాత్రం చాలా ఏళ్లుగా వాస్తవ మార్కెట్ ధరలకు ఏమాత్రం పొంతన లేకుండా ఉండిపోయాయి. అనేక ప్రైమ్ ఏరియాల్లో ఓపెన్ మార్కెట్ ధరలు ప్రభుత్వ విలువల కంటే మూడు నుండి ఐదు రెట్లు ఎక్కువగా ఉండటంతో ఒక పెద్ద ఆర్థిక అంతరం ఏర్పడింది. ఈ అంతరాన్ని ఆసరాగా చేసుకుని రిజిస్ట్రేషన్ల సమయంలో పెద్ద ఎత్తున నల్లధనం (Black Money) చలామణీ కావడం, తద్వారా పన్నుల ఎగవేత జరగడం పరిపాటిగా మారింది. రిజిస్ట్రేషన్ వ్యవస్థలో పారదర్శకతను పెంచడానికి, నల్లధన ప్రవాహాన్ని నియంత్రించడానికి మార్కెట్ వాస్తవికతకు దగ్గరగా ప్రభుత్వ రికార్డులను తీసుకురావడమే ఈ సవరణల ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వ వర్గాలు గట్టిగా సమర్థిస్తున్నాయి. తాజా సవరణల వల్ల ఈ వ్యత్యాసం గణనీయంగా తగ్గి, ప్రతి లావాదేవీ చట్టబద్ధమైన పరిధిలోకి వచ్చే అవకాశం మెరుగవుతుంది.

ఈ నిర్ణయం వెనుక ఉన్న బలమైన సానుకూల ఆర్థిక కోణం ప్రభుత్వ ఆదాయ వృద్ధి. ప్రస్తుత అంచనాల ప్రకారం, ఈ భూవిలువల సవరణ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు అదనంగా రూ.1200 కోట్ల నుంచి రూ.1400 కోట్ల వరకు వార్షిక ఆదాయం సమకూరే అవకాశముంది. సాధారణంగా స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు, బదిలీ సుంకాలు (Transfer Duty) అన్నీ కూడా ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ విలువల ఆధారంగానే శాతాల రూపంలో వసూలవుతాయి కాబట్టి, మూల విలువ పెరగడంతో ప్రభుత్వానికి వచ్చే రాబడి సహజంగానే పెరుగుతుంది. ఇప్పటికే సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పన, పాత అప్పుల తీర్పులతో కొంత ఒత్తిడిలో ఉన్న తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఈ అదనపు వనరులు ఒక తక్షణ ఉపశమనంగా మారుతాయని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ప్రభుత్వ ఆదాయం పెరిగితే, దానిని తిరిగి ప్రజా సంక్షేమానికి, రహదారులు, తాగునీరు, సాగునీటి ప్రాజెక్టుల వంటి ప్రజా ఉపయోగ మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేసే అవకాశం ప్రభుత్వానికి లభిస్తుంది. అయితే, నాణేనికి ఉన్న మరో వైపులా ఈ నిర్ణయం సామాన్య, మధ్యతరగతి ప్రజలపై మోపిన భారం తక్కువదేమీ కాదు. ఒక కుటుంబం తమ జీవితకాల సంపాదనను కూడబెట్టి ఒక చిన్న ఇల్లు లేదా ప్లాట్ కొనుగోలు చేయాలనుకున్నప్పుడు, పెరిగిన విలువల కారణంగా రిజిస్ట్రేషన్ ఖర్చులు తడిసి మోపెడవుతాయి. గతంలో తక్కువ ప్రభుత్వ విలువ ఆధారంగా చెల్లించిన పన్నులతో పోలిస్తే, ఇప్పుడు నేరుగా పెరిగిన విలువలపైనే స్టాంపు డ్యూటీ చెల్లించాల్సి రావడంతో కొనుగోలుదారుడి జేబుకు పెద్ద చిల్లు పడుతుంది. ఉదాహరణకు, ఒక నివాస స్థలం ప్రభుత్వ విలువ గతంలో రూ.10 లక్షలు ఉండి, ఇప్పుడు అది రూ.15 లక్షలకు పెరిగితే, దానిపై చెల్లించాల్సిన స్టాంపు డ్యూటీ శాతం మారకపోయినా, చెల్లించాల్సిన అసలు సొమ్ము భారీగా పెరుగుతుంది. ఇది గృహ నిర్మాణ వ్యయాన్ని పెంచడమే కాకుండా, నగరాల్లో అద్దెలు పెరగడానికి, అపార్ట్‌మెంట్ల ఫ్లాట్ల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోవడానికి దారితీస్తుంది. ముఖ్యంగా తొలిసారి ఇల్లు కొనుగోలు చేసే యువత, మధ్యతరగతి ఉద్యోగులు ఈ భారాన్ని మోయలేక తమ సొంతింటి కలలను వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రియల్ ఎస్టేట్ మరియు నిర్మాణ రంగాలపై దీని ప్రభావం మిశ్రమంగా ఉంటుందని భావిస్తున్నారు. స్వల్పకాలంలో ఈ నిర్ణయం మార్కెట్లో ఒకరకమైన మందగమనానికి (Slowdown) కారణం కావచ్చు. కొనుగోలుదారులు, పెద్ద పెట్టుబడిదారులు మార్కెట్ ధరల స్థిరీకరణను గమనించే వరకు కొత్త లావాదేవీలకు దూరంగా ఉండే అవకాశం ఉంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా ప్రాజెక్టుల వ్యయాలు పెరగడం వల్ల కొత్త వెంచర్ల ప్రారంభాన్ని కొంతకాలం



వాయిదా వేయవచ్చు. అయితే, దీర్ఘకాలిక ప్రయోజనాల కోణంలో చూస్తే, ఈ సవరణల వల్ల రియల్ ఎస్టేట్ రంగంలో విశ్వసనీయత, పారదర్శకత పెరుగుతాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రభుత్వ విలువలు, బహిరంగ మార్కెట్ ధరలు ఒకే స్థాయికి చేరినప్పుడు బ్యాంకుల నుండి లభించే గృహ రుణాలు (Home Loans) సులభతరమవుతాయి. ఎందుకంటే బ్యాంకులు ప్రభుత్వ విలువ లేదా రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగానే గరిష్ఠ రుణాన్ని మంజూరు చేస్తాయి. గతంలో మార్కెట్ ధర ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రభుత్వ విలువ తక్కువగా ఉండటం వల్ల కొనుగోలుదారులకు బ్యాంకుల నుండి ఆశించిన స్థాయిలో రుణం లభించేది కాదు, మిగిలిన మొత్తాన్ని చేతి నుండి లేదా ప్రైవేట్ అప్పుల ద్వారా సమకూర్చుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు రిజిస్ట్రేషన్ విలువ పెరగడం వల్ల బ్యాంకులే ఎక్కువ శాతం రుణాన్ని అందించే అవకాశం ఉంటుంది, ఇది ఒక రకంగా కొనుగోలుదారులకు ఊరటనిచ్చే పరిణామం.

వ్యవసాయ రంగం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై కూడా ఈ భూవిలువల సవరణ భిన్నమైన ప్రభావాలను చూపుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల ధరలను నిర్ణయించేటప్పుడు ప్రభుత్వం కేవలం విస్తీర్ణాన్ని మాత్రమే కాకుండా, ఆయా భూములకు ఉన్న నీటి వనరులు, జాతీయ లేదా రాష్ట్ర రహదారులకు ఉన్న సామీప్యత, పారిశ్రామికాభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిగణనలోకి తీసుకుంది. నీటిపారుదల వసతి ఉన్న భూములు, పట్టణాలకు ఆనుకుని ఉన్న వ్యవసాయ క్షేత్రాల విలువలు భారీగా పెరిగాయి. దీనివల్ల రైతులకు ఒక వైపు భూమిపై ఉన్న ఆస్తి విలువ పెరిగినప్పటికీ, కుటుంబాల మధ్య జరిగే అంతర్గత భూ బదిలీలు, వారసత్వ రిజిస్ట్రేషన్ల సమయంలో ఖర్చులు పెరుగుతాయి. చిన్న మరియు సన్నకారు రైతులు తమ అవసరాల కోసం భూములను అమ్ముకోవాలన్నా లేదా కొనుగోలు చేయాలన్నా ఈ అదనపు రిజిస్ట్రేషన్ ఫీజులు భారం కానున్నాయి. మరో ముఖ్యమైన పరిణామం ఏమిటంటే, ఈ సవరణలు కేవలం పన్నుల వసూళ్లకే పరిమితం కాకుండా, రాష్ట్రంలోని భూపరిపాలన (Land Administration) వ్యవస్థను ఆధునీకరించే ప్రక్రియతో ముడిపడి ఉన్నాయి. ధరణి పోర్టల్, డిజిటల్ భూ రికార్డులు, ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ విధానాలు వంటి సాంకేతిక విప్లవంతో పాటు ఈ విలువల సవరణ కూడా తోడవ్వడంతో భూముల యాజమాన్య హక్కుల బదిలీలో అక్రమాలకు, తప్పుడు డిక్లరేషన్లకు ఆస్కారం తగ్గుతుంది. మార్కెట్ ధరలకు అనుగుణంగా రికార్డులు నవీకరించబడటం వల్ల భూసేకరణ (Land Acquisition) సమయాల్లో రైతులకు, భూయజమానులకు ప్రభుత్వం నుండి లభించే పరిహారం కూడా సముచితంగా ఉండే అవకాశం ఉంటుంది. గతంలో ప్రభుత్వ విలువలు తక్కువగా ఉండటం వల్ల ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు తక్కువ పరిహారం లభించి నష్టపోయేవారు, ఇప్పుడు ఆ నష్టం జరిగే అవకాశం చాలా వరకు తగ్గుతుంది. అయినప్పటికీ, ప్రభుత్వం ఈ సవరణల తదుపరి పరిణామాలను నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆదాయ వృద్ధి లక్ష్యంగా సాగిన ఈ ప్రక్రియ పారిశ్రామిక రంగానికి, గృహ నిర్మాణ రంగానికి శ్రేయస్కరంగా మారాలంటే కొన్ని రక్షణ చర్యలు అవసరం. నిర్మాణ రంగంపై ఆధారపడి జీవించే లక్షలాది మంది వలస కార్మికులు, తాపీ కార్మికుల ఉపాధి దెబ్బతినకుండా చూడాలి. ధరల పెంపుదల వల్ల రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుదేలు కాకుండా ఉండేందుకు, స్టాంపు డ్యూటీ శాతాన్ని స్వల్పంగా తగ్గించడం లేదా తొలిసారి ఇల్లు కొనుగోలు చేసే వారికి ప్రత్యేక రాయితీలు కల్పించడం వంటి విధానపరమైన మార్పులను ప్రభుత్వం పరిశీలించవచ్చు. తెలంగాణ ప్రభుత్వ భూముల మార్కెట్ విలువల సవరణ నిర్ణయం ఒక సంక్లిష్టమైన ఆర్థిక వ్యూహం. ఇది ఒక వైపు రాష్ట్ర ఆర్థిక బలాన్ని పెంచి, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన వనరులను సమకూర్చడం ద్వారా దీర్ఘకాలిక ప్రగతికి ఊతమిచ్చే పరిణామంగా కనిపిస్తోంది. మరోవైపు, తక్షణ ప్రభావంగా సామాన్య ప్రజలపై, ముఖ్యంగా మధ్యతరగతి వర్గాలపై ఆర్థిక భారాన్ని మోపింది. ప్రభుత్వ రాబడి పెంపుదల మరియు ప్రజా సంక్షేమం అనే ఈ రెండు పరస్పర విరుద్ధమైన అంశాల మధ్య సమతుల్యతను సాధించడంలోనే ఈ విధానం యొక్క అసలు విజయం ఆధారపడి ఉంటుంది. రానున్న రోజుల్లో మార్కెట్ శక్తులు ఈ ధరల పెంపును ఏ విధంగా జీర్ణించుకుంటాయి, నిర్మాణ రంగం ఏ మేరకు స్థిరత్వాన్ని ప్రదర్శిస్తుంది అనే అంశాలపైనే తెలంగాణ ఆర్థిక ముఖచిత్రం ఆధారపడి ఉంటుంది.

ప్రభుత్వ విలువలు, బహిరంగ మార్కెట్ ధరలు ఒకే స్థాయికి చేరినప్పుడు బ్యాంకుల నుండి లభించే గృహ రుణాలు (Home Loans) సులభతరమవుతాయి. ఎందుకంటే బ్యాంకులు ప్రభుత్వ విలువ లేదా రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగానే గరిష్ఠ రుణాన్ని మంజూరు చేస్తాయి. గతంలో మార్కెట్ ధర ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రభుత్వ విలువ తక్కువగా ఉండటం వల్ల కొనుగోలుదారులకు బ్యాంకుల నుండి ఆశించిన స్థాయిలో రుణం లభించేది కాదు, మిగిలిన మొత్తాన్ని చేతి నుండి లేదా ప్రైవేట్ అప్పుల ద్వారా సమకూర్చుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు రిజిస్ట్రేషన్ విలువ పెరగడం వల్ల బ్యాంకులే ఎక్కువ శాతం రుణాన్ని అందించే అవకాశం ఉంటుంది, ఇది ఒక రకంగా కొనుగోలుదారులకు ఊరటనిచ్చే పరిణామం.



సంగనబట్ల
9440595494

# పౌరుష, పరాక్రమానికి నిలయం మరాఠ యోధుడు

పౌరుష పరాక్రమాలకు నిలయమైన మరాఠా భూమిలో మహారాష్ట్రుల ఆశాకిరణం ఛత్రపతి శివాజీ మహారాజ్. మాతృభూమి యొక్క దాస్య శృంఖలాలను తెగతెంచుటకై ఉద్భవించిన మహాశక్తి స్వరూపుడు, భవానీ మాత భక్తుడు. స్వరాజ్య స్థాపన కొరకై నా సర్వస్వాన్ని త్యాగం చేస్తాను, నా తల్లి చెర విడిపిస్తానని కంకణం కట్టుకున్న కంకణాబద్ధుడు శివాజీ! . "భుజ బలం కన్నా, మేధా బలం గొప్పది" అని సంకల్పించి ప్రతి ఒక్కరిలో విదేశీయుల పాలనకు చరమ గీతం పాడుటకై యుద్ధ కాంక్ష ను రగిలించాడు. అఖండ భారతావనిని పాదాక్రాంతం చేసుకున్న శత్రువుడి గుండెల్లో రైళ్ళు పరిగెత్తించాడు శివాజీ!!! భవానీ మాత అనుగ్రహంతో ఖడ్గాన్ని పట్టుక బయలుదేరాడు శత్రువులను చెండటానికి, పట్ట పగలే నక్షత్రాలు చూయించాడు శివాజీ!,

**శివాజీ జననం,బాల్యం :** శివాజీ పుట్టుక యావత్ భారతదేశానికి గర్వకారణం, ఇతడి రాకతో మరాఠాల ఆశయాలు ఆకాశ అంచుల్ని తాకాయి, శత్రువుల ఆశయాలు నిరశలయ్యాయి. ఇతడు మహారాష్ట్ర లోని పూణే జిల్లా, జున్నార్ పట్టణం దగ్గర గల శివనేరి కోటలో షాహాజి భోంస్లే, జిజియా భాయ్ దంపతులకు 19 ఫిబ్రవరి 1630 లో జన్మించాడు. ఇతడి బాల్యం పూర్తిగా తమ అమ్మ సమక్షంలోనే గడిచింది. చిన్నప్పటి నుంచే భారత,రామాయణ కథలు చెప్పి వీరత్వం చిగురింపచేసింది. శివాజీ బాల్యంలో వజ్రఘర్ లో తమ స్నేహితులతో కాలయాపన చేస్తూ, గురుకులం కీ వెళ్లకుండా ఆవులు , అశ్వాలను మేపుతూ ఉండే వాడు. అలా రోజు రోజుకి అప్రయోజకుడిలా తయారవుతున్నాడు, వీటన్నింటినీ గమనిస్తున్న తల్లి వ్యదావరితమయిన్నది. ఒకనాడు ఒక సాధువు అడవిలో తండ్రి కోసం శివాజీ ఎదురుచూడటం గమనించి, అతడి వద్దకివెళ్ళి, ప్రశ్నించాడు అతను. శివాజీ తన తండ్రి కోసమై ఎదురుచూస్తున్నాను , అని బదులివ్వగా తండ్రి పేరు అడగగా మరాఠా వీరుడు అని , తల్లి ఎవరని అడగగా ! "తమ శీల సంపదలతో మహారాష్ట్రుల పవిత్రతను విశ్వవ్యాప్తం చేస్తున్న వనితలందరూ నా తల్లులే"! అని సమాధానమివ్వటం చూసి ఆ సాధువు ఆకర్షితుడయ్యాడు. శివాజీకి అతడి కర్తవ్యం గూర్చి, మాతృభూమి తిరిగి సాధించుటకు , అతడి ధైర్య సాహసాలు ఎంతో తోడ్పాటునిస్తాయి అని, స్వరాజ్య స్థాపన సాధించగలిగే యోధుడువీ నువ్వనీ అతడికీ మరింతగా దేశ భక్తినీ నూరిపోస్తాడు . శివాజీ గారి తండ్రి అయిన షాహాజి భోంస్లే విద్యాపుర సుల్తానుల వద్ద సర్దారుగా పని చేస్తున్నాడు జింజి ప్రాంతానికి. మరాఠా భూమిలో పుట్టి ముసల్మానుల సేవలో బతుకును వెల్లదియాలని సంకల్పించిన తండ్రినీ చూసి వజ్రఘర్ లో చాలా మంది ధనాశయానికి పని చేస్తునాడు అని అనేవాళ్ళు. కానీ శివాజీ మాత్రం పూర్తిగా "తన జీవితాన్నే మాతృభూమి కోసం సర్వసంత్యాగం చేస్తాను, మాతృభూమి చెర విడిపిస్తానని వీరలపనా చేశాడు. అలా ఒకనాడు స్నేహితులైన హీరానాయక్, యశ్వంత్ రావ్, దేశ్ పాండే, దత్తనాయక్ లతో కలిసి వజ్రఘర్ అడవిలో అశ్వలను, గోవులను మేపుటకై వెళ్ళాడు. అయితే కొద్దిసేపటికి అటుగా వెళుతున్న సుల్తాన్ సైన్యం వీళ్ళని చూసి, వీళ్ళని చుట్టుముట్టటం జరిగింది. ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు శివాజీతో పాటుగా తమ స్నేహితులు. ఆ సుల్తాన్ సైన్యం వీరిని బయపెట్టి,వీళ్ళ దగ్గర ఉన్నటువంటి అశ్వలను, గోవులను వాళ్ళ వెంట పెట్టుకొని వెళ్ళారు. ఏమి చేయలేని పరిస్థితిలో తిరిగి ఇంటికి వెళ్ళి జిజియా భాయ్ కి జరిగిన సంగతంతా తెలియచెప్పాడు హీరనాయక్. కానీ మేము వాళ్ళను ఏమి చేయలేక పోయాం, వాళ్ళ సైన్యం చాలా పెద్దగా ఉంది కనుక వదిలేసి రాక తప్పలేదు అమ్మ అన్నాడు. అప్పుడు జిజియా భాయ్ " భుజ బలం కన్నా!, మేధా బలం గొప్పది" మీరు వారిని ఏమి చేయకుండా వచ్చినందుకు నేను బాధ పడుతున్నాను, మీరు తక్షణమే మీ నుంచి లాక్కొని వెళ్లిన గోవులను, అశ్వలను ఎలాగైనా సరే వెంట పెట్టుకొని రావాలి అని సూచించగా! , శివాజీ తన స్నేహితులు కలిసి తమ యొక్క బుద్ధి బలం తో సుల్తాన్ సైన్యం కి నాయకత్వం వహిస్తున్న సికిందర్ ను తమ మాటలతో కథలల్లి, భయపెట్టి, తిరిగి తమ గోవులను, అశ్వాలను వెంట పెట్టుకొని వచ్చారు. ఇది చూసిన తల్లి ఎంతో సంతోషించింది. వజ్రఘర్ ప్రాంతం అంతా వీరి ధైర్య సాహసాలకు ఆకర్షితులవ్వటం జరిగింది.

**పూణే నగరానికి ప్రయాణం:**

అలా శివాజీకి యుదవిద్యాలపై నానాటికి ఇష్టం పెరిగింది. ఇది తెలుసుకున్న షాహాజి భోంస్లే తల్లితో కలిపి శివాజీనీ పూణే నగరానికి పంపించి, అక్కడ దత్తాజి ఆశ్రమంలో ఇతడి శిక్షణ ఇప్పించటం జరిగింది. శివాజీ క్రమం తప్పకుండా శిక్షణా లోనే నిమగ్నమయ్యేవాడు. అతి తక్కువ సమయంలోనే దత్తాజి కి దగ్గరయ్యాడు. అక్కడున్న యువసైన్యం కాస్తా!, శివ సైన్యం అయ్యింది. పూణే నగరమంతా శివాజీ పేరు వ్యాప్తి చెందింది. గుర్రపు స్వారీలో అతడిని మించిన వాడు లేనట్టుగా తయారయ్యాడు. ఖడ్గంతో శత్రువులను చెండాటంలో తనకు సాటి ఎవ్వరు లేని విధంగా తన శిక్షణా జరుగుతుంది.ఒకనాడు శివాజీ తన స్నేహితులు కలిసి అశ్వాలపై వెళ్తుండగా ఒక పఖీర్ అక్కడున్న హిందూ దేవాలయంలో శివాలయం లో లింగం పై కాళ్ళు ఆనించి, నంది పై తల పెట్టి పడుకోవటాన్ని గమనించినా శివాజీ అతడిని వెళ్ళి ప్రశ్నించగా! , ఎప్పుడో ఈ భూమి మొత్తం మా సుల్తాన్ వారికి పాదాక్రాంతం అయ్యిందని తిక్కగ సమాధానం ఇవ్వటం శివాజీకి ఎంతో కోపాన్ని కలిగించింది. ఇలా ఎన్నో అక్రమాలు, అరాచకాలు, హిందూ దేవాలయాలపై దాడులు శివాజీ మనసును కలచివేసింది. ఎలాగైనా ఈ అరాచకాలను నిలువరించాలి, స్వరాజ్య స్థాపన సాధించగలగాలి, అని ఉద్యమించాడు.

**మాతృదేశ గౌరవ ప్రతిష్టలను కాపాడుకోవటం:**

ఛత్రపతి శివాజీ మహారాజ్ మాతృభూమి పై జరుగుతున్న అకృత్యాలను చూసి సహించలేకపోయాడు. రోజు రోజుకు సుల్తాన్ సైన్యం చేస్తున్న విధ్వాసం ఎక్కువయ్యింది. ఎలాగైనా అణచివేయాలనే ఆలోచనతో తన యువ సైన్యం తో దత్తాజి గారితో సమావేశమయ్యాడు. అతడి నుంచి సలహా సూచనలు తీసుకొని ఎక్కడయితే అవమానం జరిగిందో అక్కడికే వెళ్ళాడు శివాజీ! . శిథిలమైన శివాలయం చుట్టూ కొంత సైన్యం ఉంది.ఒకసైనికుడు శివాజీ వద్దకి వచ్చి మీరెవరు?అని ప్రశ్నించాడు ? దానికి బదులుగా శివాజీ మరాఠాలము అని సమాధానమిచ్చాడు. ఈ భూమి పై స్వేచ్ఛగా విహరించే హక్కు మాకుంది , అస్సలు నువ్వు ఎవడివి? అని ప్రశ్నించాడు శివాజీ. ఆ సైనికుడు మీరు మరాఠాలు కాదు, సుల్తాన్ వారి బానిసలు అని అన్నాడు. శివాజీ వెంటనే గుర్రం దిగి, ఖడ్గం పట్టుకొని, అంబ భవానికి తప్పా! , మేమెవరికి తల వంచం అనీ! సైనికుడి తలను ఖండించాడు, యువ సేన హర్షధ్వానాలు చేసినారు. ఆ సంఘటన తెల్ల వారే లోపు నగరమంతా పాకి, సుల్తాన్ వారికి చెవిలో పడింది. యువసేన మొత్తం కొద్ది రోజులు రహస్యంగా గడిపారు. దాదాజీ ఆశ్రమం నుంచి తయారవుతున్న యువకులు, సుల్తాన్ సైనికులకు వ్యతిరేకంగా పోరాడుతారన్న వార్త వాడ వాడలో వ్యాపించింది. శివాజీ పై అంతు లేని విశ్వాసం, మహారాష్ట్రుల ఆశాకిరణంగా ఉద్భవించాడు. యువసైన్యం దిన దినానికి అభివృద్ధి చెందుతున్న క్రమంలో, అక్కడున్న సుల్తాన్ లకు, సర్దారులకు మరియు సంపన్నులకు ఈ సైన్యం యొక్క ధైర్య సాహసాల గురించి వార్తలందాయి. హిందువులపై జరుగుతున్న అకృత్యాలను నిలువరిస్తూ, హిందూ దేవాలయాల ధ్వంసాన్ని అడ్డుకుంటూ! సుల్తాన్ వారి సైన్యానికి ముసల్మానులకు శత్రువుగా మారాడు. మహారాష్ట్ర ప్రజల నాలుకల పై " విప్లవ కారుల నాయకుడంటా! , ఖడ్గం చేత పడితే మెరుపులు మెరిపించే వీరాది వీరుడంటా! అంటూ ప్రతి ఒక్కరిలో వ్యాప్తి చెందాడు. చిన్న వయసులోనే స్వరాజ్య స్థాపన కోసం ఉద్యమించాడు శివాజీ!. ఇలా శివాజీ సైన్యం చాలా పటిష్ఠంగా తయారయ్యింది.



**సమర్థ రామదాసు దర్శనం:**

ఒకనాడు శివాజీ అటవి మైదానంలో ఏకాంతంగా కూర్చొని భవిష్యత్ కార్యక్రమాలపై ఆలోచన పెట్టాడు. ఎంతో పటిష్టమైన సైన్యానికి స్థిర నివాసం కల్పించుకోవాలన్న ఆలోచనలో ఉండగా, మధ్యలో అడుగుల చప్పుడుతో ఒక అద్భుత చైతన్యమూర్తి శివాజీకి దర్శనం ఇచ్చాడు. ఆయన కాషాయ వర్ణం కలిగిన దుస్తులు ధరించి ఉన్నాడు. అలా ఆయనను చూస్తూ ఉండిపోయిన శివాజీ దగ్గరకు వెళ్ళి ఎవరు నువ్వు? అనీ అడిగాడు. దానికి సమాధానంగా అతడు నా పేరు సమర్థ రామదాసు అని బదులిచ్చాడు. శివాజీ వెంటనే తన ఆశీర్వాదం తీసుకున్నాడు. శివాజీ వినయంగా నేను మీ పాదరేణువులను శిరసా ధరించి, ఆజ్ఞను శిరసా ధరించి, మీ ఆజ్ఞను చెల్లించుకుంటను అని వినయశీలి అయ్యి అడిగాడు. సమర్థ రామదాసు గారు అతడి యొక్క వినయ, విధేయతలను చూసి ఆనందమయుడయ్యాడు. అలా సమర్థ రామదాసు శివాజీకి మహారాష్ట్ర భూముల భవితవ్యం గురించి , స్వరాజ్య స్థాపన కోసం చేయాల్సిన పనులను చెప్పాడు. అందులో బాగంగా ముందుగా కళ్యాణమూర్తివి కావాలి అని, ఆ తర్వాతే సింహాసనాన్ని అధిష్టించగలవని , ఆ కళ్యాణానికి సంబంధించిన కార్యక్రమాలు, ముహూర్తం ఖరారు చేస్తానన్నాడు. శివాజీ సామ్రాజ్య నిర్మాణం యజ్ఞంలో స్వసుఖాలను తొలి సమిదగా ఆహుతి చేశాడు. యువసేన ఒక సాధారణ స్థాయి నుంచి బలమైన సైన్యంగా అవతరించింది. డిల్లీని పాలిస్తున్న అలాంఘీర్ పాదుషా వారి ఆధీనంలో ఉన్న రాజ్ ఘడ్, బీజాపూర్ సుల్తానుల పాలన కింద ఉన్న పన్హాలా కోటల మీద ముందుగా దాడి చేయుటకై నిర్ణయమైనది. శివాజీకి దేశ నలుమూలల నుంచి మద్దతు ఇవ్వటానికి వస్తున్న సామంతులు, సర్దారులతో కాలం గడుస్తుంది. ఈ వార్తలు అలాంఘీర్ పాదుషా, బీజాపూర్ సుల్తానులకు అందాయి. వారు శివాజీని హతమార్చుటకై పనిచేయసాగారు. సర్దారుల, సామంతుల సహకారంతో పన్హాలా కోట ముట్టడి జరిగింది, విజయవంతంగా. ఈ విజయ అనంతరం సమర్థ రామదాసు గారు ఒక శుభ ముహూర్తాన పన్హాలా కోటకు వచ్చారు. తన వెంట తెచ్చిన దనరాశులను, సైన్యాన్ని యువసేనకు ఇవ్వబడినాయి. శివాజీ సమర్థ రామదాసు గారి ఆశీర్వాదం తీసుకొని, అతడి యొక్క సలహా సూచనలు స్వీకరించాడు. ఎంతో పటిష్టమైన సైన్యంతో ఉన్న ఈ యువసేన ఇక రాజ్ ఘడ్ కోటను లక్ష్యంగా చేసుకోవాలని, అంతకుముందే కళ్యాణ మూర్తివి అవ్వాలని అన్నాడు. శివాజీ చూస్తుండగానే "తారబాయి, చందాబాయి లను వివాహమాడాడు. సమర్థ రామదాసు గారే దగ్గరుండి వివాహం జరిపించాడు.

**ఆ తర్వాత సైన్య పటిష్టత గూర్చి,**

రాజ్ ఘడ్ కోట ముట్టడి కి ముహూర్తం నిర్ణయించటం జరిగింది . మరాఠా భూముల్ని కబళించటానికి చూస్తున్న డిల్లీ అలంగీర్ పాదుషా, బీజాపూర్ సుల్తానులు, గోల్కొండ తానీషా లను తిప్పికొట్టేందుకు పథకాలు రచించి, రాజకీయ విజ్ఞానం తో ముందుగా గోల్కొండ తానీషాల పైకి వెళ్ళి , వారిని బయటపెట్టేందుకు దోపిడీలు చేయసాగారు.అలా చేస్తూ గోల్కొండ ప్రభువుతో సంధి చేసుకొని, అతడి పరాక్రమంతో దక్షిణాది ప్రాంతంలో సగ బాగం వరకు వశం చేసుకున్నాడు. రాయ్ ఘడ్ కోటను ముట్టడి చేసి, 1674 లో రాయఘడ్ కోటలో అధికారికంగా పట్టాభిషేకం చేశాడు, ఆ సందర్భంలోనే "ఛత్రపతి " అనే బిరుదును పొందాడు.సువిశాలమైన మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించి, మహారాష్ట్రుల ఆశాకిరణమై నిలిచాడు. స్వతంత్ర కేతనం ఎగరవేసిన మహా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్

**మరణం:** కొన్నాళ్ళకు 50,000 బలగంతో దక్షిణ రాష్ట్రాల దండయాత్రచేసి వెల్లూరు, గింగీలను సొంతం చేసుకున్నాడు. 27 ఏళ్ళపాటు యుద్ధాలలో గడిపి హిందూ రాజులకు ఆదర్శంగా నిలిచి సువిశాల మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పిన ఛత్రపతి శివాజీ మూడు వారాలు తీవ్ర జ్వరంతో బాధపడి ఏప్రిల్ 3, 1680 న రాయఘడ్ కోటలో మరణించాడు. భారత దేశ చరిత్రలో ఇతడి చరిత్ర ఒక సువర్ణ అధ్యాయం. అఖండ భారత్ నీ తన వీరత్వంతో ముగ్ధులను చేసుకున్నాడు, సనాతన హైందవ ధర్మ పరిరక్షకుడి గా , స్త్రీ మూర్తుల పట్ల అపారమైన గౌరవం, మాతృభూమి పై తను పెంచుకున్న ప్రేమనే! , నేడు చరిత్ర పై అక్షరాలు మొలిపించాడు. ఈయన నేడు ఎందరికో స్ఫూర్తిదాయకం.

చాపల అనిల్ కుమార్
9542415080

# రూఫ్ గార్డెనింగ్ చేద్దాం బహుళ ప్రయోజనాలు పొందుదాం

పర్యావరణ విధ్వంసం కొనసాగుతోంది. భూమాతను కాలుష్య భూతం చుట్టేస్తున్నది. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమాత ఊపిరులను ఆపేస్తున్నాయి. భూమాతకు ప్రకృతి కట్టిన హరిత చీరలు పలుచబడుతున్నాయి. అడవులు తరిగి పోతున్నాయి. కార్చిచ్చులు కమ్మేస్తున్నాయి. గాలి కాలుష్యం ఊపిరితిత్తులను బాధిస్తోంది. నేలంతా నిస్సారమై ఎడారీకరణకు దారులు పడుతున్నాయి. జల వనరులు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండుతున్నాయి. ఇలాగే నేటి తరం నిర్లక్ష్యం



చేస్తే రేపటి తరాల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని మరిచిపోతున్నాం. మనం చేయవలసిన చిన్న చిన్న పర్యావరణ హిత చర్యలకు శ్రీకారం చుడదాం. మన ఇంటిని కూడా హరిత చీరలతో కప్పేద్దాం. ఇంటి ముందు లేదా ఇంటి వెనక లేదా పైకప్పు (రూఫ్)ను కూడా మొక్కలు నాటి మన గృహాన్ని నందన వనంగా మార్చడానికి కార్యాచరణ మొదలు పెడదాం. ప్రతి ఒక్క గృహ యజమాని విధిగా తన ఇంటి పైకప్పు ప్రాంతంలో మొక్కలు నాటి బహుళ ప్రయోజనాలు పొందాలనే అవగాహన కలిపించడానికి ప్రతి ఏట 06 జూన్ రోజున “ప్రపంచ హరిత పైకప్పు దినం” లేదా “వరల్డ్ గ్రీన్ రూఫ్ డే”ను పాటించుట ఆనవాయితీగా మారింది. 05 జూన్ రోజున ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్న వేళ మరుసటి రోజుననే ప్రపంచ హరిత పైకప్పు దినం రావడం విశేషంగా గుర్తు చేసుకోవాలి. 2026 ప్రపంచ హరిత రూఫ్ దినోత్సవం ఇతివృత్తంగా “ప్రకృతి లేదా నేచర్” అనే అంశాన్ని తీసుకొని పట్టణ ప్రాంతాల్లో హరిత క్షేత్రాలు, జీవ వైవిధ్యం, జీవ వ్యవస్థల పునరుజ్జీవనం గూర్చి ప్రచారం చేయడం జరుగుతోంది. రూఫ్ గార్డెనింగ్‌తో వాతావరణ ప్రతికూల మార్పులను అరికట్టడం, పట్టణాల్లో ఉష్ణోగ్రతలను తగ్గించడం, ఇల్లంతా చల్లదనం ఆవహించడం, పలు రకాల జీవులను ఆవాసాలు ఏర్పడడం, జీవ వైవిధ్యాన్ని కాపాడడం, ఇళ్లు సౌందర్యంగా మారి మానసిక ఉల్లాసం కలగడం, కూరగాయలు లేదా పండ్లు లేదా పూల మొక్కలతో ఆర్థిక వెసులుబాటు కలగడం,కార్బన్ ఉద్గారాల తగ్గడంతో భూతాప అదుపుకు మార్గం సుగమం కావడం, గాలి నాణ్యత పెరగడం, ఎక్కువైన నీటిని తీసుకోవడం, దుమ్ము దూళిని అడ్డుకోవడం, గార్డెనింగ్ పనులతో వ్యక్తిగత ఆరోగ్యం పరిరక్షించ బడడం, కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకోవడం లాంటి పలు ప్రయోజనాలు కలుగుతాయి. ఇప్పటికే తమ ఇంటి పైకప్పుల్లో మొక్కలు నాటిన వారు మరింత శ్రద్ధ తీసుకోవాలని, మొదలు పెట్టని వారు నేడే రూఫ్ గార్డెనింగ్ పనులకు శ్రీకారం చుట్టాలని కోరుకుందాం. మన ఇంటి పైకప్పు లేదా రూఫ్‌ను హరిత చీరలతో కప్పేద్దాం. గృహ నిర్మాణ సమయంలోనే రూఫ్ గార్డెనింగ్‌కు అనుకూలంగా నిర్మాణాలు చేపడదాం. మన ఇంటిని నందనవనంగా మార్చుకుందాం. మన ఇంట్లోనే ఆరోగ్యకర కూరగాయలు/పండ్లు/పూలను పండిద్దాం. ప్రతి రోజు మన ఇంటి పైకప్పులో ఉన్న మొక్కలతో ముచ్చట పెడదాం, మానసిక ఆనందాన్ని పొందుదాం, ఇరుగు పొరుగుకు ఆదర్శంగా నిలుద్దాం .



బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037



# జాతీయం-అంతర్జాతీయం



## పశ్చిమాసియా ఉద్రిక్తతలు
## ప్రధాని మోదీ అత్యవసర భేటీ



పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ కీలక భేటీకి అధ్యక్షత వహించారు. శనివారం పీఎంఆర్థిక సలహా మండలితో సమావేశయ్యారు. యుద్ధం ముగింపుపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో యుద్ధ ప్రభావాన్ని తగ్గించే చర్యలపై చర్చించినట్లు సమాచారం. ఆర్థికవృద్ధిని బలోపేతం చేయడం, బయటి నుంచి వచ్చే ఒడుదొడుకులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచడం, వ్యాపారాలకు మరింత అనువైన వాతావరణాన్ని కల్పించేలా సంస్కరణలు వేగవంతం చేయడం వంటి అంశాలపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది.

## ఢిల్లీలో గర్జించిన కాక్రోచ్ జనతా పార్టీ
## జంతర్ మంతర్ వద్ద ధర్నా



ఢిల్లీ,(ఏ.ఎం.ఎస్): దేశ రాజధాని దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ) నిరసనలు ప్రారంభించింది. నీట్ పేపర్ లీక్, సీబీఎస్ఈ ఓఎస్ఎం వ్యవస్థలో అవకతవకల నేపథ్యంలో ఈ ఆందోళనలను చేపడుతోంది. సీజేపీ వ్యవస్థాకుడు అభిజీత్ దీప్కే ఇచ్చిన పిలుపుమేరకు వేలాదిమంది యువత నిరసన వేదిక వద్దకు తరలివచ్చారు. 'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి', 'మేము మేక్ ఇన్ ఇండియా అడిగితే.. మీరు లీక్ ఇన్ ఇండియా ఇచ్చారు' అని నినాదాలు చేశారు జూన్ 6న జంతర్‌మంతర్ వద్ద నిరసన కార్యక్రమం ఉంటుందని కొన్ని రోజుల క్రితం అభిజీత్పి లుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో పాల్గొనేందుకు అమెరికాలోని బోస్టన్ నుంచి అతడు దిల్లీకి వచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను చేత్తో పట్టుకొని కనిపించారు. ఈ నిరసనలకు అనుమతి ఇచ్చిన దిల్లీ పోలీసులు.. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా వేదిక వద్ద భారీ భద్రత ఏర్పాటుచేశారు. అలాగే మహారాష్ట్రలోని ఛత్రపతి శంబాజీనగర్‌లోని అతడి నివాసం వద్ద భద్రతను మోహరించారు.కాగా.. ఈ నిరసనల్లో భాగంగా అభిజీత్‌ను కానీ, సీజేపీ సభ్యులను కానీ పోలీసులు అరెస్టు చేస్తే.. 42 రోజుల పాటు నిరాహార దీక్ష చేపడతానని సామాజిక ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాను కూడా భాగం అవుతానని వాంగ్‌చుక్ ఇప్పటికే వెల్లడించారు.

## ఎడారిలో ఘోర విషాదం
## పిల్లలతో సహా 49 మంది మృతి



పశ్చిమాఫ్రికాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. సహారా ఎడారిలో తాగేందుకు నీరు దొరక్క దాహంతో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆగిపోవడంతో వీరంతా కొన్ని రోజుల పాటు ఎడారిలో నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. నైజర్ దేశంలో ఈ దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..నైజర్‌కు చెందిన కొంతమంది తమ బంధువులతో పండుగ చేసుకునేకుందుకు పక్కనే ఉన్న మాలి దేశానికి ట్రక్కులో బయల్దేరారు. ఆ వేడుక ముగించుకొని తిరిగివస్తుండగా.. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు అసమాకా అనే సరిహద్దు ప్రాంతానికి 80 కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. అయితే, ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో సాయం చేసేవారు దొరకలేదు. డ్రైవర్‌తో పాటు అందులోని ప్రయాణికులు ట్రక్కును మరమ్మతు చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. దీంతో వారంతా కొన్ని రోజుల పాటు ఎడారిలోనే ఉండాల్సి వచ్చింది. అప్పటికే వారి వద్ద ఉన్న నీటి నిల్వలు నిండుకున్నాయి. ఎడారిలో నీటి జాడ లేకపోవడంతో వారు దాహంతో అల్లాడిపోయారు.చివరకు ఇద్దరు వ్యక్తులు దాదాపు 50 కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లి నీరు తాగి అక్కడినుంచి అసమాకా పట్టణానికి చేరుకున్నారు. అక్కడ అధికారులను కలిసి విషయం చెప్పారు. అప్రమత్తమైన అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా.. హృదయ విదారక దృశ్యాలు కన్పించాయి. ట్రక్కు చుట్టూ డజన్ల కొద్దీ మృతదేహాలు కన్పించాయని అధికారులు తెలిపారు. విపరీతమైన వేడి, ఉక్కపోత, నీరు లేక 49 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు.

అయితే, ట్రక్కు ఆగిపోవడానికి కారణమేంటీ, వీరు ఎడారిలో ఎన్ని రోజులు చిక్కుకుపోయారన్న దానిపై స్పష్టత లేదు. సాధారణంగా ఈ ఎడారి జోన్ మీదుగా పౌరులు రాకపోకలు సాగించడం చాలా అరుదని స్థానిక అధికారులు వెల్లడించారు. ఎక్కువ ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు వలసవెళ్లేవారు ఈ మార్గాన్ని ఆశ్రయిస్తారని తెలిపారు. గతంలోనూ అనేక మంది ఇసుక వేడి, దాహం, ఆకలితో ఈ మార్గంలో ప్రాణాలు విడిచినట్లు గుర్తుచేసుకున్నారు.

## ఆస్తుల పేరిట క్యూబాపై 'అమెరికా' పంజా
### ఆరు దశాబ్దాలు ఆంక్షలతో నష్టపర్చిన వాషింగ్టన్ ఇప్పుడు మరోసారి బిలియన్ డాలర్ల డిమాండ్

**హవానా, వాషింగ్టన్ :**
క్యూబా విప్లవం తర్వాత జాతీయీకరించిన ఆస్తులపై క్యూబాఅమెరికా మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. అమెరికా పౌరులు, కంపెనీలు తమకు చెందిన ఆస్తులను క్యూబా ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని పేర్కొంటూ ప్రస్తుతం 9 బిలియన్ డాలర్లకు పైగా పరిహారం డిమాండ్ చేస్తున్నాయి. అయితే, క్యూబాపై 70 ఏండ్లుగా కొనసాగుతున్న ఆర్థిక దిగ్బంధనమే ద్వీప దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసిందని క్యూబా వర్గాలు వాదిస్తున్నాయి.

**ట్రంప్ ప్రభుత్వ వైఖరి**
అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. క్యూబాపై కఠిన వైఖరిని కొనసాగిస్తున్నారు. అమెరికా విదేశాంగ శాఖలో కూడా క్యూబన్‌అమెరికన్ వర్గాలకు చెందిన ప్రముఖులు కీలక స్థానాల్లో ఉండటంతో క్యూబాపై ఒత్తిడి మరింత పెంచొచ్చని శక్తివంతమైన వర్గాలు భావిస్తున్నట్టు అంతర్జాతీయ విశ్లేషకులు చెప్తున్నారు. అమెరికా సుప్రీంకోర్టు ఇటీవల క్యూబా ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఆస్తులకు సంబంధించిన ఒక కేసు విచారణకు అనుమతించడం కూడా ఇదే దిశగా మరో అడుగుగా భావిస్తున్నారు.'ఆస్తుల కంటే రాజకీయ లక్ష్యాలే ఎక్కువ'

కొంత మంది నిపుణుల ప్రకారం.. ఈ డిమాండ్లు కేవలం ఆస్తుల పునరుద్ధరణ కోసమే కావనీ, విప్లవానికి ముందు ఉన్న సామాజిక, ఆర్థిక వ్యవస్థను తీసుకురావాలనే కోరిక కూడా కనిపిస్తోందని చెప్తున్నారు. విప్లవానికి ముందు భూస్వామ్య వర్గాలు, వ్యాపార కుటుంబాలు క్యూబా దేశ ఆర్థిక వ్యవస్థపై అపారమైన ఆధిపత్యం కలిగి ఉండేవి. దీంతో ఇప్పుడు అదే స్థితిని పునరుద్ధరించాలన్న ఆకాంక్ష ఈ ఉద్యమం వెనుక ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు చెప్తున్నారు.}భారీ నష్టపరిహారం చెల్లించాలంటున్న క్యూబాఅమెరికా.. ఆస్తులపై పరిహారం కోరుతున్నట్టే.. క్యూబా కూడా అమెరికాపై భారీ నష్టపరిహారం డిమాండ్ చేస్తోంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆర్థిక దిగ్బంధనం వల్ల సుమారు 170 బిలియన్ డాలర్లకు పైగా నష్టం వాటిల్లిందని క్యూబా ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేస్తోంది. అలాగే అమెరికా మద్దతుతో కొనసాగుతున్న క్యూబా వ్యతిరేక కార్యకలాపాలు, ఉగ్రదాడుల వల్ల కూడా తీవ్ర నష్టం జరిగిందని క్యూబా వాదిస్తోంది.



**అమెరికా ఆంక్షల ఆరంభం**
క్యూబాలోని అమెరికా కంపెనీలకు చెందిన చమురు శుద్ధి కర్మాగారాలు, చక్కెర మిల్లులు, బ్యాంకులను జాతీయీకరించిన తర్వాత వాషింగ్టన్ తీవ్రంగా స్పందించింది. అప్పటి అమెరికా అధ్యక్షుడు డ్వైట్ డి. ఐసన్‌హావర్ క్యూబాపై వాణిజ్య ఆంక్షలు విధించారు. అప్పటి నుంచి దాదాపు 70 ఏండ్లుగా వివిధ రూపాల్లో అమెరికా ఆర్థిక దిగ్బంధనం కొనసాగుతోంది. అయితే ఈ ఆంక్షల వల్ల దేశానికి వందల బిలియన్ డాలర్ల నష్టం జరిగిందని అంతర్జాతీయ విశ్లేషకులు చెప్తున్నారు.

విప్లవం తర్వాత జాతీయీకరణ
1959లో ఫిడెల్ క్యాస్ట్రో నేతృత్వంలోని విప్లవం తర్వాత క్యూబాలో భూసంస్కరణలు చేపట్టారు. అప్పటి వరకు కొద్ది మంది భూస్వాములు, విదేశీ కంపెనీల చేతుల్లో కేంద్రీకృతమైన భూములు, పరిశ్రమలను ప్రభుత్వం జాతీయీకరించింది. చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం.. అప్పటి క్యూబాలో గ్రామీణ పేదరికం తీవ్రంగా ఉండేది. భూమి యాజమాన్యం కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతమై ఉండటంతో భూసంస్కరణలు సామాజిక అవసరంగా మారాయి.తొమ్మిది బిలియన్ డాలర్ల వివాదంఅమెరికా లెక్కల ప్రకారం.. క్యూబాలో జాతీయీకరించిన ఆస్తులకు సంబంధించి దాదాపు 6,000 క్లెయిమ్‌లు నమోదయ్యాయి. అప్పట్లో వాటి విలువ 1.9 బిలియన్ డాలర్లు కాగా.. వడ్డీతో కలిపి ప్రస్తుతం తొమ్మిది బిలియన్ డాలర్లకు పైగా చేరుకుంది. దీంతో అమెరికాలోని కొన్ని శక్తివంతమైన వర్గాలు ఈ అంశాన్ని మళ్లీ ముందుకు తెస్తున్నాయి.ఆర్థికంగా పరిహారం అసాధ్యమేప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో క్యూబా తొమ్మిది బిలియన్ డాలర్ల పరిహారం చెల్లించడం వాస్తవానికి అసాధ్యమేనని ఆర్థిక నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశం నుంచి ఇంత భారం ఆశించడం ఆచరణ సాధ్యం, సబబు కాదని వారు చెప్తున్నారు. క్యూబా విప్లవం తర్వాత జాతీయీకరించిన ఆస్తుల వివాదం కేవలం ఆస్తుల సమస్య మాత్రమే కాదనీ, అది చరిత్ర, రాజకీయాలు, ఆర్థిక ఆంక్షలు, సార్వభౌమాధికారానికి సంబంధించిన సంక్లిష్ట అంశమని పరిశీలకులు చెప్తున్నారు. అమెరికా ఆస్తులపై పరిహారం కోరుతుండగా, క్యూబా మాత్రం దశాబ్దాల ఆంక్షల వల్ల జరిగిన నష్టానికి జవాబు కోరుతోంది.

ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య వివాదం త్వరలో ముగిసే అవకాశాలు కనిపించడంలేదని విశ్లేషకులు అంటున్నారు.



### ఇరాన్ రాడార్ కేంద్రాలపై
## అమెరికా దాడి

అమెరికా ఇరాన్ మధ్య మరోసారి ఘర్షణలు చోటుచేసుకున్నాయి. చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలో ఇరాన్ డ్రోన్‌లు ప్రయోగించింది. దీనిపై ఆగ్రహం వ్యక్తంచేసిన అగ్రరాజ్యం.. ఇరాన్‌కు చెందిన తీరప్రాంత నిఘా రాడార్ కేంద్రాలే లక్ష్యంగా దాడులు నిర్వహించింది.

హర్మూజ్ లో నౌకల రవాణాకు ఇరాన్ డ్రోన్ దాడులు ముప్పుగా మారాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. అందుకే తక్షణమే స్పందించాల్సి వచ్చిందని తెలిపింది. టెహ్రాన్‌కు చెందిన నాలుగు డ్రోన్‌లను కూల్చివేశామని వెల్లడించింది. దీని తర్వాత గోరుఖ్, ఖేష్మ్ ద్వీపంలోని ఇరాన్ రాడార్ కేంద్రాలను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. మరిన్ని దాడుల నుంచి రక్షించుకోవడానికే ఈ చర్యలు చేపట్టినట్లు సెంటకామ్ తెలిపింది. ఇరాన్ దురాక్రమణల నుంచి రక్షించుకునేందుకు తమ ప్రతిస్పందనలు కొనసాగుతాయని స్పష్టంచేసింది. ఈ సంఘర్షణను ముగించేందుకు ఇరుదేశాల మధ్య చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. దాడులు మాత్రం ఆగడం లేదు.

కువైట్‌లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ క్షిపణులు, డ్రోన్‌లతో విరుచుకుపడింది. తమ గగనతలం పైకి దూసుకొచ్చే క్షిపణులు, డ్రోన్‌లను వైమానిక రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని కువైట్ తెలిపింది. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఆపై బహ్రెయిన్‌లో కూడా సైరన్‌లు మోగడంతో బలగాలు అప్రమత్తమయ్యాయి.

## ఆంక్షల వలయంలో కయూబా అధ్యక్షుడు

- **హవానాపై మరింత**
- **ఒత్తిడి పెంచిన ట్రంప్**
- **క్యూబా సైన్య మంత్రిత్వ శాఖ**
- **సహా ఐదు సంస్థలు, నలుగురు వ్యక్తులు కూడా**



**వాషింగ్టన్, హవానా :**
క్యూబాపై ఒత్తిడి పెంచే చర్యల్లో భాగంగా అమెరికా.. క్యూబా అధ్యక్షుడు మిగ్యుల్ డియాజ్‌కానెల్‌పై ఆర్థిక ఆంక్షలు విధించింది. ఆయనతో పాటు మరో నలుగురు వ్యక్తులు, ఐదు సంస్థలను కూడా ఆంక్షల జాబితాలో చేర్చింది. ఈ చర్యతో హవానాపై వాషింగ్టన్ ఒత్తిడి మరింత తీవ్రతరమైందని పరిశీలకులు చెప్తున్నారు.

అధ్యక్షుడితో పాటు కీలక సంస్థలపై చర్యలు అమెరికా ట్రెజరీ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం... అధ్యక్షుడు డియాజ్‌కానెల్‌తో పాటు మరికొందరు క్యూబా అధికారులు, సంస్థలపై ఆంక్షలు విధించారు. ఆంక్షలకు గురైన సంస్థల్లో క్యూబా విప్లవ సాయుధ దళాల మంత్రిత్వ శాఖ కూడా ఉంది. 66 ఏండ్ల డియాజ్‌కానెల్ 2018లో అధికారంలోకి వచ్చారు. ఆయన క్యూబా మాజీ అధ్యక్షుడు రౌల్ క్యాస్ట్రో నుంచి బాధ్యతలు స్వీకరించారు. కాగా క్యూబా కమ్యూనిస్టు నాయకత్వంపై ఒత్తిడి పెంచేందుకు అమెరికా చేపడుతున్న చర్యల్లో భాగంగానే తాజా ఆంక్షలను విశ్లేషకులు చూస్తున్నారు.

ఆంక్షల ప్రకటన సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ... 'క్యూబా ఒక సరైన దేశంగా ఉండాలని అమెరికా కోరుకుంటోంది' అని వ్యాఖ్యానించారు. అయితే ట్రంప్ మాటల వెనుకు ఆంతర్యం వేరననీ, క్యూబాను తన చేతుల్లోకి తెచ్చుకోవాలని ఆయన ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని విశ్లేషకులు చెప్తున్నారు. గతనెలలో కూడా అమెరికా ప్రభుత్వం క్యూబాకు చెందిన 11 మంది అధికారులపై ఆంక్షలు విధించింది. వీరిలో కమ్యూనికేషన్స్ మంత్రి, పలువురు సైనికాధికారులు, క్యూబా ప్రధాన నిఘా సంస్థకు చెందిన అధికారులు ఉన్నారు. ఇటీవల అమెరికా ప్రభుత్వం రౌల్‌క్యాస్ట్రోపై హత్యా ఆరోపణలు కూడా మోపింది. 1996లో క్యూబన్ యుద్ధ విమానాలు, అమెరికాలోని క్యూబన్ ప్రవాసుల బృందం నిర్వహిస్తున్న విమానాలను కూల్చివేసిన ఘటనలో ఆయన ప్రమేయం ఉందని ఆరోపించింది.

## ఏఐతో టీకా అభివృద్ధి



**పలు వైరస్‌లను అడ్డుకొనేలా తయారీ**
**ప్రపంచంలోనే తొలిసారిగా యూకేలో**

**లండన్:**
యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్‌లోని ఒక బృందం ప్రపంచంలోనే తొలిసారిగా పూర్తిగా ఏఐను ఉపయోగించి టీకాను అభివృద్ధి చేసింది. ఈ టీకాను మనుషులపై ప్రయోగించినట్టు వెల్లడించింది. ఈ టీకాను అన్ని రకాల కరోనా వైరస్‌లు, మహమ్మారులు, జంతువులకు సోకే వైరస్‌లు, భవిష్యత్తులో మరో మహమ్మారిని సృష్టించే సామర్థ్యం ఉన్న వైరస్‌లను నిరోధించేందుకు ఉపయోగించవచ్చని ఆ బృందం తెలిపింది..

ఈ టీకాను అన్ని రకాల కరోనా వైరస్‌లు, మహమ్మారులు, జంతువులకు సోకే వైరస్‌లు, భవిష్యత్తులో మరో మహమ్మారిని సృష్టించే సామర్థ్యం ఉన్న వైరస్‌లను నిరోధించేందుకు ఉపయోగించవచ్చని ఆ బృందం తెలిపింది. అయితే ఈ వ్యాక్సిన్ ఇంకా ప్రారంభ దశలోనే ఉందని. అవి ఫ్లూ, ఎబోలాను నిరోధించవచ్చని వెల్లడించింది. కరోనా వైరస్‌ల నుంచి సేకరించిన జన్యు సంకేతాలను విశ్లేషించి ఈ కొత్త టీకాను తయారు చేశారు. వైరస్‌ల కుటుంబం రూపాంతరం చెందినా వాటి నుంచి రక్షణ లభించేలా సూపర్‌యాంటీజెన్ లాగా రూపొందించారు.

## యూరప్‌కు అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వెన్స్ ఘాటు హెచ్చరిక!



యూరప్ దేశాల్లోకి అడ్డగోలు వలసల వల్లే పాశ్చాత్య నాగరికత నాశనం అమెరికా ఉపాధ్యక్షుడి సంచలన వ్యాఖ్యలు అంతర్జాతీయ వేదికపై అమెరికా , బ్రిటన్ ) దేశాల మధ్య ఊహించని విధంగా తీవ్ర దౌత్యపరమైన, రాజకీయ ఉద్రిక్తత చోటుచేసుకుంది. బ్రిటన్‌లో శ్వేతజాతీయుడైన ఓ విద్యార్థి హత్యోదంతాన్ని ప్రస్తావిస్తూ.. అమెరికా ఉపాధ్యక్షుడు ) జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా సంచలనం రేపుతున్నాయి. యూరప్ దేశాల్లోకి అడ్డగోలు వలసల వల్లే పాశ్చాత్య నాగరికత నాశనం : అమెరికా ఉపాధ్యక్షుడి సంచలన వ్యాఖ్యలు అంతర్జాతీయ వేదికపై అమెరికా , బ్రిటన్ దేశాల మధ్య ఊహించని విధంగా తీవ్ర దౌత్యపరమైన, రాజకీయ ఉద్రిక్తత చోటుచేసుకుంది. బ్రిటన్‌లో శ్వేతజాతీయుడైన ఓ విద్యార్థి హత్యోదంతాన్ని ప్రస్తావిస్తూ.. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా సంచలనం రేపుతున్నాయి. యూరప్ దేశాల్లోకి అడ్డగోలుగా వస్తున్న భారీ వలసలవల్లే అక్కడి నాగరికత క్షీణిస్తోందని, ఇదొక 'వలసదారుల దండయాత్ర' అని వాన్స్ తీవ్ర విమర్శలు గుప్పించారు.గత ఏడాది డిసెంబర్‌లో బ్రిటన్‌లోని సౌతాంప్టన్ నగరంలో 18 ఏళ్ల హెన్రీ నోవాక్ అనే శ్వేతజాతీయుడైన విద్యార్థిపై భారత సంతతికి చెందిన విక్రమ్ దిగ్వా అనే సిక్కు యువకుడు కత్తితో దాడిచేశాడు. దారుణంగా పొడిచి హత్య చేశాడు. అయితే నిందితుడు విక్రమ్ తానే బాధితుడినని, హెన్రీ తనపై జాత్యహంకార వ్యాఖ్యలు చేశాడని పోలీసులకు అబద్ధం చెప్పాడు. దాంతో తీవ్ర గాయాలతో పడి ఉన్న హెన్రీ నోవాక్‌ను పోలీసులు చనిపోయే ముందు బేడీలు వేసి ఉంచారు. ఈ ఘటన బ్రిటన్‌లో తీవ్ర హింసాత్మక అల్లర్లకు దారితీయడమే కాకుండా, అంతర్జాతీయంగా రైట్ వింగ్ నేతల ఆగ్రహానికి కారణమైంది.ఈ ఉదంతంపై జేడీ వాన్స్ స్పందిస్తూ.. 'ఒక నాగరికత ఎలా అంతరిస్తుందో హెన్రీ నోవాక్ కూడా అలాగే చనిపోయాడు. అధికారులు అతడిని పట్టించుకోకుండా, చేయని ద్వేషపూరిత నేరాలకు బాధ్యుడిని చేస్తూ బేడీలు వేశారు' అని వ్యాఖ్యానించారు. గత కొన్ని తరాలుగా ఐరోపా పాలకులు తీసుకుంటున్న ఆత్మద్రోహ నిర్ణయాలు, పశ్చిమదేశాలను ద్వేషించే వలసదారుల దండయాత్రవల్లే ఈ పరిస్థితి వచ్చిందని, పాలకుల వైఖరిపై ప్రజల్లో 'న్యాయబద్ధమైన ఆగ్రహం' రావాలని ఆయన పిలుపునిచ్చారు.జేడీ వాన్స్‌కు అత్యంత ఆప్తమిత్రుడైన స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ కూడా ఈ ఘటనపై, బ్రిటన్ పోలీసుల తీరుపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వరుస పోస్టులు పెడుతున్నారు. దీనికి తోడు గురువారం అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ కూడా బ్రిటన్‌లోని పోలీస్ వ్యవస్థను తప్పుబడుతూ నివేదిక ఇవ్వడం వివాదాన్ని మరింత పెద్దది చేసింది. ఇప్పుడు అమెరికా ఉపాధ్యక్షుడు నేరుగా తమ దేశ అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడంపై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కార్యాలయం తీవ్రంగా స్పందించింది.'మా ప్రజాస్వామ్యంలో జోక్యం చేసుకునేందుకు, మా వీధుల్లో విభజనలు సృష్టించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు' అని బ్రిటన్ ప్రధాని కార్యాలయం మండిపడింది. ఎలాన్ మస్క్ కూడా బ్రిటన్‌లో ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రధాని స్టార్మర్ నేరుగా ఆరోపించారు. ఈ దారుణ హత్యను దేశంలో ద్వేషాన్ని, ఉద్రిక్తతలను పెంచడానికి వాడుకోవద్దని మృతుడు హెన్రీ నోవాక్ కుటుంబసభ్యులు కోరినట్లు బ్రిటన్ ప్రభుత్వం స్పష్టంచేసింది.



# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## సర్ సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ జిల్లా జూన్ 06 (వుదయం ప్రతినిధి) :**
వరంగల్ జిల్లాలో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ (సర్) సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం రోజు నా దుగ్గండి మండలం లో పరిశీలించారు. సర్వే నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటికి చేరుకొని అర్హుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ సత్య శారద ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సూచించారు. సర్వే పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఈ ఎస్ ఐ ఆర్ పరిశీలనలో జెడ్పిసిఈఓ రామ్ రెడ్డి, దుగ్గొండి ఎమ్మార్వో సమ్మక్క , బి ఎల్ వోలు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 8న ఆటో బంద్‌కు ప్రజలు సహకరించాలి

- **నల్గొండ పట్టణ ఆటో జేఏసీ**

**నల్గొండ జూన్ 06 (వుదయం ప్రతినిధి) :**
పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో శుక్రవారం నల్గొండ పట్టణ ఆటో జేఏసీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్ 8న నిర్వహించనున్న ఆటో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఓలా, రాపిడో వంటి సేవల ప్రభావం, అలాగే డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఆటో సర్వీస్ ఛార్జీని రూ.30గా నిర్ణయించినట్లు నాయకులు తెలిపారు.ప్రజలు ఆటో కార్మికుల సమస్యలను అర్థం చేసుకుని జూన్ 8న నిర్వహించే బంద్‌కు మద్దతు ఇవ్వడంతో పాటు కొత్త సర్వీస్ ఛార్జీ అమలుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో రైల్వే స్టేషన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు యాదయ్య, రాము, బస్టాండ్ అధ్యక్షుడు దశరథ్, సల్మాన్, వెంకటేశ్వర్లు, డీవీకే రోడ్ యాదయ్య
, క్లాక్‌టవర్ సెంటర్ ఈదుల వెంకన్న, చోటు, బైరు సత్తయ్య, కలగొని యాదగిరి, పానగల్ నాయకులు రోశయ్య, మహేష్, చౌరస్తా అడ్డా అధ్యక్షుడు బాబా మతి, కాజా సయ్యద్ నబీ తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంల గోదామును అకస్మాత్తుగా తనిఖీ



**హనుమకొండ, జూన్ 06 (వుదయం జిల్లా ప్రతినిధి) :**
హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్ భవనం వెనుక ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు (ఈవీఎంలు), వివిప్యాట్‌లు భద్రపరిచిన గోదామును జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి శనివారం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు.భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఈ పరిశీలన చేపట్టారు. గోదాములో పటిష్ట భద్రత నడుమ భద్రపరిచిన ఈవీఎంలు, వివిప్యాట్‌లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామగ్రి నిల్వ ఉంచిన గదులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు.భద్రతా చర్యల్లో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, గోదాం భద్రతా వ్యవస్థలను సమీక్షించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి సంతకాలు చేశారు.
ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి,గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇ.వి. శ్రీనివాసరావు,
రావు అమరేందర్ రెడ్డి, కుసుమ శ్యాంసుందర్, నాగబెల్లి రజనీకాంత్, సయ్యద్ ఫైజుల్లా, మణి, లక్ష్మణ్, ఎం.డి. నేహాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, వుదయం బ్యూరో జూన్ 6:**
త్రైమాసిక తనిఖీల్లో భాగంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ముందుగా ఈవిఎం గోడౌన్ సీల్ ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్ళి ఈ.వి.ఎం., వి.వి.ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేసి మాట్లాడుతూ, ఈవిఎంల భద్రత ముఖ్యమైనదని, సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, రాజకీయ పార్టీ ప్రతినిధులు
ఆమ్ ఆద్మీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ, బిఆర్ఎస్, బీజేపి, సిపిఐ(ఎం), ఐ.ఎన్.సి., తెలుగు దేశం పార్టీ ప్రతినిధులు ఎస్. సుబ్బారావు, వి. రామయ్య, ఎల్.సతీష్ బాబు, వి.రాజేష్, ఎన్.వీరబాబు, ఏ.గోపాల్, పాలడుగు టి.ఆర్. కృష్ణ ప్రసాద్, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

## ఎంపీ బలరాం నాయక్ పుట్టినరోజు వేడుకలు



**మహబూబాబాద్ జిల్లా/గూడూర్ జూన్ 6 (వుదయం ప్రతినిధి):**
గూడూరు మండల కేంద్రంలోని ఏపూరి రవీందర్ రెడ్డి నివాసములో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి మరియు మాజీ ఎంపీపీ నూనవత్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో ఎంపీ బలరాం నాయక్ జన్మదిన వేడుకలను సనాతన శివాలయంలో అర్చన చేయించి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సనాతన శివాలయ చైర్మన్ ఏపూరి రవీందర్ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి మాజీ ఎంపీపీ నోనావత్ రమేష్ నాయక్ జిల్లా నాయకులు మాధవ పెద్ది అమరేందర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ మహిళ నాయకురాలు అయిలబోయిన సమ్మక్క బ్లాక్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ పెసరి శివ వెంగంపేట సర్పంచ్ జవహర్ భూపతిపేట సర్పంచ్ హేమా నాయక్ ఉపసర్పంచ్ కట్ల భవాని విష్ణు మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు కన్నబోయిన వెంకన్న మాజీ వార్డ్ సభ్యుడు హెచ్ శివ దోమ ఉపేందర్ కందికట్ల బిక్షపతి సొసైటీ డైరెక్టర్ కత్తి కృష్ణ బద్రీనాథ్ నోనావత్ శ్రీను గొడుగు మునేష్ దోమ శ్రీను కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు తండా యాకాంబరం మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి మత్తు వద్దు.. ఉజ్వల భవిష్యత్తు ముద్దు



**గంజాయి మత్తులో యువత భవితను చిత్తు చేసుకోవద్దు**
**గంజాయి మత్తులో తూలుతున్న యువతరం: తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలి.**
**గంజాయి రహిత సమాజమే లక్ష్యం కావాలి.**
**గంజాయి భూతానికి దూరంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక. రూరల్ ఎస్సై గోపాల్ రెడ్డి**

**కోదాడ జూన్6 (వుదయం)**
యువత గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల బారిన పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోదాడ రూరల్ ఎస్సై గోపాల్ రెడ్డి సూచించారు.మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యంతో పాటు కుటుంబ, సామాజిక, ఆర్థిక జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు.గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువత చదువు, ఉపాధి అవకాశాలను కోల్పోయి నేరాల బాట పట్టే ప్రమాదం ఉందని హెచ్చరించారు. యువత తమ లక్ష్యాలపై దృష్టి సారించి క్రీడలు, విద్య, నైపుణ్యాభివృద్ధికార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగంపై పోలీస్ శాఖ కఠినచర్యలుతీసుకుంటోందని, ఎవరైనా గంజాయి లేదా డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

## కాళేశ్వరంలో జర్నలిస్టుల సమావేశం

- **టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్**




**జయశంకర్ భూపాలపల్లి జూన్ 06(వుదయం జిల్లా ప్రతినిధి)**
జర్నలిస్టుల వృత్తి భద్రత, సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు జిల్లాలోని పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలనే లక్ష్యంతో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9న కాళేశ్వరంలో జిల్లా స్థాయి జర్నలిస్టుల సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్, రాష్ట్ర హెల్త్ కమిటీ మెంబర్ సామల శ్రీనివాస్ శనివారం తెలిపారు.మంగళవారం ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ మహాసభకు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేణుమాధవ్, కంకనాల సంతోష్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.ఈ సందర్భంగా జర్నలిస్టుల అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, గృహ స్థలాల కేటాయింపు, పెన్షన్, బీమా సదుపాయాలు, సంక్షేమ పథకాలు, వృత్తిపరమైన సమస్యలు, మీడియా రంగంలో నెలకొంటున్న సవాళ్లు, డిజిటల్ మీడియా యుగంలో జర్నలిస్టుల బాధ్యతలు వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై తీర్మానాలు ఆమోదించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.జిల్లా వ్యాప్తంగా పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఒకే వేదికపై చర్చించి వాటి పరిష్కారానికి సమిష్టి పోరాట కార్యాచరణ రూపొందించడంతో పాటు సంఘ బలోపేతం, సభ్యత్వ నమోదు, జర్నలిస్టుల ఐక్యత, వృత్తి గౌరవ పరిరక్షణ, యువ జర్నలిస్టులకు ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధన, వృత్తి పరిరక్షణ దిశగా కీలక మైలురాయిగా నిలవనున్న ఈ మహాసభకు జిల్లాలోని జర్నలిస్టులందరూ పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలు, అభిప్రాయాలు, సూచనలు వెల్లడించి సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ప్లాస్టిక్ నిర్మూలనలో 'సూర్యాపేట' ముందంజ

**: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




**సూర్యాపేట జూన్: 06 (వుదయం ప్రతినిధి)**
ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనలో సూర్యాపేట మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో విశేష గౌరవాన్ని దక్కించుకుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో జిల్లా ఎస్పీ నరసింహ, మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మదితో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రగతి, పారిశుధ్యం, ఓటరు నమోదు తదితర అంశాలపై ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. సూర్యాపేటను ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా మార్చేందుకు వినూత్న ప్రయోగాలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పట్టణంలో సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాల నుండి ఇటుకలను తయారు చేస్తూ, దీనిని నిరంతరం కొనసాగే ఒక స్థిరమైన వ్యవస్థగా మార్చడం శుభపరిణామమని కొనియాడారు.బయో మెడికల్ వ్యర్థాలను ప్రత్యేకంగా విభజించాలనే రూల్స్ వచ్చాయి.ఈ నియమాలను పక్కాగా అమలు చేయడంలో సూర్యాపేట మున్సిపాలిటీ రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉందని, భవిష్యత్తులో పారిశుధ్య విభాగంలో మరిన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు సాధిస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.వార్డుల్లోని ప్రతి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ ప్రజలకు హామీ ఇచ్చారు. పట్టణంలో ఇబ్బందిగా మారిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) సమస్యపై ఆయన తీవ్రంగా స్పందించారు. సంబంధిత ఏజెన్సీ అధికారులను పిలిపించి, పనులు త్వరగా పూర్తి చేయాలని, లేదంటే కఠిన చర్యలు ఉంటాయని స్ట్రాంగ్ వార్నింగ్.ఇచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "99 రోజుల ప్రజాపాలన ప్రగతి నివేదిక" కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు అత్యంత ఆవశ్యకమైన విద్య, వైద్యం, శాంతి భద్రతల పరిరక్షణ, మహిళా అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను అధికారులు నేరుగా గ్రామాలు, మండలాలు,మున్సిపాలిటీల్లోని ప్రజల వద్దకే తీసుకెళ్తున్నారని చెప్పారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకెళ్లేందుకు యంత్రాంగం శ్రమిస్తోందని పేర్కొన్నారు.కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ప్రస్తుతం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోందని, ప్రజలందరూ ఈ స్పెషల్ రివిజన్‌కు పూర్తి స్థాయిలో సహకరించి తమ పేర్లను నమోదు లేదా సవరణలు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.మహిళల భద్రతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు.. 'డయల్ 100'కు పిలిస్తే ఇంటికే పోలీస్: జిల్లా ఎస్పీ నరసింహరాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎక్కడైనా మహిళల రక్షణకు ఇబ్బందులు ఎదురైతే పోలీస్ శాఖ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ స్పష్టం చేశారు. మహిళల వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వరుసగా నేరాలకు పాల్పడితే అలాంటి వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేసి ప్రత్యేక నిఘా ఉంచుతామని ఆయన హెచ్చరించారు.ప్రస్తుత సమాజంలో నేరాల సంఖ్య పెరుగుతుండటమే కాకుండా, వాటి స్వరూపం కూడా మారుతోందని ఎస్పీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మహిళలను ప్రత్యక్షంగానే కాకుండా, సోషల్ మీడియా వేదికగా పరోక్షంగా వేధింపులకు గురిచేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి సైబర్ వేధింపుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని, పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనేక సందర్భాల్లో మహిళలు బయటకు వచ్చి చెప్పుకోలేని, పోలీస్ స్టేషన్లకు వెళ్లడానికి సంకోచించే పరిస్థితులు ఉంటాయని ఎస్పీ అన్నారు. ఇలాంటి వారి కోసం ప్రభుత్వం వినూత్న సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చిందని వెల్లడించారు.. మహిళలు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా డయల్ 100లేదా 112నంబర్లకు కాల్ చేయవచ్చన్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులే నేరుగా బాధితుల వద్దకు వచ్చి, అక్కడికక్కడే కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఒకవేళ పోలీసులు సకాలంలో స్పందించక పోతే, బాధితులు నేరుగా తన ఆఫీస్‌కు వచ్చి కలవాలని సూచించారు. సకాలంలో స్పందించని సిబ్బందిపై కూడా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.
సఖి కేంద్రాల్లో వచ్చే ఫిర్యాదులపై డీఎస్పీ పర్యవేక్షణలో, నైపుణ్యం కలిగిన మహిళా కౌన్సిలర్ల ద్వారా భార్యాభర్తలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. కౌన్సిలింగ్ తర్వాత కూడా ప్రవర్తన మార్చుకోని వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ నరసింహ స్పష్టం చేశారు.
కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ షఫీ ఉల్లా, ఏసీపి ప్రసన్నకుమార్, తహసిల్దార్ కృష్ణయ్య, ఫ్లోర్ లీడర్ వేణుగోపాల్ రావు, వార్డ్ కౌన్సిలర్ షేక్ జహీర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి డాక్టర్ అమూల్య, మున్సిపల్ కిరణ్ కుమార్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు

## రెండు రోజుల్లో రుతుపవనాలు, వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- **జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వీడియో కాన్ఫరెన్స్**
- **జూన్ 9న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మహిళా సమాఖ్య బస్సుల ప్రారంభోత్సవం ఏర్పాట్లపై సమీక్షించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ, జూన్ 06 (వుదయం ప్రతినిధి) :**
మరో రెండు రోజుల్లో రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రాన్ని తాకనున్న నేపథ్యంలో, జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లను ఆదేశించారు. శనివారం వరి కొనుగోళ్లు, జూన్ 9న జరిగే మండల మహిళా సమాఖ్య బస్సుల ప్రారంభోత్సవ ఏర్పాట్లు, నీట్ పరీక్ష నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జనగామ సమీకృత కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి ఈ సమీక్షలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు పలు కీలక సూచనలు చేశారు.
వరి కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన వడ్లను వెనువెంటనే లారీల్లో మిల్లులు, గోదాములకు తరలించాలి. రాబోయే రెండు మూడు రోజుల్లో కొనుగోలు ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలి. మహిళా సమాఖ్య బస్సుల ప్రారంభోత్సవం, జూన్ 9న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మండల మహిళా సమాఖ్యల ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమానికి జిల్లాల నుంచి మహిళలను తరలించే ఏర్పాట్లు చేయాలి. అన్ని బస్సులు సాయంత్రం 4 గంటల లోపు పరేడ్ గ్రౌండ్ చేరేలా చూడాలి. మహిళలకు మార్గమధ్యలో భోజనం, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలి. నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలి.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ ఏడీ శ్రీనివాస్, డీసీఓ కరుణ, ఏసీపీ భీం శర్మ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ములుగును ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతాం

**ప్రజా దర్బార్ ద్వారా సమస్యల పరిష్కారం : మంత్రి సీతక్క**
**రూ.18.70 కోట్ల మున్సిపల్, సీఆర్ఆర్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
**వెంకటాపూర్ మండలం బూర్గుపేట ప్రజా దర్బార్‌లో దరఖాస్తుల స్వీకరణ**
**రామచంద్రాపురం పరిధిలో 10 వేల ఎకరాల భూ సమస్య పరిష్కారం.. త్వరలోనే పట్టాల పంపిణీ**



**ములుగు/వెంకటాపూర్, జూన్ 06 (వుదయం ప్రతినిధి) :**
ములుగు పట్టణాన్ని పర్యాటక కేంద్రాలకు దీటుగా, ఆధునిక మౌలిక వసతులతో కూడిన ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. శనివారం రోజున ములుగు పట్టణంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం, పురపాలక శాఖల ఆధ్వర్యంలో రూ.18.70 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి 163 నుండి ఎరుకలవాడ వరకు రూ.6.50 కోట్లు, ఎస్సీ కాలనీ వరకు రూ.5.75 కోట్లతో రోడ్డు విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే తూర్పు ప్రాంతంలో రూ.5.95 కోట్లతో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్లు, మున్సిపాలిటీ నిధులతో రూ.50 లక్షల వ్యయంతో కల్వర్టుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రామప్ప, మేడారం తరహాలోనే గట్టమ్మ జంక్షన్, బస్టాండ్, కలెక్టరేట్ ఎదురు భాగం తదితర కీలక ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. భవిష్యత్ అవసరాల కోసం కలెక్టరేట్, యూనివర్సిటీ, దేవగిరిపట్నం ప్రాంతాలను అనుసంధానిస్తూ 'రింగ్ రోడ్' నిర్మాణ ప్రతిపాదనపై ఉమ్మడి సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ప్రజా దర్బార్‌కు అనూహ్య స్పందన : అనంతరం 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా వెంకటాపూర్ మండలం బూర్గుపేట ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'ప్రజా దర్బార్'లో ఐటిడిఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్లతో కలిసి మంత్రి సీతక్క పాల్గొన్నారు. బూర్గుపేట, లక్ష్మీపురం, చక్రవర్తిపల్లి, అడవి రంగాపూర్, మల్లయ్యపల్లి గ్రామాల ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదల సంక్షేమం, భూ సమస్యల పరిష్కారం, మహిళల ఆర్థిక సాధికారతే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా వెంకటాపూర్ మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నామని, రామచంద్రాపురం ప్రాంతంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సుమారు 10 వేల ఎకరాల భూముల సర్వే పూర్తయిందని, త్వరలోనే రైతులకు పట్టాలు అందిస్తామని వెల్లడించారు. మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, ప్రతి మండల సమాఖ్యకు బస్సులను సమకూర్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రజా దర్బార్‌లో అందిన ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, రేషన్ కార్డుల దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**గిరిజన యువతకు ఉపాధి శిక్షణ : ఐటిడిఏ పీఓ**

ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి (పీఓ) లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ, పాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకే మండల స్థాయి ప్రజా దర్బార్‌లు నిర్వహిస్తున్నామన్నారు. గిరిజన యువతకు ఉపాధి కల్పించేందుకు ఏటూరునాగారం, జాకారం, వరంగల్ యూత్ ట్రైనింగ్ సెంటర్లలో బ్యూటీషియన్, డేటా ఎంట్రీ, స్టిచింగ్ కోర్సుల్లో ఉచిత వసతి, భోజనంతో శిక్షణ ఇస్తున్నామని, అనంతరం ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహిన్, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంపత్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భూభారతి, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**: జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 6 (వుదయం ప్రతినిధి)**
జిల్లాలో భూభారతి, సాదా బైనామా, ఇతర భూసేకరణకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. శుక్రవారం ఐ డి ఓ సి కార్యాలయం కలెక్టర్ ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలసి అశ్వాపురం, మణుగూరు, పినపాక, అశ్వారావుపేట, దమ్మపేట, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి మండలాల తహసీల్దార్లు, ఆర్ఐలు, సర్వేయర్లు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండలాల వారీగా భూభారతి దరఖాస్తులు, సాదా బైనామా కేసులు, భూసేకరణ అంశాల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.భూభారతి, సాదా బైనామా దరఖాస్తుల పరిశీలనలో పూర్తి పారదర్శకత పాటించాలని, అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. పెండింగ్ దరఖాస్తుల సంఖ్యను తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. మ్యుటేషన్లు, వారసత్వ హక్కుల నమోదు, ఇతర రెవెన్యూ సేవలకు సంబంధించిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని అన్నారు.
అభివృద్ధి పనులకు సంబంధించిన భూసేకరణ అంశాలను కూడా నిరంతరం పర్యవేక్షించాలని, పరిహారం చెల్లింపులు, భూ స్వాధీనం ప్రక్రియలో ఎటువంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించడం ప్రతి అధికారి బాధ్యత అని అన్నారు .ఈ సమావేశంలో సంబంధిత తహసీల్దార్లు, గిర్దావర్లు, సర్వేయర్లు, కలెక్టరేట్‌కు చెందిన సంబంధిత శాఖల సూపరింటెండెంట్లు పాల్గొని మండలాల వారీగా వివరాలను జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. వివిధ భూ సంబంధిత అంశాలపై చర్చించి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

# పచ్చదనం, పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ జూన్ 06 (వుదయం ప్రతినిధి):**

పచ్చదనం , పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామ సభలతో ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామసభ నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారమవుతాయని గ్రామస్తులకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. పైపులైన్ల మరమ్మత్తులు, ఓ నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి తొలగించాలన్నారు. ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుంటూ వర్షపు నీటిని సంరక్షించాలన్నారు. పచ్చదనం, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్యం వంటి వంటి చిన్న చిన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించిన గ్రామాలే జాతీయస్థాయిలో అవార్డులు సాధిస్తున్నాయని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు , వసతులను సద్వినియోగం చేసుకొని సుస్థిర అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. నిబంధనల మేరకుచెత్త నిర్వహణ చేపట్టాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్, బడిబాట గురించి వివరించారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి గ్రామస్తుల సమస్యలు పరిష్కరించాలని కార్యదర్శిని ఆదేశించారు. ఇన్చార్జి ఆర్డీవో వెంకటరెడ్డి మాట్లాడుతూ సర్ లో భాగంగా ఓటరు నమోదు జాబితా, మ్యాపింగ్ ప్రక్రియ గురించి వివరించారు.ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈఓ ఆనందం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుడు గుండా నాగరాజుకు ఘన నివాళి



**మంథని, జూన్ 6: (వుదయం ప్రతినిధి)**

తెలంగాణ ఉద్యమకారుడు స్వర్గీయ గుండా నాగరాజుకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఘన నివాళులు అర్పించారు. నాగరాజు వర్ధంతి సందర్భంగా మంథని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో గుండా నాగరాజు కీలకపాత్ర పోషించారనికొనియాడారు. తెలంగాణ కోసం ఆయన చేసిన త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని అన్నారు. సాధించిన తెలంగాణ రాష్ట్రా న్ని చూడకుండానే నాగరాజు మరణించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఏగోళం శంకర్ గౌడ్ తగరం శంకర్ లాల్ కాయితి సమ్మయ్య వేల్పుల గట్టయ్య పుప్పాల తిరుపతి కణవేన శ్రీనివాస్ ఆరెపెల్లి కుమార్ కిషోర్ గొబ్బూరి వంశీ పోలు కనకరాజు వొల్లాల అశోక్ బడికెల శ్రీనివాస్ బాలయ్య సాగర్ సముద్రాల శ్రీనివాస్ పిల్లి సత్యనారాయణ మంతెన లక్ష్మణ్ మాదాసు అనిల్ జావిద్ ఇర్ఫాన్ శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు న్యాయం.. నేరస్తులకు శిక్షే లక్ష్యం

## కోర్టు డ్యూటీ అధికారులతో సీపీ అంబర్ కిశోర్ ఝా సమీక్ష



**పెద్దపల్లి, జూన్ 6: (వుదయం కరస్పాండెంట్)**

నేరస్తులకు శిక్ష పడేలా పకడ్బందీగా కేసులను కోర్టులో ప్రవేశపెట్టి, బాధితులకు న్యాయం జరిగే విధంగా పోలీసులు పనిచేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. శనివారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో కోర్టు డ్యూటీ, కోర్టు లైజనింగ్ పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలపై నేరాలు, ఆస్తి సంబంధిత కేసులు, శారీరక దాడుల వంటి కేసుల్లో బలమైన సాక్ష్యాధారాలు సమర్పించి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తే బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందని తెలిపారు. నేరస్తులకు శిక్ష పడడం ద్వారా బాధితుల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసం పెరుగుతుందని, సమాజంలో నేరాల నియంత్రణకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎన్బీడబ్ల్యూలు, సమన్ల అమలులో నిర్లక్ష్యం ఉండకూడదని, అవసరమైతే నిందితుల ఆస్తుల జప్తు ప్రక్రియలను కూడా వేగవంతం చేయాలని సూచించారు. కేసుల విచారణలో సాక్షుల హాజరు, సాంకేతిక ఆధారాలు, వైద్య ఆధారాల సమర్పణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.కాంటెస్టెడ్ కేసుల్లో బాధితులు లేదా సాక్షులు బెదిరింపులకు గురయ్యే అవకాశాలు ఉంటాయని, అలాంటి సందర్భాల్లో కోర్టు డ్యూటీ అధికారులు వారితో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించారు. బాధితులకు భరోసా కల్పించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని చెప్పారు.ఈ సందర్భంగా పలు కేసుల్లో నిందితులకు శిక్షలు పడడంలో కీలక పాత్ర పోషించిన కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులను సీపీ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, వర్టికల్ ఇన్చార్జి ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, సీసీఆర్బీ ఇన్స్పెక్టర్లు అనిల్ కుమార్, బాబురావు, ఎస్ఐ వినీత, కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

# చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలి

## పారిశుధ్య వాహనాలకు అప్పగించాలి

## ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి

## జల వనరులు సంరక్షించాలి: జిల్లా కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా**

ప్రతి ఇంటిలో చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలని, పారిశుధ్య వాహనాలకు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా తంగళ్లపల్లి మండలం రామన్నపల్లి గ్రామంలోని ప్రగతి ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, పంటల మార్పిడి, వ్యవసాయ, బడి బాట, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, పారిశుద్ధ్యం, వన మహోత్సవం, జల సంరక్షణ, మహిళల రక్షణ, షి టీమ్, భరోసా కేంద్రం తదితర అంశాలపై గ్రామ ప్రజలతో సుదీర్ఘంగా చర్చించి అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి నాలుగు చెత్త బుట్టలు పంపిణీ చేయాలని, బట్ట సంచులు ఇవ్వాలని, గ్రామంలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేసి.. స్టీల్ ప్లేట్స్, గ్లాసులు, జగ్గులు ఇవ్వాలని ప్రతి వేడుకలకు ఇవ్వాలని ప్రతిపాదనలు చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద 10థీమ్ లతో 10 శాఖల ఆద్వర్యంలో వివిధ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రభుత్వ పథకాలు, సంక్షేమ అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకువెళ్లడం, సంపూర్ణ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వర్షాకాలానికి ముందే గ్రామాల్లోని డ్రైనేజీలు శుభ్రం చేయించాలని తెలిపారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దని కోరారు. ఘన వ్యర్థాల నిర్వహణ –2026 పై ప్రజలు కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని, చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలని సూచించారు. తడి, పొడి, సానిటరీ, ప్రత్యేక చెత్త గా వేరు చేసి గ్రామ పంచాయతీ వాహనానికి అందించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్వహణపై అవగాహన పొందాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో గ్రామస్థులను సెగ్రిగేషన్ షెడ్లకు తీసుకు వెళ్లాలని సూచించారు. నీటి ట్యాంకులను నెలకు మూడు సార్లు బ్లీచింగ్ తో సిబ్బంది శుభ్రం చేయాలని ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం దృష్ట్యా పంటలు సాగు చేసేముందు వ్యవసాయ అధికారులను సంప్రదించి, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తే ఇబ్బందులు ఉండవని వివరించారు. ఆయిల్ పామ్, సన్న వడ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలు తదితర లాభదాయక పంటలను సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలని సూచించారు. ఆయిల్ పామ్ కు సంబంధించి సిద్దిపేట జిల్లా నర్మెట లో పరిశ్రమ ఉందని, పండించిన దిగుబడిని పరిశ్రమకు తీసుకువెళ్ళడానికి దూర భారం కూడా లేదని గుర్తుచేశారు. పంట మార్పిడి చేయకపోతే నేల సారం తగ్గుతుందనే విషయాన్ని రైతులు గమనించాలని పేర్కొన్నారు.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించే బీఎల్ఓలకు ప్రజలు సహకరించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈ నెల 25 వ తేదీ నుంచి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యమన్నారు. గుర్తింపు కార్డులు చూపించి మ్యాపింగ్ ప్రక్రియకు సహకరించాలని కోరారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు పంపించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వం అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జల వనరులు సంరక్షించాలని, ఇంకుడు గుంతలు శుభ్రం చేసి సిద్ధంగా ఉంచాలని, చెరువులు, గ్రామంలోని ఇంకుడు గుంతలు, పామ్ పాండ్ లు సిద్ధంగా ఉంచాలని పిలుపు నిచ్చారు. దీంతో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ నెల 1వ తేదీన జిల్లా వ్యాప్తంగా 2720 ఇందిరమ్మ ఇండ్లకు గృహ ప్రవేశాలు చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయడంలో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్, డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, సర్పంచ్ జ్యోతి, మిషన్ భగీరథ, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభలో సమస్యల పరిష్కారానికి డిపిఓ ఆదేశం





**జన్నారం, జూన్ 6(వుదయం విలేఖరి)**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా చింతగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి డా.వెంకటేశ్వర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.సర్పంచ్ సుతారి సుమలత అధ్యక్షతన జరిగిన ఈ సభలో గ్రామస్తులు తమ సమస్యలను అధికారుల ముందు ఉంచారు.గ్రామసభకు వచ్చిన వివిధ శాఖల అధికారులతో ప్రజల సమస్యలపై చర్చించిన డిపిఓ డా.వెంకటేశ్వరావు, వాటిని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.99 రోజుల ప్రణాళిక లక్ష్యం ప్రజల వద్దకే పాలన తీసుకెళ్లడం అని,ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ నాసాని రాజన్న,ఉప సర్పంచ్ కావ్య,పంచాయతీ కార్యదర్శి రాజన్న, స్పెషల్ ఆఫీసర్ నందన్ వర్మతో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాలో రికార్డు స్థాయిలో జొన్నల కొనుగోళ్లు– జిల్లా కలెక్టర్



**ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ జిల్లాలో యాసంగి 2025–26 సీజన్‌కు సంబంధించిన జొన్నల కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా, పారదర్శకంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టగా, జిల్లా యంత్రాంగం సమన్వయంతో కొనుగోళ్లు సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా సుమారు 1.12 లక్షల ఎకరాల్లో జొన్నల సాగు జరిగి, గతంలో ఎన్నడూ లేనివిధంగా దాదాపు 16 లక్షల క్వింటాళ్ల దిగుబడి నమోదైనట్లు తెలిపారు. రైతుల స్వీయ వినియోగం మినహాయించి సుమారు 7 లక్షల క్వింటాళ్ల జొన్నలు మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు.గత యాసంగి సీజన్‌లో 13 కొనుగోలు కేంద్రాల ద్వారా 56 వేల మెట్రిక్ టన్నుల జొన్నలు సేకరించగా, ఈ సారి రైతులకు మరింత చేరువగా సేవలు అందించేందుకు కొనుగోలు కేంద్రాల సంఖ్యను 26కు పెంచినట్లు తెలిపారు. దీంతో రైతులు తమ సమీప కేంద్రాల్లోనే పంటను విక్రయించే అవకాశం పొందారని పేర్కొన్నారు.ప్రస్తుతం జిల్లాలోని 26 కొనుగోలు కేంద్రాల ద్వారా 19,889 మంది రైతుల నుంచి సుమారు 5.87 లక్షల క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. కొనుగోలు ప్రక్రియ తుది దశలో ఉందని, మరో రెండు మూడు రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉందన్నారు.కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, విశ్రాంతి సౌకర్యాలు తదితర మౌలిక వసతులు కల్పించామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను చెల్లించడంతో పాటు కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నగదు రైతుల బ్యాంకు ఖాతాల్లో సకాలంలో జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# మహిళలు, బాలికలు తమ సమస్యలపై నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలి: జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

ఆసిఫాబాద్ మండలంలోని పాడిబండ గ్రామంలో నిర్వహించిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక గ్రామసభ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితికా పంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామసభలో ప్రజలను, ముఖ్యంగా మహిళలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, బాలికలు తమపై జరిగే వేధింపులు, గృహహింస, సైబర్ నేరాలు, మోసాలు, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్ వంటి నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని అన్నారు. మహిళలు, బాలికల భద్రతకు తెలంగాణ పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ అమలు చేస్తున్న పలు కార్యక్రమాల గురించి వివరించారు. షీ టీమ్స్, భరోసా సెంటర్లు, ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ సేవలు, సైబర్ భద్రత అవగాహన కార్యక్రమాలు, డయల్–100, డయల్–112, హాక్ ఐ (Hawk Eye) యాప్, మహిళా హెల్ప్‌లైన్–181, చైల్డ్ హెల్ప్‌లైన్–1098 వంటి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్కాల్స్, సందేశాలు, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైనట్లయితే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై వెంటనే సమాచారం అందించాలని కోరారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, సమాజ అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సూచించారు.గ్రామసభలో గ్రామస్తులు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకురాగా, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, ఆసిఫాబాద్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ వరప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, డివిజనల్ లెవల్ పంచాయతీ ఆఫీసర్ ఉమర్, భరోసా సెంటర్ ఇన్‌చార్జి ఎస్ఐ దివ్య, జిల్లా మరియు మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, యువత మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు



**నిర్మల్ జిల్లా 6 జూన్ 2026 (వుదయం ప్రతినిధి)**

మరో రెండు రోజుల్లో రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రాన్ని తాకనున్న నేపథ్యంలో జిల్లాల్లో మిగిలి ఉన్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుండి వరి కొనుగోలు ప్రక్రియ, ఈ నెల 9న నిర్వహించనున్న మండల మహిళా సమాఖ్య సభ్యులకు ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమం, అలాగే నీట్ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని తెలిపారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే లారీల ద్వారా మిల్లులు, గోదాములకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఖాళీ అయ్యాయని, మిగిలిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొన్నారు.జూన్ 9న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న మండల మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా నుంచి లబ్ధిదారులను తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

# సమస్యల పరిష్కారానికై తక్షణ చర్యలు

## వార్డు సభలో మున్సిపల్ చైర్పర్సన్ సంధ్యారాణి



**మంచిర్యాల/రామకృష్ణాపూర్ జూన్ 06(వుదయం ప్రతినిధి)**

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11వ,13వ వార్డుల్లో నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక వార్డు సభ కార్యక్రమాల్లో క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గోడిసెల సంధ్యారాణి సంబంధిత వార్డు కౌన్సిలర్లు తో పాటు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో ప్రజల నుంచి వినతులు, సమస్యలను స్వీకరించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా, సకాలంలో అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. అలాగే వార్డుల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పెండింగ్ పనుల పూర్తితో పాటు తదితర విషయలలో ప్రత్యేక దృష్టి సారించాలనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్యాతనపల్లి మున్సి పల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, రామకృష్ణపూర్ పట్టణ ఎస్సై శ్రీధర్, 11 వ వార్డ్ కౌన్సిలర్ బోమ్మ భూమా గౌడ్,13 వ వార్డు కౌన్సిలర్ జక్కబోయిన మంజుల, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


# ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు తప్పనిసరి: మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్



**నాగిరెడ్డిపేట్, వుదయం**

వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ తెలిపారు. ఆధార్ ద్వారా ప్రతి పౌరుడికి గుర్తింపు కల్పించినట్లుగానే, ప్రతి రైతుకు 11 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య (ఫార్మర్ ఐడీ) కేటాయించే ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు.రైతుల భూ యాజమాన్య వివరాలు, వ్యక్తిగత సమాచారంతో ఫార్మర్ రిజిస్ట్రీ రూపొందించబడుతుందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలైన పీఎం కిసాన్, రైతు భరోసా, ఎరువుల సబ్సిడీలు తదితర ప్రయోజనాలను ఫార్మర్ ఐడీతో అనుసంధానం చేసే అవకాశం ఉందన్నారు. అందువల్ల రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఫార్మర్ ఐడీ పొందేందుకు ఆధార్ కార్డు,భూయాజమాన్య పాస్ పుస్తకం, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో సమీప వ్యవసాయ విస్తరణ అధికారిని లేదా మీ సేవ కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.శనివారం మండలంలోని అక్కంపల్లి గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకట్ గౌడ్, వ్యవసాయ అధికారి సాయికిరణ్, గ్రామ రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# పర్యావరణ మిత్ర జాతీయ అవార్డు అందుకున్న పట్వారీ తులసి కుమార్



**ఆర్మూర్,జూన్ 6 (వుదయం ప్రతినిధి ):**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు పట్వారీ తులసి కుమార్కు "పర్యావరణ మిత్ర" జాతీయ స్థాయి అవార్డు ప్రదా నం చేశారు.మొక్కల నాటే కార్యక్రమా లు, పర్యావరణ పరిరక్షణతో పాటు వివిధ సామాజిక సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును మాజీ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా తులసి కుమార్ మాట్లాడు తూ, తాను చేస్తున్న సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ఆనందం గా, గర్వకారణంగా ఉందన్నారు. తన సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ సమాజ సేవలో మరింత చురుకుగా పాల్గొంటానని పేర్కొన్నారు.కార్యక్రమంలో పట్వారీ బాల సరస్వతి, పట్వారీ గోపికృష్ణ, ప్రగతి, విద్య, బాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు మిత్రులకు రెయిన్‌కోట్లు పంపిణీ: కలెక్టర్




**కామారెడ్డి, జూన్ 6 (వుదయం ప్రతినిధి):**

వర్షాకాలంలో విధులు నిర్వహించే జర్నలిస్టులకు ఉపయోగపడేలా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ రెయిన్ కోట్లను పంపిణీ చేశారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు రెయిన్‌కోట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎండలు, వర్షాలు, ఇతర ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రజలకు సమయానుకూలంగా సమాచారాన్ని చేరవేస్తూ జర్నలిస్టులు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని అన్నారు. వర్షాకాలంలో వార్తల సేకరణ కోసం క్షేత్రస్థాయిలో పర్యటించే మీడియా ప్రతినిధులకు రెయిన్‌కోట్లు ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యలను ప్రజల దృష్టికి తీసుకురావడంలో మీడియా పాత్ర ఎంతో ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా పరిపాలనకు మీడియా ఎల్లప్పుడూ సహకరిస్తోందని, అదే స్ఫూర్తి తో ముందుకు సాగా లని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో అద నపు కలెక్టర్ ఎన్ వి గిరి, డిపిఆర్వో తిరు మల, డీపీవో మురళి, జర్నలిస్టు సంఘా ల ప్రతినిధులు, ప్రింట్ అండ్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, సమాచార శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోనే పల్లి (బి) ఆదర్శ గ్రామంగా నిలవాలి

## : జిల్లా కలెక్టర్ రాజర్షిషా



అదిలాబాద్ : జిల్లాలోనే పల్లి(బి) గ్రామం ఆదర్శ గ్రామంగా నిలవాలని, జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన -ప్రగతిప్రణాళిక లో భాగంగా తలమడుగు మండలం పల్లి(బి) గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు వివరాలను గ్రామసభలో వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి నేరుగా వినతులు స్వీకరించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి తక్షణ పరిష్కారానికి క్షేత్రస్థాయిలోనే అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాబోయే వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి సంరక్షణ, వ్యవసాయ ప్రణాళికలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున, రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సాగు దిగుబడి పెంచే ట్రైకోడెర్మా వంటి పద్ధతులు పాటించాలని కోరారు. అలాగే, భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రతి బోర్ వెల్‌తో పాటు ఒక రీఛార్జ్ స్ట్రక్చర్‌ను తప్పనిసరిగా నిర్మించుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా తడి, పొడి చెత్త సేకరణను పక్కాగా అమలు చేయాలని, హరితహారంలో భాగంగా ప్రతి ఇంటి పరిధిలోనూ, అటవీ ప్రాంతాలలోనూ పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో మహిళా భద్రత, సురక్షిత ప్రయాణాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదర్శవంతమైన గ్రామాలుగా నిలవాలంటే యువత మత్తు పదార్థాలు, గంజాయి, ప్రాణాంతక క్యాన్సర్లకు దారితీసే తంబాకు, జర్దా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, వాటికయ్యే ఖర్చును పౌష్టికాహారం, ఆరోగ్యం కోసం ఉపయోగించుకోవాలని హితవు పలికారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై బి.ఎల్.ఓలు జూన్ 24 లోగా 100% ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని, జూన్ 25 నుండి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని ఆదేశించారు. గ్రామ అభివృద్ధి పనులైన మిషన్ భగీరథ పైప్‌లైన్ విస్తరణ, సిసి రోడ్లు, వైకుంఠ ధామాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి సంబంధించిన అంచనాలను పరిశీలించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, నవంబర్ చివరి నాటికి 'గ్రామ సంఘం భవనం' నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, 'మన ఊరు – మన బడి' కింద పెండింగ్‌లో ఉన్న నిధులను త్వరలోనే విడుదల చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం, సైన్స్ సబ్జెక్టులలో నాణ్యమైన విద్యనందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో భాగంగా 'దాజుగా' స్కీమ్ కింద అర్హులైన ప్రతి ఎస్టీ (గా) కుటుంబానికి ఉచితంగా కరెంట్ మీటర్లు అందించాలని, గ్రామాల్లో వంగిపోయిన, తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలను, లూజ్ లైన్లను యుద్ధప్రాతిపదికన సరిచేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రతి బోర్ వెల్‌తో పాటు ఒక రీఛార్జ్ స్ట్రక్చర్‌ను తప్పనిసరిగా నిర్మించుకోవాలని గ్రామసభలో కలెక్టర్ సమక్షంలో తీర్మానం చేశారు.

ఈ గ్రామ సభ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంపీడీవో శంకర్, సర్పంచ్ కట్కం సంజీవ్, పంచాయతీ కార్యదర్శి బాలాజీ, మండల విద్యా, వైద్య, వ్యవసాయ, విద్యుత్, గృహ నిర్మాణ, పంచాయతీ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# సిర్పూర్ పేపర్ మిల్ కార్మికులకు తక్షణమే న్యాయం చేయాలి

## : డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్.



కాగజ్ నగర్ ( వుదయం ప్రతినిధి )గత 17 రోజులుగా నిరావధిక దీక్ష చేస్తున్న సిర్పూర్ పేపర్ మిల్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు, మరియు యాజమాన్యం అవలంబిస్తున్న తీరును బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. 17 రోజులుగా కార్మికులు దీక్షలు చేస్తున్నా ఏ ఒక్క రాజకీయ నాయకుడు, ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ దండే విఠల్ గానీ, బీజేపీ ఎమ్మెల్యే పల్వాయి హరీష్ బాబు గానీ పట్టించుకోకపోవడం దారుణం. ఇటీవల ఆసిఫాబాద్ జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పేపర్ మిల్ కార్మికుల సమస్యపై మాట్లాడకుండా దాటవేసి వెళ్ళిపోయారు. పైగా, తమ గోడు వెళ్లబోసుకునేందుకు వచ్చిన తెలంగాణ బిడ్డలైన కార్మికులను పోలీసుల చేత కొట్టించి లారీల్లో ఎక్కించి తీసుకెళ్లడం అత్యంత బాధాకరం. ఇక్కడి సమస్యలపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, రీజినల్, డెప్యూటీ, మరియు స్టేట్ లేబర్ కమిషనర్లు ఎందుకు మౌనంగా ఉన్నారు? వెంటనే స్పందించి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలి. మంత్రి శ్రీధర్ బాబు గారు చొరవ తీసుకొని కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకోవాలి. దేవాపూర్ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీలో, సింగరేణి ప్రాంతాల్లో కార్మిక సంఘాల ఎన్నికలు జరుగుతున్నప్పుడు, సిర్పూర్ పేపర్ మిల్లులో ఎందుకు నిర్వహించడం లేదు? గుర్తింపు పొందిన యూనియన్ వస్తే, యాజమాన్యం చేస్తున్న అక్రమాలు, దుర్మార్గాలు బయటపడతాయనే భయంతోనే వారు ఎన్నికలను అడ్డుకుంటున్నారు.

ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ వంటి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి లక్షల్లో జీతాలు ఇస్తూ, స్థానిక తెలంగాణ భూమిపుత్రులకు మాత్రం కనీస వేతనాలు కూడా ఇవ్వకుండా యాజమాన్యం అణిచివేస్తోంది. యాజమాన్యం అర్ధరాత్రి దొంగల్లాగా విష వాయువులను, కలుషిత నీటిని వదులుతూ పర్యావరణాన్ని నాశనం చేస్తోంది. దీనివల్ల స్థానికులకు కిడ్నీ, శ్వాసకోశ, మరియు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తున్నాయి. కార్మికులు ఉండే చిన్నపాటి ఇళ్లను కూలగొట్టడమే కాకుండా, కనీసం రామాలయం, దుర్గామాత, గాయత్రీ మాత వంటి దేవాలయాలను సైతం వదలకుండా కూల్చివేస్తున్నారు. 2018లో కేసీఆర్ మరియు కేటీఆర్ గార్ల ముందుచూపు, శ్రమ వల్లనే మూతపడిన సిర్పూర్ పేపర్ మిల్లు తిరిగి తెరుచుకుందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. భారత రాష్ట్ర సమితి ఎల్లప్పుడూ కార్మికుల పక్షానే ఉంటుందని, వెంటనే సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిపించి, కార్మికులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం, బీజేపీ ప్రజాప్రతినిధుల మిలాకత్ వల్లే కార్మికులకు ఈ దుస్థితి దాపురించిందని ఆయన మండిపడ్డారు. పత్రికా సమావేశంలో సిర్పూర్ పేపర్ మిల్స్ ఎంప్లాయిస్ ప్రొటెక్ట్ యూనియన్ రిజిస్ట్రేషన్ నెంబర్ ఇ -23 81 అధ్యక్షులు కొంగ సత్యనారాయణ కార్యనిర్వాహక అధ్యక్షులు గోలేం వెంకటేశం పాల్గొన్నారు

# నీట్-2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలి

## రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు





మంచిర్యాల/జూన్ 6, 2026జూన్ 06(వుదయం ప్రతినిధి)రాష్ట్రంలో నీట్–2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి అదనపు డి జి పి మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సి.పి.లు, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీట్–2026 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, వరి ధాన్యం కొనుగోలు, జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి సభ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 21వ తేదీన జరగనున్న నీట్–2026 పరీక్షకు 24 పట్టణాలలో 208 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 72 వేల 956 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందుకు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పరీక్షహూహూనిర్వహణకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర, జిల్లా సమన్వయ కమిటీలు అందుకు అనుగుణంగా పని చేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులపై తక్షణమే స్పందించాలని, వదంతులు వ్యాప్తి కాకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వ సంస్థలలో మాత్రమే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలని, అంతర్జాతీయ యోగా దినోత్సవం దృష్ట్యా పరీక్షహూహూనిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. పరీక్ష రోజున ప్రశ్న పత్రాల తరలింపు, అభ్యర్థుల రిజిస్ట్రేషన్, బయోమెట్రిక్ వెరిఫికేషన్, అభ్యర్థుల తనిఖీ, బందోబస్తు తదితర ఏర్పాట్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండాహూహూచేపట్టాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 71 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి 4 వేల 488 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 10 లక్షల 58 వేల మంది రైతుల ఖాతాలలో 13 వేల 577 కోట్ల రూపాయల కనీస మద్దతు ధర జమ చేయడం జరిగిందని, మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసి కొనుగోలు ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మండల మహిళా సమాఖ్యకు 1 చొప్పున 553 బస్సులను మంజూరు చేయడం జరిగిందని, ఈ బస్సులను జూన్ 9వ తేదీన సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహిళా సమాఖ్య సభ్యులకు లాంఛనంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లు, సభకు మహిళా సమాఖ్య సభ్యుల తరలింపుపై ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి అధికారులు, ఆర్ టి సి రీజినల్ మేనేజర్లు సమన్వయంతో పని చేసి సభను విజయవంతం చేయాలని తెలిపారు. జూన్ 12న రాష్ట్రంలోని పాఠశాలల పునః ప్రారంభానికి విద్యార్థులకు అందజేయవలసిన యూనిఫామ్ లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. అదనపు డి జి పి మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలకు ఎప్పటికప్పుడు స్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళా అభ్యర్థుల తనిఖీలో మహిళ కానిస్టేబుల్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో 1 వేయి 204 మంది అభ్యర్థులు నీట్–2026 పరీక్షకు హాజరు కానున్నారని, పరీక్ష నిర్వహణ కొరకు జిల్లాలో 5 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకొని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వర్షాల దృష్ట్యా కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచడం జరిగిందని, రవాణా సంబంధిత ఏర్పాట్లు చేయడం జరిగిందని, తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపి భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాశాఖాధికారి లలిత, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ఆకర్షణ.. కాంగ్రెస్‌లో చేరిన రాఘవపల్లి నాయకులు



నాగిరెడ్డిపేట,వుదయంఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సమక్షంలో నాగిరెడ్డిపేట మండలంలోని రాఘవపల్లి గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ సర్పంచ్ నర్ల గంగామణి మల్లేష్‌తో పాటు ఉపసర్పంచ్ సూరయ్య, వార్డు సభ్యులు సురేందర్, బాలమణి వెంకయ్య, ఇందిరవ్వ పాపయ్య, చాకలి రుక్మిణి గంగయ్య, భాస్కర్, మాలావత్ రమేష్ తదితరులు కాంగ్రెస్ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. పార్టీలో చేరిన నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ముఖ్యంగా పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని పేర్కొన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీకి తమ మద్దతు ప్రకటిస్తూ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరామ్ గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు క్రిస్టోఫర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఘనంగా జాన్సన్ నాయక్ జన్మదిన వేడుకలు

## – రోగులకు పండ్ల పంపిణీ చేసిన బీఆర్ఎస్వీ నాయకులు



ఆదిలాబాద్, జూన్ 6: బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జి భూక్య జాన్సన్ నాయక్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్వీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేశారు. బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంద్ర జైవంత్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జాన్సన్ నాయక్ ప్రజా సేవకు అంకితభావంతో పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడని కొనియాడారు. నిస్వార్థ రాజకీయాలకు ఆయన నిదర్శనంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై వారి సంక్షేమం కోసం పనిచేస్తున్న జాన్సన్ నాయక్ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజా సేవలో మరింత ముందుకు సాగుతూ సమాజానికి మరిన్ని సేవలు అందించాలని కోరుకున్నారు.

కార్యక్రమంలో వార్డు సభ్యుడు కూర్సెంగ భూమన్న, మాజీ ఎంపీటీసీ అమీనాబీ, నడిగే రాజ్‌కుమార్, దూట మహేందర్, సిడం సోనే రావు, జాదవ్ రవి, బొడ్డు నరేష్, కమేరి రాజు, సాజిద్, సాధని సురేష్, రాథోడ్ అన్వేష్, జాదవ్ గిరి నాయక్, రామ్ కోటేష్, శంశీర్, వినయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు కృషి చేస్తాం: తెలంగాణ ఉద్యమకారుల వేదిక.



కాగజ్‌నగర్,( వుదయం ప్రతినిధి ) తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు కాగజ్‌నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఏర్పాటు ఆవశ్యకతతో పాటు రాబోయే రోజుల్లో చేపట్టనున్న కార్యక్రమాలపై చర్చించారు. వేదిక కన్వీనర్ ఈర్ల విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేశవరావు కమిటీని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్ సహకారంతో త్వరలోనే కమిటీ చైర్మన్ కేశవరావును కలిసి ఉద్యమకారుల సమస్యలు, గుర్తింపు అంశాలను వివరించనున్నట్లు చెప్పారు. ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడిని గుర్తించి జాబితా తయారు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఉద్యమంలో పాల్గొనని కొందరు వ్యక్తులు ఉద్యమకారులమని చెప్పుకుంటూ సర్టిఫికెట్ల పేరుతో రూ.500 చొప్పున వసూలు చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అసలైన ఉద్యమకారులు ఎవరూ డబ్బులు చెల్లించి సర్టిఫికెట్లు పొందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. బోగస్ ఉద్యమకారుల విషయంలో తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయినవారు, గాయపడినవారు, కేసులు ఎదుర్కొన్నవారితో పాటు ఉద్యమానికి సహకరించిన అన్ని వర్గాల ప్రజలను గుర్తించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. అలాగే, 1969 తొలి దశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిని కూడా గుర్తించి జాబితాలో చేర్చనున్నట్లు వెల్లడించారు.

కేశవరావును కలిసిన అనంతరం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల విజయవంతానికి తెలంగాణ ఉద్యమకారుల వేదిక సభ్యులు సహకరించాలని కోరారు. అనంతరం పలువురు ఉద్యమకారులు మాట్లాడుతూ, అర్హులైన ఉద్యమకారులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో నిర్బంధాలు, ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ రాష్ట్ర ఏర్పాటు తర్వాత గుర్తింపు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉద్యమకారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేశవరావు కమిటీని ఏర్పాటు చేయడం హర్షణీయమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు పాల్వాయి సుధాకర్‌రావు, సిందం శ్రీనివాస్, డెబ్బటి శ్రీనివాస్, సుభాష్, రమేష్ గౌడ్, జయదేవ్ అబ్రహం, తుమ్మ రమేష్, దుర్గం విస్తారు, జాడి కేశవ్, గోగర్ల కన్నయ్య, తాజాబాబా, కొప్పుల శంకర్, గజ్జల లక్ష్మణ్, మాచర్ల శ్రీనివాస్, జిలకర మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్-2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలి

## రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు

కామారెడ్డి, జూన్ 6 (వుదయం ప్రతినిధి):రాష్ట్రంలో నీట్–2026 పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుండి అదనపు డీజీపీ మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో నీట్–2026 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, వరి ధాన్యం కొనుగోళ్లు, జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 21న నిర్వహించనున్న నీట్–2026 పరీక్షకు 24 పట్టణాల్లో 208 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షకు 72,956 మంది విద్యార్థులు హాజరుకానున్నందున అన్ని జిల్లాలు సమగ్ర ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. పరీక్ష నిర్వహణకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని, రాష్ట్ర , జిల్లా స్థాయి సమన్వయ కమిటీలు సమర్థవంతంగా పని చేయాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులపై వెంటనే స్పందించి, తప్పుడు ప్రచారాన్ని అరికట్టాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో మాత్రమే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో పరీక్ష నిర్వహణకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని , ప్రశ్నపత్రాల రవాణా, అభ్యర్థుల నమోదు, బయోమెట్రిక్ ధృవీకరణ, తనిఖీలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 71 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. 4,488 కొనుగోలు కేంద్రాలను మూసివేసినట్లు పేర్కొన్నారు. 10 లక్షల 58 వేల మంది రైతుల ఖాతాల్లో రూ. 13,577 కోట్ల కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసి ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని ఆదేశించారు.

రాష్ట్రంలోని ప్రతి మండల మహిళా సమాఖ్యకు ఒక్కో బస్సు చొప్పున మొత్తం 553 బస్సులను మంజూరు చేసినట్లు తెలిపారు.



# సిపిఐ పార్టీ తరుపున కో-ఆప్షన్ పదవికి నామినేషన్ దాఖలు

మంచిర్యాల/రామకృష్ణాపూర్ జూన్ 06(వుదయం ప్రతినిధి)

క్యాతనపల్లి మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుల ఎన్నికల భాగంగా సిపిఐ పార్టీ తరపున మిట్టపల్లి పౌల్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు.

క్యాతనపల్లి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మిట్టపల్లి సరిత శ్రీనివాస్, సిపిఐ కౌన్సిలర్లు,సిపిఐ పార్టీ ముఖ్య నాయకులు ఆధ్వర్యంలో మున్సిపాలిటీ సంబంధిత అధికారులకు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

# చక్కని ఆరోగ్యం

## 'టీ' విషయంలో.. ఈ జాగ్రత్తలు!




ఉదయం నిద్ర లేచాక మాత్రమే కాదు.. ఒత్తిడిగా, అలసటగా ఉన్నప్పుడు సైతం.. ఓ కప్పు టీ తాగనిదే బండి ముందుకెళ్లదు. ఇలా టీ ప్రతి ఒక్కరి జీవనశైలిలో ఓ భాగమే! అయితే దీన్ని ఎలా తీసుకుంటున్నాం, ఎప్పుడు తీసుకుంటున్నామన్న దానిపైనే.. టీ వల్ల మనకు మేలు జరుగుతుందా? హాని కలుగుతుందా? అనేది ఆధారపడి ఉంటుందంటున్నారు నిపుణులు. ముఖ్యంగా టీకి సంబంధించిన కొన్ని అలవాట్లు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపి వివిధ రకాల అనారోగ్యాల్ని తెచ్చిపెడతాయని హెచ్చరిస్తున్నారు. మరి, ఏంటా అలవాట్లు? తెలుసుకుందాం రండి..

ఉదయం నిద్ర లేచి బ్రష్ చేసుకోగానే టీ తాగుతుంటారు చాలామంది. అయితే ఈ అలవాటు ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు నిపుణులు. ఇలా పరగడుపునే టీ తీసుకోవడం వల్ల పొట్టలోని ఆమ్లాలు పైకి ఎగదోయడం, వికారం, పొట్టలో ఏదో తెలియని అసౌకర్యం.. వంటివి కలుగుతాయట! అందుకే ఏదైనా ఘనాహారం తిన్నాకే టీ తీసుకోవడం మేలంటున్నారు. గ్రీన్ టీ ఆరోగ్యానికి మంచిదన్న విషయం తెలిసిందే. అయితే అది మితంగా తీసుకున్నంత వరకేనట. ఎక్కువ మొత్తంలో దీన్ని తీసుకోవడం వల్ల కాలేయంపై ప్రతికూల ప్రభావం పడుతుందట. ప్రస్తుతం బరువు తగ్గించే టీలు, శరీరాన్ని డీటాక్స్ చేసే టీలు.. అంటూ ఎన్నో రకాలు మార్కెట్లోకొస్తున్నాయి. అయితే వీటి తయారీలో వాడే కొన్ని పదార్థాలు శరీరంపై వివిధ రకాలుగా ప్రతికూల ప్రభావం చూపుతాయంటున్నారు నిపుణులు. వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్, ఎలక్ట్రొలైట్ అసమతుల్యత, పొట్ట ఆరోగ్యం దెబ్బతినడం.. వంటి సమస్యలొస్తాయట! అందుకే వీటిని వాడే ముందు డాక్టర్ సలహా తీసుకోవడం మంచిదంటున్నారు. వేడివేడిగా పొగలు కక్కే టీ తాగడమే చాలామందికి ఇష్టం. కానీ 65 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ వేడి ఉన్న టీ తాగడం వల్ల అన్నవాహిక క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని, కాబట్టి కాస్త చల్లారాక తీసుకోవడమే మేలంటున్నారు నిపుణులు. రాత్రుళ్లు హాయిగా నిద్రపోయినప్పుడే శరీరం తనను తాను రిపేర్ చేసుకోగలుగుతుంది. సంపూర్ణ ఆరోగ్యానికి ఈ దశ కీలకం. అయితే కొంతమంది నైట్‌షిఫ్టులని, ఎక్కువసేపు మెలకువగా ఉండాలని రాత్రి పూట టీ తాగుతుంటారు. దీనివల్ల నిద్రకు ఆటంకం కలిగి లేనిపోని అనారోగ్యాలకు దారి తీస్తుంది. వెరైటీగా ప్రయత్నించాలని కొంతమంది బబుల్ టీ రుచి చూస్తుంటారు.

నిజానికి దీనిలో క్యాలరీలు, చక్కెరలు మోతాదుకు మించి ఉంటాయంటున్నారు నిపుణులు. ఫలితంగా పలు ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందంటున్నారు. కాబట్టి టీ తాగే విషయంలో ఈ అంశాలు దృష్టిలో ఉంచుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అలాగే టీ మితంగా తీసుకోవడం, శరీరానికి పడకపోతే పక్కన పెట్టేయడం, అవసరమైతే నిపుణుల సలహాలు పాటించడం.. వంటివన్నీ ముఖ్యమే!

## గర్భ పిండాసనం



ఈ ఆసనం వేసినప్పుడు గర్భంలో పిండం మాదిరిగా కనిపిస్తాం. అందుకే దీనికా పేరు.

చేసే విధానం: ముందుగా యోగా మ్యాట్‌పైన ప్రశాంతంగా కూర్చొండి. తర్వాత కుడి కాలిని ఎడమ తొడ మీద, ఎడమ కాలిని కుడి తొడ మీద ఉంచి పద్మాసనం వేయండి. ఇప్పుడు ఉదర కండరాల సామర్థ్యం వాడి శరీరాన్ని బ్యాలెన్స్ చేస్తూ మోకాళ్లను పైకి లేపాలి. ఆపై చేతుల్ని మెల్లగా పద్మాసన మధ్య స్థానం నుంచి ఫొటోలో చూపినట్లు బయటకు తీయాలి. తర్వాత అరచేతుల్ని గడ్డం కిందకు తీసుకొచ్చి వాటి మధ్య ముఖాన్ని ఉంచాలి. ఈ స్థితిలో ప్రశాంతంగా ఉండండి. అలా చేయలేనివాళ్లు చేతుల్ని జోడించి నమస్కార ముద్రలో ఉండొచ్చు. క్లిష్ట ఆసనం కనుక 10–12 సెకన్లు ఉండి తర్వాత నెమ్మదిగా విరమించి విశ్రాంతి పొందండి. ఈ ఆసనానికి ముందు కాసేపు పద్మాసనంలో ఉంటే ఫ్లెక్సిబిలిటీ వచ్చి సులభంగా వేయగలరు.

ఉపయోగాలు: ఏకాగ్రతకు బాగా పని చేస్తుంది. వెన్నెముక దృఢంగా తయారవుతుంది. నడుము, మోకాళ్లు, మడమల దగ్గర ఫ్లెక్సిబిలిటీ పెరుగుతుంది. చిన్న పిల్లలకు మంచి ఉత్సాహాన్ని ఇచ్చే ఆసనం. శారీరక, మానసిక స్థిరత్వానికి దోహదపడుతుంది. జాగ్రత్తలు: శరీరం సహకరించని, పెద్ద వయసు వాళ్లు, గర్భిణులు, మోకాళ్ల నొప్పి, ఆర్థరైటిస్ ఉన్నవాళ్లు చేయకూడదు.

## వృద్ధాప్యంలో బీట్ రూట్ జ్యూస్ తాగితే ఎంతో మేలు..

వృద్ధాప్యంలో అధిక రక్తపోటు అత్యంత సాధారణంగా కనిపించే ఆరోగ్య సమస్యల్లో ఒకటి. ఇది గుండె జబ్బులు, పక్షవాతం, ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. సాధారణంగా మందులు, జీవనశైలి మార్పులు రక్తపోటు నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, కొన్ని ఆహార పదార్థాలు కూడా అదనపు ప్రయోజనాలు అందించగలవా అనే అంశంపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా నిర్వహించిన ఒక అధ్యయనం బీట్‌రూట్ జ్యూస్ వృద్ధుల్లో రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుందని సూచించింది.



Image credit: istockphoto.com/zeleno

ఈ పరిశోధనలో మొత్తం 75 మంది పాల్గొన్నారు. వీరిలో కొందరు 30 సంవత్సరాల లోపు వయస్సు కలిగినవారు కాగా, మరికొందరు 60 నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు. ఆహారంలో ఉండే నైట్రేట్లు రక్తపోటుపై ఎలాంటి ప్రభావం చూపుతాయో, వయస్సును బట్టి దాని ప్రభావంలో ఎలాంటి తేడాలు ఉంటాయో తెలుసుకోవడం ఈ అధ్యయనం లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. పరిశోధనలో భాగంగా పాల్గొన్నవారికి రెండు వారాల పాటు రోజుకు రెండు సార్లు నైట్రేట్‌లతో సమృద్ధిగా ఉండే సాంద్రీకృత బీట్‌రూట్ జ్యూస్ ఇచ్చారు. మరో రెండు వారాల కాలంలో నైట్రేట్లు తొలగించిన ప్లాసీబో జ్యూస్ అందించారు. ఈ రెండు దశల మధ్య విరామ కాలాన్ని కూడా పాటించారు, తద్వారా ఫలితాల కచ్చితత్వం మెరుగుపడింది. అధ్యయన ఫలితాల ప్రకారం నైట్రేట్‌లు అధికంగా ఉన్న బీట్‌రూట్ జ్యూస్ తాగిన వృద్ధుల్లో రక్తపోటు స్థాయిలు తగ్గినట్లు గుర్తించారు. అయితే యువకుల్లో ఇదే స్థాయిలో మార్పులు కనిపించలేదు. వయస్సు పెరిగేకొద్దీ శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తి తగ్గిపోవడం దీనికి ఒక కారణమై ఉంటుందని పరిశోధకులు భావిస్తున్నారు. బీట్‌రూట్‌లో సహజసిద్ధంగా నైట్రేట్‌లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోకి వెళ్లిన తర్వాత నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుతాయి. నైట్రిక్ ఆక్సైడ్ రక్తనాళాలను సడలించి విస్తరింపజేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఫలితంగా రక్తప్రసరణ మెరుగుపడి రక్తపోటు స్థాయిలు తగ్గే అవకాశం ఉంటుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో నైట్రిక్ ఆక్సైడ్ ప్రాధాన్యత ఇప్పటికే శాస్త్రీయంగా నిర్ధారణ అయింది. ఈ అధ్యయనంలో మరో ఆసక్తికర అంశం నోటి లోపల ఉండే బ్యాక్టీరియా పాత్ర. మనం తీసుకునే నైట్రేట్‌లను శరీరం వినియోగించగల రూపంలోకి మార్చడంలో కొన్ని ప్రయోజనకర బ్యాక్టీరియా సహాయపడతాయి. వయస్సు పెరుగుతున్న కొద్దీ నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తి తగ్గిపోవడం వల్ల వృద్ధుల్లో బీట్‌రూట్ జ్యూస్ ప్రభావం ఎక్కువగా కనిపించి ఉంటుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. పరిశోధనలో బీట్‌రూట్ జ్యూస్ తీసుకున్న తర్వాత నోటి మైక్రోబయోమ్‌లో మార్పులు చోటు చేసుకున్నట్లు కూడా గుర్తించారు. కొన్ని బ్యాక్టీరియా సమూహాల స్థాయిలు తగ్గగా, నైట్రేట్‌లను సమర్థవంతంగా మార్చడంలో సహాయపడే ప్రయోజనకర బ్యాక్టీరియా పెరిగినట్లు వెల్లడైంది. దీనివల్ల శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తి మెరుగుపడే అవకాశం ఉంటుంది. అయితే బీట్‌రూట్ జ్యూస్‌ను రక్తపోటు మందులకు ప్రత్యామ్నాయంగా పరిగణించకూడదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ అధ్యయనం పరిమిత సంఖ్యలో వ్యక్తులపై మాత్రమే జరిగినందున, మరింత పెద్ద స్థాయి పరిశోధనలు అవసరమని పేర్కొంటున్నారు. అయినప్పటికీ నైట్రేట్‌లు అధికంగా ఉండే కూరగాయలను ఆహారంలో చేర్చడం ఆరోగ్యకరమైన అలవాటుగా చెబుతున్నారు.

## విటమిన్-సి పుల్లటి పండ్లలో కంటే వాటిల్లోనే అధికం..!

మన శరీరానికి అవసరమైన పోషకాల్లో విటమిన్–సి అత్యంత కీలకమైనది. ఇది ఇమ్యూనిటీని పెంచడమే కాకుండా, చర్మ సౌందర్యానికి, కణాల మరమ్మత్తుకు ఎంతగానో సహాయపడుతుంది. అందుకని మన రోజూవారీ ఆహారంలో వీటిని చేర్చుకోవడం ద్వారా ఈ విటమిన్‌ని సులభంగా పొందవచ్చు. సిట్రస్ జాతికి చెందిన నారింజ పండ్లలో విటమిన్–సి పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరానికి తక్షణ శక్తిని ఇవ్వడమే కాకుండా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. విదేశీ పండైనప్పటికీ ప్రస్తుతం మన దేశంలో విరివిగా లభిస్తున్న కివీ పండులో విటమిన్–సి తోపాటు యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి.

ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. చాలామంది విటమిన్–సి కేవలం పుల్లటి పండ్లలోనే ఉంటుందని భావిస్తారు. కానీ, ఎర్రటి క్యాప్సికమ్‌లో నారింజ కంటే ఎక్కువ మొత్తంలో విటమిన్–సి ఉంటుంది. ప్రతిరోజూ తగిన మోతాదులో విటమిన్–సి ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడం ఆరోగ్యానికి మేలు. భోజనం ముగిసిన వెంటనే ఒక యాలక్కాయను నోట్లో వేసుకుని నమలడం మంచిది. యాలకుల్లో ఉండే సహజసిద్ధమైన నూనెలు లాలాజలాన్ని, డైజెస్టివ్ ఎంజైమ్‌లను ఎక్కువగా ఉత్పత్తి చేసి జీర్ణక్రియను వేగవంతం చేస్తాయి. వీటిల్లో ఉన్న కార్మినేటివ్ గుణాలు కడుపులో గ్యాస్ తయారవ్వకుండా నిరోధిస్తాయి. ఆహారంలోని పోషకాలను శరీరం సరిగ్గా గ్రహించేలా చేస్తాయి. వీటి నుంచి వచ్చే సువాసనలో మానసిక ఒత్తిడిని తగ్గించే గుణం ఉంది. యాంగ్జైటీ వల్ల వచ్చే జీర్ణ సమస్యలకు ఇది చక్కటి పరిష్కారం.




## ఐరన్ ట్యాబ్లెట్లను వాడుతున్నారా..

### అయితే ఈ సూచనలను పాటించాల్సిందే..

దేశంలో రక్తహీనత (అనీమియా) ఇప్పటికీ ప్రధాన ప్రజారోగ్య సమస్యగా కొనసాగుతోంది. ముఖ్యంగా మహిళలు, పిల్లల్లో ఈ సమస్య అధికంగా కనిపిస్తోంది. శరీరానికి అవసరమైన ఇనుము (ఐరన్) లోపించడం వల్ల రక్తహీనత ఏర్పడుతుంది. అయితే ఐరన్ లోపాన్ని భర్తీ చేసేందుకు చాలా మంది ఐరన్ ట్యాబ్లెట్లను తీసుకుంటున్నప్పటికీ, వాటిని సరైన పద్ధతిలో తీసుకోకపోవడం వల్ల ఆశించిన ఫలితాలు కనిపించడం లేదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఐరన్ శరీర ఎదుగుదల, అభివృద్ధికి అత్యంత అవసరమైన ఖనిజం. ఇది రక్తంలోని హిమోగ్లోబిన్ తయారీలో కీలక పాత్ర పోషిస్తుంది. అలాగే కండరాల్లో ఆక్సిజన్‌ను నిల్వ చేసే మయోగ్లోబిన్, కొన్ని హార్మోన్ల ఉత్పత్తికి కూడా ఐరన్ అవసరం. అందువల్ల ఐరన్ లోపం ఉంటే వైద్యుల సలహా మేరకు ఐరన్ అధికంగా ఉండే ఆహారంతోపాటు సప్లిమెంట్లను కూడా తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఐరన్ ట్యాబ్లెట్లను ఎప్పుడు, ఎలా తీసుకోవాలన్నది కూడా చాలా ముఖ్యం. నిపుణుల సూచనల ప్రకారం ఐరన్ ట్యాబ్లెట్లను ఉదయం పరగడుపున తీసుకోవడం ఉత్తమం. చాలామంది రోజూ తీసుకుంటే త్వరగా హిమోగ్లోబిన్ పెరుగుతుందని భావిస్తారు. కానీ కొన్ని పరిశోధనల ప్రకారం ప్రత్యామ్నాయ రోజుల్లో (ఒక రోజు విడిచి ఒక రోజు) తీసుకోవడం వల్ల శరీరం ఐరన్‌ను మరింత సమర్థవంతంగా గ్రహించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఐరన్ సప్లిమెంట్లతోపాటు విటమిన్–సి తీసుకోవడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. నారింజ రసం లేదా నిమ్మరసం వంటి విటమిన్–సి పానీయాలతో ఐరన్ ట్యాబ్లెట్లను తీసుకుంటే శరీరంలో ఐరన్ శోషణ మెరుగుపడుతుంది. దీంతో ఐరన్ స్థాయిలు పెరగడంలో సహాయపడుతుంది. అదే సమయంలో కొన్ని పదార్థాలతో కలిసి ఐరన్ ట్యాబ్లెట్లను తీసుకోవడం మానుకోవాలి. ముఖ్యంగా టీ, కాఫీ, కాల్షియం సప్లిమెంట్లతో ఐరన్ ట్యాబ్లెట్లను తీసుకుంటే ఐరన్ శోషణ తగ్గే అవకాశం ఉంటుంది. టీలో ఉండే టానిన్లు, కాఫీలోని కెఫిన్, కాల్షియం వంటి పదార్థాలు శరీరం ఐరన్‌ను గ్రహించే సామర్థ్యాన్ని తగ్గిస్తాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఐరన్ సప్లిమెంట్లను తీసుకోవడం ప్రారంభించిన తర్వాత కొద్ది రోజుల్లోనే హిమోగ్లోబిన్ స్థాయిలు మెరుగుపడతాయి. అయితే శరీరంలోని ఐరన్ నిల్వలు పూర్తిగా పునరుద్ధరించబడటానికి మరింత సమయం అవసరం అవుతుంది. అందుకే ఐరన్ స్థాయిలు సాధారణ స్థితికి వచ్చినా వైద్యుల సూచన మేరకు కనీసం మూడు నుంచి ఆరు నెలల పాటు సప్లిమెంట్లను కొనసాగించడం అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఐరన్ లోపాన్ని సరిచేయడంలో ట్యాబ్లెట్లు మాత్రమే కాకుండా సరైన పద్ధతిలో వాటిని తీసుకోవడం కూడా కీలక పాత్ర పోషిస్తుంది. పరగడుపున తీసుకోవడం, విటమిన్–సితో కలిపి వాడడం, టీ–కాఫీకి దూరంగా ఉండడం, చికిత్సను మధ్యలో ఆపకుండా కొనసాగించడం వంటి చిన్న జాగ్రత్తలు పాటిస్తే రక్తహీనత నుంచి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.



## ఫ్రిజ్‌లో చీజ్‌ను నిల్వ ఉంచుతున్నారా..



పాలతో తయారు చేసే పదార్థాల్లో చీజ్ ఒకటి. చీజ్ తో రకరకాల పదార్థాలను తయారు చేసి తీసుకుంటూ ఉంటారు. చీజ్ తో చేసే పదార్థాలు చాలా రుచిగా ఉంటాయి. అయితే ఫ్రిజ్‌లో చీజ్‌ను నిల్వ చేయడం చాలా మందికి ఉన్న అలవాటు. దాన్ని ఎలా నిల్వ చేస్తున్నామన్న విషయం చీజ్ నాణ్యత, తాజాదనం, ఆరోగ్య భద్రతపై ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు.పాలతో తయారు చేసే పదార్థాల్లో చీజ్ ఒకటి. చీజ్ తో రకరకాల పదార్థాలను తయారు చేసి తీసుకుంటూ ఉంటారు. చీజ్ తో చేసే పదార్థాలు చాలా రుచిగా ఉంటాయి. అయితే ఫ్రిజ్‌లో చీజ్‌ను నిల్వ చేయడం చాలా మందికి ఉన్న అలవాటు. దాన్ని ఎలా నిల్వ చేస్తున్నామన్న విషయం చీజ్ నాణ్యత, తాజాదనం, ఆరోగ్య భద్రతపై ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చీజ్‌ను ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ చేయడం సౌకర్యవంతంగా అనిపించినప్పటికీ, అది సరైన పద్ధతి కాదని హెచ్చరిస్తున్నారు.చీజ్‌ను ప్లాస్టిక్ బ్యాగ్‌లో ఉంచినప్పుడు లోపల తేమ ఉండే అవకాశం ఉంటుంది. ఈ తేమ కారణంగా అవాంఛిత ఫంగస్ (మోల్డ్) వేగంగా పెరిగే పరిస్థితులు ఏర్పడతాయి. అంతేకాకుండా కొన్ని రకాల బ్యాక్టీరియా కూడా ఇలాంటి తడి వాతావరణంలో సులభంగా పెరిగే ప్రమాదం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. మరో ముఖ్యమైన అంశం ప్లాస్టిక్‌లో ఉండే రసాయనాలు. చీజ్‌లో కొవ్వు శాతం ఎక్కువగా ఉండటం వల్ల ప్లాస్టిక్‌లోని కొన్ని పదార్థాలు ఆహారంలోకి చేరే అవకాశం ఉంటుందని ఆహార భద్రత నిపుణులు చెబుతున్నారు. దీంతో దీర్ఘకాలికంగా ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉంటుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. చీజ్‌ను సురక్షితంగా నిల్వ చేయాలంటే కాగితం ఆధారిత ర్యాపింగ్‌ను ఉపయోగించడం మంచిది. పార్చ్‌మెంట్ పేపర్ లేదా వెక్స్ పేపర్‌లో చీజ్‌ను చుట్టి, ఆ తర్వాత మూత ఉన్న డబ్బాలో ఉంచితే మరింత మెరుగైన ఫలితం ఉంటుంది. ఈ విధానం వల్ల చీజ్‌కు అవసరమైనంత గాలి ప్రసరణ లభించడంతోపాటు అదనపు తేమ పేరుకుపోకుండా ఉంటుంది. కాగితం చీజ్‌ను శ్వాసించడానికి అవకాశం కల్పిస్తుంది.

దీంతో దాని సహజ రుచి, ఆకృతి, తాజాదనం ఎక్కువ కాలం పాటు నిల్వ ఉంటాయి. అదే సమయంలో ఫంగస్ పెరుగుదల ప్రమాదం కూడా తగ్గుతుంది. అందువల్ల ఫ్రిజ్‌లో చీజ్‌ను నిల్వ చేసే సమయంలో ప్లాస్టిక్ సంచులను ఉపయోగించే బదులుగా పార్చ్‌మెంట్ లేదా వెక్స్ పేపర్‌ను ఎంచుకోవడం ఉత్తమం. ఈ చిన్న మార్పు చీజ్‌ను ఎక్కువకాలం తాజాగా ఉంచడమే కాకుండా ఆహార భద్రతను కూడా మెరుగుపరుస్తుంది.

## వచ్చే నెలకల్లా భారత్-అమెరికా తొలి దశ డీల్



మధ్యంతర వాణిజ్య ఒప్పందం పూర్తి దిశగా భారత్, అమెరికా కదులుతున్నాయని, జులై మధ్య కల్లా తొలి దశ ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉందని వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ పేర్కొన్నారు. ఒప్పందాన్ని ఖరారు చేయడానికి అమెరికా బృందం దిల్లీలో ఈనెల 4 వరకు చర్చలు జరిపినట్లు మంత్రి గుర్తు చేశారు. 'వారిని నేను కూడా కలిశాను. పెండింగ్‌లో ఉన్న అన్ని అంశాలనూ పరిష్కరించుకుంటూ ముందుకెళుతున్నాం. కాబట్టి వచ్చే నెల మధ్య ప్రాంతంలో తొలి దశ ఒప్పందానికి అవకాశం ఉంది. ఒప్పందం అనంతరం ఇతర పోటీదార్లతో పోలిస్తే, అమెరికా నుంచి భారత్‌కు ప్రాధాన్యత లభిస్తుంద'ని వివరించారు.




# 2025-26లో జీడీపీ వృద్ధి 7.7%



గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో దేశ వృద్ధిరేటు అంచనాలకు మించి రాణించింది. జీడీపీ వృద్ధి 7.7 శాతంగా నమోదైంది. 2024-25 వృద్ధిరేటు 7.1 శాతంతో పోలిస్తే ఇది ఎక్కువ. 2025-26లో స్థూల విలువ జోడింపు (రియల్ జీవీఏ) 7.9% వృద్ధిని సాధించింది. కేంద్ర గణాంక, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. 2025-26 నాలుగో త్రైమాసికం (జనవరి-మార్చి)లో జీడీపీ వృద్ధి 7.8%, జీవీఏ 7.9 శాతంగా నమోదైంది. 2025-26లో స్థిర ధరల వద్ద వాస్తవ జీడీపీని రూ.323.12 లక్షల కోట్లుగా అంచనా వేశారు. 2024-25లో ఇది రూ.299.89 లక్షల కోట్లుగా ఉంది. ప్రస్తుత మార్కెట్ ధరల వద్ద, దేశ నామినల్ జీడీపీ 8.9% వృద్ధితో రూ.346.36 లక్షల కోట్లకు చేరిందని అంచనా. 2024-25లో ఇది రూ.318.07 లక్షల కోట్లు. స్థిర, ప్రస్తుత ధరల వద్ద తయారీ, వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్, బ్రాడ్‌కాస్టింగ్ సేవలు, స్టోరేజ్, ఆర్థిక సేవలు, స్థిరాస్తి రంగాలు రెండంకెల వృద్ధి సాధించి దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం (2027-28)లో భారత్ మళ్లీ 7% వృద్ధిరేటు సాధించొచ్చని ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి.అనంత నాగేశ్వరన్ తెలిపారు. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కొంటూ దేశ ఆర్థిక వృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికి 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' వేగాన్ని పెంచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ తెలిపారు.

# యాప్ ఆధారిత క్యాబ్ సేవల్లోకి వియత్నాం సంస్థ




భారత విపణిలో యాప్ ద్వారా క్యాబ్ సేవలు అందించేందుకు వియత్నాం సంస్థ విన్ గ్రూపునకు చెందిన విద్యుత్ ట్యాక్సీ సేవల సంస్థ గ్రీన్ ఎస్ఎం సిద్ధమైంది. తొలుత దిల్లీ- ఎన్‌సీఆర్ ప్రాంతంలో కార్యకలాపాలు ప్రారంభించగా, క్రమంగా ఇతర మెట్రో నగరాలకూ సేవలు విస్తరిస్తామని తెలిపింది. ప్రీమియం వినియోగదార్లే తమ లక్ష్యమని గ్రీన్ ఎస్ఎం ఇండియా సీఈఓ బాచ్ టువాన్ అన్హ్ తెలిపారు. తమ వాహనాల లోపల, బయట సీసీ కెమేరాలు, ఏఐ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలు, డ్రైవర్లు, ప్రయాణికుల కోసం అత్యవసర సహాయ బటన్‌లు లాంటి పలు భద్రతా ప్రత్యేకతలు ఉన్నాయని తెలిపారు. వినియోగదారులు గ్రీన్ ఎస్ఎమ్ మొబైల్ అప్లికేషన్, ప్రత్యేక హాట్‌లైన్ ద్వారా లేదా తమ సేవలు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో నేరుగా రైడ్‌లు బుక్ చేసుకోవచ్చని కంపెనీ తెలిపింది. ప్రయాణికులకు మెరుగైన సేవల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన 7 సీట్ల విద్యుత్తు ఎస్‌యూవీ విన్‌ఫాస్ట్ లిమో గ్రీన్‌ను ఈ సేవల కోసం గ్రీన్ ఎస్ఎమ్ ఉపయోగించనుంది. దేశవ్యాప్తంగా ఛార్జింగ్ స్టేషన్లను అభివృద్ధి చేస్తున్న విగ్రీన్‌తో భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు గ్రీన్ ఎస్ఎమ్ తెలిపింది.

# పెరిగిన దేశీయ మారకపు నిల్వలు



మన విదేశీ మారకపు నిల్వలు మే 28తో ముగిసిన వారంలో 938 మిలియన్ డాలర్లు పెరిగి 682.321 బిలియన్ డాలర్లకు చేరాయి. ఆర్‌బీఐ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. విదేశీ మారకపు నిల్వల్లో కీలకమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 3.116 బిలియన్ డాలర్లు పెరిగి 546.148 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. పసిడి నిల్వల విలువ 2.186 బిలియన్ డాలర్లు తగ్గి 112.6 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ ఎలాంటి మార్పు లేకుండా 18.747 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత నిల్వల స్థితి 8 మిలియన్ డాలర్లు పెరిగి 4.826 బిలియన్ డాలర్లకు చేరింది. ఇంతకుముందు మే 21తో ముగిసిన వారంలో మనదేశ విదేశీ మారకపు నిల్వలు 7.511 బి.డాలర్లు తగ్గి 681.384 బి.డాలర్లుగా నమోదయ్యాయి.

# అగ్రగామి 4 కంపెనీల్లోకి టాటా మోటార్స్!





ఇటలీ ట్రక్కుల తయారీ సంస్థ 'ఇవెకో'ను కొనుగోలు చేయడం ద్వారా ప్రపంచంలో అగ్రగామి 4 వాణిజ్య వాహన తయారీ సంస్థల్లో ఒకటిగా టాటా మోటార్స్ నిలవనుందని కంపెనీ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తెలిపారు. గోవాలో జరిగిన టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ డీలర్ బిజినెస్ ప్లానింగ్ మీట్ 2026లో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. 2017లో టాటా గ్రూప్ వార్షికాదాయం 100 బిలియన్ డాలర్లు (సుమారు రూ.9.50 లక్షల కోట్లు) అయితే.. ఇప్పుడు గ్రూప్ వాహన విభాగం ఒక్కటే 80 బి.డాలర్ల (రూ.7,60,000 కోట్లు) ఆదాయాన్ని నమోదు చేస్తోందని, ప్రపంచవ్యాప్తంగా పోటీ ఇచ్చేలా కంపెనీ తయారైందని వెల్లడించారు. 'అంతర్జాతీయంగా అత్యంత ప్రభావవంతమైన వాణిజ్య వాహన సంస్థను నిర్మించనున్నాం. ఇవెకో కొనుగోలు ద్వారా ప్రపంచ అగ్రగామి సంస్థల సరసన టాటా మోటార్స్ నిలుస్తుంది' అని చంద్రశేఖరన్ ధీమా వ్యక్తం చేశారు. ఇవెకో కొనుగోలుకు సంబంధించి, నియంత్రణపరమైన అనుమతుల ప్రక్రియ నడుస్తోందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబరులో ఈ లావాదేవీ పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. దీని వల్ల అధునాతన అంతర్జాతీయ సాంకేతికతలు, విదేశీ మార్కెట్లు టాటాలకు అందుబాటులోకి వస్తాయి.

రాబోయే అయిదేళ్ల పాటు బలంగా ఉన్న విభాగాల్లో అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంటూనే, కొత్తగా అభివృద్ధి చెందుతున్న విభాగాల్లో అగ్రస్థానాన్ని దక్కించుకోవడంపై టాటా మోటార్స్ దృష్టి పెట్టనుంది. వచ్చే 3-4 ఏళ్లలో అమ్మకాల వృద్ధి ద్వారా, పలు మార్కెట్లలో కంపెనీ మరింత బలోపేతం కానుంది.

సాంకేతికత, ఆవిష్కరణల్లో అగ్రస్థానంలో కొనసాగడానికి టాటా మోటార్స్ పరిశోధన- అభివృద్ధిపై పెట్టుబడులు పెట్టనుంది. వాణిజ్య వాహన విభాగాల్లో విద్యుత్ మోడళ్లు తీసుకురావడం, హైడ్రోజన్‌తో నడిచే వాహనాలు సహా భవిష్యతరం ఇంజిన్లు అభివృద్ధి చేయడం, డిజిటలైజేషన్, ఏఐ ఆధారిత మార్పులపై దృష్టి పెట్టనుంది.




## మూడో భారత వికెట్ కీపర్‌గా రిషభ్ పంత్ ఘనత



వైస్ కెప్టెన్సీని కోల్పోయినప్పటికీ అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టు మ్యాచ్‌కు రిషభ్ పంత్ ఎంపికైన సంగతి తెలిసిందే. తుది జట్టులోనూ చోటు దక్కడంతో ఓ అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. భారత్ తరఫున 50 అంతకంటే ఎక్కువ టెస్టుల్లో ప్రాతినిధ్యం వహించిన వికెట్ కీపర్ల జాబితాలోకి పంత్ చేరాడు. అఫ్గాన్‌తో టెస్టు మ్యాచ్ అతడికి 50వ టెస్టు. భారత్ నుంచి ఎంఎస్ ధోని (90), సయ్యద్ కిర్మాణి (88) అందరికంటే ముందున్నారు. టెస్టు క్రికెట్ చరిత్రలో 50 మ్యాచులను పూర్తి చేసుకున్న వికెట్ కీపర్లలో రిషభ్ పంత్‌ది 34వ స్థానం. కేవలం ఇద్దరు మాత్రమే 100కి పైగా టెస్టులు ఆడారు. దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు మార్క్ బౌచర్ (147), ఆసీస్‌కు చెందిన ఇయాన్ హీలే (119) మాత్రమే ఈ మార్క్‌ను దాటారు. ధోని, ఆడమ్ గిల్‌క్రిస్ట్, రాడ్ మార్ష్, అలన్ నాట్, ఇవాన్స్ తదితరులు 90 అంతకంటే ఎక్కువ టెస్టులు ఆడిన వికెట్ కీపర్లు.


# యావత్ భారత్ గర్వపడుతోంది: ప్రజ్ఞానందపై అదానీ ప్రశంసలు




ప్రతిష్ఠాత్మక నార్వే చెస్ టోర్నీ టైటిల్‌ను గెలిచిన తొలి భారత ప్లేయర్‌గా 20 ఏళ్ల ప్రజ్ఞానంద ఘనత సాధించాడు. విశ్వనాథన్ ఆనంద్, గుకేశ్‌కు దక్కని నార్వే టైటిల్‌ను ప్రజ్ఞానంద సొంతం చేసుకోవడం విశేషం. 2013లో నార్వే చెస్ టోర్నీ మొదలైంది. ఇప్పటివరకు ఎక్కువగా మాగ్నస్ కార్ల్‌సన్ విజేతగా వస్తూ వచ్చాడు. ఈసారి మాత్రం హేమాహేమీలను ఓడించి మరీ ప్రజ్ఞానంద ఛాంపియన్‌గా అవతరించాడు. ఈ క్రమంలో అతడిపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజ్ఞానందకు అదానీ గ్రూప్ స్పాన్సర్‌గా ఉంది. "నిర్భయంగా, ఏకాగ్రతతో సిసలైన భారత ఛాంపియన్‌గా నిలిచావు. కంగ్రాట్స్ ప్రజ్ఞానంద. నార్వే చెస్ టోర్నీ విజేతగా నిలిచిన తొలి భారత గ్రాండ్‌మాస్టర్ నువ్వు. చదరంగ ప్రపంచంలో సహనం, ఓర్పు, మేధస్సు, మానసిక దృఢత్వానికి సంబంధించి అత్యున్నత పరీక్షలలో ఇది ఒకటి. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన వేదికపై అత్యుత్తమ ఆటగాళ్లను ఓడించడం అద్భుతమైన ఘనత. నీ ఆటతీరుతో దేశం గర్వపడేలా చేశావు ప్రగ్. ఆత్మవిశ్వాసంతో ఆడిన తీరు అమోఘం" అని గౌతమ్ అదానీ పోస్టు పెట్టారు. 'సింహాన్ని దాని గుహలోనే ఎదుర్కోవడం.. అంటే ఓ శక్తిమంతమైన ప్రత్యర్థిని వారి సొంత స్థావరంలోనే ధైర్యంగా ఎదుర్కోవడం అని దీని అర్థం. చాన్నాళ్లుగా నార్వే చెస్ అనేది మాగ్నస్ కార్ల్‌సన్ డెన్. అతడి సొంతం. ఆధిపత్యం ప్రదర్శించిన ప్రాంతం. ఉదయాన్నే ఈ వార్త విన్నాక నోరెళ్లబెట్టేంత ఆశ్చర్యం కలిగింది. ప్రజ్ఞానంద నువ్వు కేవలం టైటిల్‌ను నెగ్గడమే కాదు.. సింహం బోనులోకి వెళ్లి మరీ విజయం సాధించావు. ట్రోఫీగా మాత్రమే కాకుండా నీ సాహసోపేతమైన స్ఫూర్తికి ఈ టైటిల్ అత్యంత ముఖ్యం. నీ నుంచి మేం చాలా విషయాలు నేర్చుకోవచ్చు" అని పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా పోస్టు పెట్టారు.

## పగటి పూట గులాబికి గంభీర్ ఒకే

పగటి పూట టెస్టు మ్యాచ్‌ల్లో వెలుతురు మందగించినపుడు ఇరు జట్ల సమ్మతితో గులాబి బంతిని ఉపయోగించాలన్న ఐసీసీ నిర్ణయాన్ని టీమ్‌ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్ స్వాగతించాడు. భారత్, అఫ్గానిస్థాన్ మధ్య ఏకైక టెస్టు శనివారం ప్రారంభం కానున్న నేపథ్యంలో గంభీర్ విలేకరులతో మాట్లాడుతూ.. "ఈ నిర్ణయం నాకు చాలా నచ్చింది. ఫలితం రావడం కోసం మార్గం ఉంటే, దాన్ని అవలంబించాలనేది నేను నమ్ముతాను. మీరు ప్రపంచ



టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు ముందు మ్యాచ్ ఆడుతున్నారు. అందులో గెలిచి తుదిపోరుకు అర్హత సాధించే అవకాశం మీ ముందుంది. కానీ వెలుతురు లేమి వల్ల ఆ మ్యాచ్‌కు ఆటంకం కలిగితే, పరిస్థితి ఏంటి? కాబట్టి మ్యాచ్ ఫలితం రాబట్టేందుకు ఏదైనా అవకాశం ఉంటే.. రెండు జట్ల అంగీకారంతో ముందుకెళ్లడమే ఉత్తమం. అయితే ఒకే మ్యాచ్‌లో ఎర్ర బంతి నుంచి పింక్ బాల్‌కు అన్వయించుకోవడం చాలా కష్టమే. కానీ కొన్ని కీలక మ్యాచ్‌ల్లో ఇలాంటి ఇబ్బందులతో సర్దుకోక తప్పదు. అలాంటి సందర్భాల్లో ఈ నిబంధన విలువ తెలుస్తుంది. టెస్టు క్రికెట్లో ఇది సానుకూల మార్పుగానే భావించాలి. అన్ని జట్లు కూడా దీన్ని సానుకూలంగా తీసుకుంటాయని ఆశిస్తున్నా" అని చెప్పాడు. రిషబ్ పంత్‌ను వైస్ కెప్టెన్‌గా తప్పించడంపై గంభీర్ స్పందించాడు. "ఏ ఫార్మాట్లోనైనా పరుగులు చేయడం, వికెట్లు తీయడమే లక్ష్యం. ఈ క్రమంలో మ్యాచ్ పరిస్థితుల్ని అర్థం చేసుకోవడం ప్రధానం. రిషబ్ పంత్ ఆ కోవలోకే వస్తాడు. అలా అని తన ఆటను మార్చాలని మేం చూడడం లేదు. కానీ అంతర్జాతీయ క్రికెట్లో పరిస్థితులకు తగ్గట్లు ఆడడం చాలా ముఖ్యం. ఏ ఆటగాడికైనా భారత్‌కు ఆడడమే అంతిమ బాధ్యత.

# అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టు మ్యాచ్‌లో భారత్‌కు శుభారంభం

అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టు మ్యాచ్‌లో భారత్‌కు శుభారంభం దక్కింది. తొలిరోజు లంచ్ బ్రేక్ సమయానికి 25 ఓవర్లలో ఒక్క వికెట్ నష్టానికి 96 పరుగులు చేసింది. క్రీజ్‌లో కేఎల్ రాహుల్ (37★), సాయి సుదర్శన్ (32★) ఉన్నారు. అంతకుముందు ఓపెనర్ యశస్వి జైస్వాల్ (24) దూకుడుగానే ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టాడు. అయితే, సలీమ్ సాఫి బౌలింగ్‌లో వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. అంతకుముందు 11 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద యశస్వికి లైఫ్ దక్కినా దాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఓపెనర్‌గా వచ్చిన కేఎల్ రాహుల్ సాధికారికంగా ఆడలేకపోయాడు. పరుగుల ఖాతా తెరిచేందుకే చాలా సమయం పట్టింది. అయితే, కేఎల్ రాహుల్‌కు అదృష్టం కలిసొచ్చింది.



ఇన్నింగ్స్ 11వ ఓవర్‌లో రహ్మాన్ విసిరిన బంతిని ఆడటంలో కేఎల్ విఫలమయ్యాడు. అది వికెట్ కీపర్ చేతిలోకి వెళ్లింది. అయితే, క్యాచ్ కోసం అప్పీలు చేసినా అంపైర్ ఇవ్వలేదు. వికెట్ కీపర్ డీఆర్ఎస్ కోసం సుముఖత వ్యక్తం చేయలేదు. అయితే, తర్వాత రిప్లేలో బ్యాట్‌ను బంతి తాకినట్లు కనిపించడంతో అఫ్గాన్ ప్లేయర్లు నిరాశకు గురయ్యారు. ఆ తర్వాత సలీమ్ సాఫి వేసిన 16వ ఓవర్‌లో ఎల్బీ కోసం డీఆర్ఎస్‌కూ వెళ్లలేదు. బంతి వికెట్లను తాకినట్లు అనిపించింది. కానీ, అంపైర్స్ కాల్ కావడంతో సమీక్ష తీసుకున్నా ఫలితం ఉండేది కాదు. వన్‌డౌన్‌లో వచ్చిన సాయి సుదర్శన్‌కూ 20 పరుగుల వద్ద లైఫ్ దొరికింది. స్లిప్‌లోని ఫీల్డర్ క్యాచ్‌ను వదిలేశాడు.

## శ్రేయస్‌కు ఖాయమైనట్లే..

ఐపీఎల్‌లో సారథిగా నిలకడగా రాణిస్తున్న శ్రేయస్ అయ్యర్.. భారత టీ20 జట్టు పగ్గాలు అందుకోబోతున్నట్లే. సూర్యకుమార్ యాదవ్ స్థానంలో సెలక్టర్లు అతణ్ని కొత్త



కెప్టెన్‌గా ప్రకటించనున్నట్లు సమాచారం. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలతో సహా ఆసియా క్రీడలకు భారత టీ20 జట్టును ఎంపిక చేసేందుకు శనివారం జాతీయ సెలక్షన్ కమిటీ సమావేశం కానుంది. ఈ మార్చిలో భారత్‌కు పొట్టి ప్రపంచకప్ అందించినప్పటికీ, బ్యాటర్‌గా పేలవ ఫామ్‌లో ఉన్న సూర్యకుమార్‌పై కెప్టెన్‌గానే కాక ఆటగాడిగానూ వేటు పడనున్నట్లు తెలుస్తోంది. తెలుగు కుర్రాడు, బ్యాటర్ తిలక్ వర్మ వైస్ కెప్టెన్ అయ్యే అవకాశాలున్నాయి. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ జాతీయ జట్టులో తొలిసారి చోటు దక్కించుకోవచ్చనే చర్చ జరుగుతోంది. మొదట జూన్ 26, 28 తేదీల్లో భారత్.. ఐర్లాండ్‌తో రెండు టీ20లు ఆడనుంది. ఆ తర్వాత జులై 1 నుంచి ఇంగ్లాండ్‌తో అయిదు టీ20లు, మూడు వన్డేల్లో తలపడుతుంది. సెప్టెంబరులో జపాన్‌లో ఆసియా క్రీడలు జరగనున్నాయి. సీనియర్ పేసర్ మహ్మద్ షమిని సెలక్టర్లు పరిగణనలోకి తీసుకునే సూచనలు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌లో ఆర్సీబీ తరఫున అద్భుతంగా (28 వికెట్లు) బౌలింగ్ చేసిన భువనేశ్వర్ కుమార్ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరం. భువి గతంలో ఇంగ్లిష్ పిచ్‌లపై ఆకట్టుకున్నాడు. అయితే దీర్ఘకాల ప్రయోజనాల దృష్ట్యా అతణ్ని ఎంపిక చేయడం కష్టంగానే కనిపిస్తోంది.

